శనివారం
21•12•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 176
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE









శీతాకాల విడిది కోసం శుక్రవారం హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దంపతులకు హకీంపేట విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ కూడా ఉన్నారు

## హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి

- శీతాకాల విడిదికి వచ్చిన రామ్‌నాథ్ కోవింద్
- 28 వరకు బొల్లారం రాష్ట్రపతిభవన్‌లో బస
- ఘనస్వాగతం పలికిన గవర్నర్, ముఖ్యమంత్రి

2

### దేశంలోనే గొప్ప రాష్ట్రం
## తెలంగాణ

కాళేశ్వరం ఇంజినీరింగ్ అద్భుతం

హరితహారం గొప్ప కార్యక్రమం

సీఎం కేసీఆర్‌కు అభినందనలు

విద్యుత్‌రంగంలోనూ తెలంగాణ భేష్

టీఎస్ రెడ్‌కో ఇంధన పొదుపు అవార్డుల ప్రదానోత్సవంలో గవర్నర్ తమిళిసై



2

## కాళేశ్వరంలో మరో అద్భుతం

ప్రారంభానికి సిద్ధమైన అన్నపూర్ణ రిజర్వాయర్

90 రోజుల్లో 88.24 టీఎంసీల ఎత్తిపోత

3

ఇక్కడినుంచి రంగనాయకసాగర్, మల్లన్నసాగర్‌కు తరలింపు



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్

# నిరసన జ్వాలలు

### దేశవ్యాప్తంగా పౌరసత్వచట్ట వ్యతిరేక ప్రదర్శనలు

- యూపీ రణరంగం.. రాష్ట్రమంతటా నిరసనలు
- ప్రధాన నగరాల్లో చెలరేగిన హింస.. తొమ్మిది మంది మృతి
- 12కుపైగా జిల్లాల్లో మొబైల్ సేవలు బంద్
- ఢిల్లీలో జామా మసీదు వద్ద వేలమంది ప్రదర్శన
- యూటర్న్ తీసుకుంటున్న బీజేపీ మిత్రపక్షాలు
- మెత్తబడుతున్న కేంద్రం.. సలహాల స్వీకరణకు సిద్ధమని వెల్లడి

5

**పౌరసత్వ** సవరణ చట్టంపై దేశవ్యాప్తంగా ప్రజాగ్రహం కొనసాగుతున్నది. నిరసనల నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ రణరంగంగా మారింది. హింసాత్మక ఘటనల్లో తొమ్మిదిమంది మరణించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో పోలీసులు, ఆందోళనకారుల మధ్య ఘర్షణ, లాఠీచార్జి, కాల్పులతో భీతావహ వాతావరణం నెలకొన్నది. దీంతో 12కుపైగా జిల్లాల్లో 45 గంటలపాటు ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. మరోవైపు ఢిల్లీలోని చారిత్రక జామా మసీదు సీఏఏ వ్యతిరేక ఆందోళనకు వేదికైంది. ప్రార్థనల అనంతరం వేలమంది ముస్లింలు జాతీయ జెండాలు, ప్లకార్డులతో నిరసన తెలిపారు. చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని భీమ్ ఆర్మీ వీరికి తోడైంది. దర్యాగంజ్, ఇండియా గేట్ వద్ద హింసాత్మక ఘటనలు జరిగాయి. కర్ణాటకలో మంగళూరుతోపాటు దక్షిణ కన్నడ జిల్లాలో 48 గంటలపాటు మొబైల్ సేవలను నిలిపివేశారు. కేరళలో గురువారం అర్ధరాత్రి నుంచి నిరసనలు హోరెత్తాయి. దీంతో ఉత్తర కేరళలోని నాలుగు జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించారు. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా, ముర్షీదాబాద్, హౌరా తదితర నగరాల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. పుణెలో జరిగిన ప్రదర్శనలో దాదాపు 10వేల మంది పాల్గొన్నారు. ప్రజాగ్రహం నేపథ్యంలో బీజేపీ మిత్రపక్షాలైన జేడీయూ, లోక్ జనశక్తి పార్టీ యూటర్న్ తీసుకున్నాయి. కేంద్రం సైతం కాస్త మెత్తబడింది. చట్టంపై ప్రజల నుంచి సలహాలు స్వీకరించేందుకు సిద్ధమని ప్రకటించింది.



శుక్రవారం యూపీలోని ముజఫర్‌నగర్‌లో ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పరుగులుతీస్తున్న పోలీసులు

### ఢిల్లీలో భీమ్ ఆర్మీ..

**ఢిల్లీలోని** చారిత్రక జామా మసీదు వద్ద ఆందోళనలో పాల్గొన్న భీమ్ ఆర్మీ నేత చంద్రశేఖర్ ఆజాద్.. అంబేద్కర్ ఫొటోను ఒక చేతిలో, రాజ్యాంగ ప్రతిని మరో చేతిలో పట్టుకొని సీఏఏకు నిరసనగా నినాదాలిస్తున్న దృశ్యం. పోలీసులు ఆజాద్‌ను అదుపులోకి తీసుకొని, వ్యాన్‌లో ఎక్కించేందుకు ప్రయత్నిస్తుండగా ఆయన తప్పించుకొని నిరసనకారుల్లో కలిసిపోయారు.



ఉన్నావ్ రేప్ కేసులో

## సెంగార్‌కు జీవితఖైదు



రూ.25 లక్షల జరిమానా

బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యేకు శిక్ష ఖరారుచేసిన ఢిల్లీ కోర్టు

బాధితురాలి కుటుంబ రక్షణకు ఏర్పాట్లు చేయాలని సీబీఐకి ఆదేశం

సెంగార్‌కు ఉరిశిక్ష విధించాలన్న బాధిత కుటుంబం

III

జైపూర్ పేలుళ్ల కేసు

## దోషులకు మరణశిక్ష

తీర్పు వెల్లడించిన ప్రత్యేక కోర్టు

2008లో వరుస పేలుళ్ల ఘటన, 70 మంది దుర్మరణం

III

## జార్ఖండ్‌లో బీజేపీకి ఎదురుగాలి!

జేఎంఎం-కాంగ్రెస్-ఆర్జేడీ కూటమివైపే ఎగ్జిట్‌పోల్స్ మొగ్గు

ప్రశాంతంగా ముగిసిన చివరి విడుత ఎన్నికలు.. 23న ఫలితాల వెల్లడి

5

# మూడేండ్లలోనే కాళేశ్వరం పూర్తి

రాష్ట్రం సాధించిన అద్భుత విజయమిది

- తెలంగాణ వందశాతం సెక్యులర్ రాష్ట్రం
- అన్ని మతాల పండుగలు జరుపుతున్నాం
- అందరితో సమానంగా క్రైస్తవులకు చేయూత
- క్రిస్మస్ వేడుకల్లో సీఎం కే చంద్రశేఖర్‌రావు

• హ్యాపీ క్రిస్మస్.. మెర్రీ క్రిస్మస్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ రాష్ట్రం సాధించిన గొప్ప విజయాల్లో కాళేశ్వరం ప్రాజెక్టు ఒకటని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చెప్పారు. తెలంగాణలో అన్ని మతాలకు సమాన ప్రాధాన్యం కల్పిస్తున్నామని, ఈ రాష్ట్రం వందకు వందశాతం సెక్యులర్ రాష్ట్రమని స్పష్టంచేశారు. రాష్ట్రంలో అందరికీ అందినట్టే క్రైస్తవులకు కూడా చేయూతనందిస్తామని చెప్పారు. శుక్రవారం సాయంత్రం ఎల్బీస్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్‌ట్రీని వెలిగించడంతోపాటు కేక్‌ను కట్‌చేసి సీఎం కేసీఆర్ క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. ఆ తర్వాత క్రైస్తవ మతపెద్దలు కేసీఆర్‌కు ఆశీర్వచనాలు చేశారు. క్రైస్తవులకోసం సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో పండుగను నిర్వహించడమేకాకుండా క్రైస్తవ భవననిర్మాణానికి రెండెకరాలు, రూ.10 కోట్లు మంజూరు చేశారని ప్రశంసించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ, ఎన్నడూలేని విధంగా మన ప్రాంతంలో అద్భుతం జరిగిందని, 20, 25 ఏండ్లలో పూర్తిచేసే కాళేశ్వరం ప్రాజెక్టును.. అందరి దీవెనలు, సహకారంతో పట్టుదలతో మూడేండ్లలోనే పూర్తి చేసుకున్నామని చెప్పారు. కాళేశ్వరం ద్వారా రెండు పంటలకు కలిపి 75 లక్షల ఎకరాలకు సాగునీరు వచ్చే అవకాశం ఉన్నదని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ కరువున్నా ఈ ప్రాజెక్టు ఆదుకుంటుందని చెప్పారు. వచ్చే జూన్‌నుంచి

మిగతా 2వ పేజీలో



శుక్రవారం ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి కేసీఆర్



### భవన నిర్మాణాలకు అనుమతులు
## సింగిల్ విండోలో

- టీఎస్‌ఐపాస్ తరహాలో విధానం.. అనుమతుల్లో వేగం.. పారదర్శకత
- తప్పుడు అనుమతులు తీసుకున్నా.. అక్రమనిర్మాణాలు చేపట్టినా కూల్చివేతలే
- టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పనితీరుపై అనుమానాలు తొలగిస్తాం
- రాష్ట్రస్థాయి టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సమావేశంలో మంత్రి కేటీఆర్

2

**చికెన్ ధరలు** (వెన్‌కాబ్) (రూ.)

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 93.00 | రిటైల్ లైవ్ | 115.00 |
| డ్రెస్డ్ | 167.00 | స్కిన్‌లెస్ | 190.00 |

**గుడ్ల ధరలు** (వందకు) (రూ.)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 415.00 | రంగారెడ్డి | 415.00 |
| మెదక్ | 415.00 | కరీంనగర్ | 418.00 |
| వరంగల్ | 418.00 | డజన్ ధర | 66.00 |

## ఏడాది పొడవునా 'ఆపరేషన్ స్మైల్'



- పిల్లల రవాణా ముఠాలపై కఠిన వైఖరి
- ఆపరేషన్ స్మైల్-6 ప్రారంభంలో డీజీపీ మహేందర్‌రెడ్డి ప్రకటన
- మానవతాదృక్పథం, విశ్వసనీయతతో విధులు నిర్వర్తిస్తేనే సత్ఫలితాలుంటాయని వెల్లడి

III






హకీంపేట విమానాశ్రయంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు స్వాగతం పలుకుతున్న సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు

# హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి

- శీతాకాల విడిదికి వచ్చిన రామ్‌నాథ్ కోవింద్
- 28వరకు బొల్లారం రాష్ట్రపతిభవన్‌లో బస
- ఘనస్వాగతం పలికిన గవర్నర్, ముఖ్యమంత్రి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో హకీంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, సీఎం కేసీఆర్ స్వాగతం పలికారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్‌తో పాటు మంత్రులు మహమూద్‌అలీ, కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్, ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, కొప్పుల ఈశ్వర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సీహెచ్ మల్లారెడ్డి, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితారెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి డీజీపీ మహేందర్‌రెడ్డి, మేడ్చల్ కలెక్టర్ ఎంవీ రెడ్డి, సైబరాబాద్ సీపీ సజ్జనార్ తదితరులు స్వాగతం పలికినవారిలో ఉన్నారు.

### 27న రాష్ట్రపతి నిలయంలో 'ఎట్‌హోం

రాష్ట్రపతి కోవింద్ ఈ నెల 28 వరకు బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌లో బసచేయనున్నారు. 22న సాయంత్రం రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి విందు కార్యక్రమంలో పాల్గొంటారు. విందుకు గవర్నర్, ముఖ్యమంత్రితోపాటు పలువురు ప్రముఖులు హాజరవుతారు. అదేరోజు తెలంగాణ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రాజ్‌భవన్‌లో జరిగే కార్యక్రమంలో సొసైటీ మొబైల్‌యాప్‌ను రాష్ట్రపతి ఆవిష్కరిస్తారు. 23న పుదుచ్చేరి, 25న కన్యాకుమారిలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. 27న బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో 'ఎట్‌హోం' నిర్వహించనున్నారు. ప్రభుత్వ ప్రతినిధులు, ప్రముఖులు ఈ విందు కార్యక్రమంలో పాల్గొంటారు. రాష్ట్రపతి 28 ఢిల్లీకి తిరుగుపయనమవుతారు.



రాజ్‌భవన్ కార్యకలాపాలపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు నివేదిక అందజేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్. చిత్రంలో హోంమంత్రి మహమూద్ అలీ తదితరులు ఉన్నారు.



# ఆధ్యాత్మికతతో శాంతి.. సుఖం

- భగవంతుడి కరుణ కలుగాలంటే లీనమై ప్రార్థించాలి
- ధైర్యంగా, విశ్వాసం, ప్రేమతో దేవుడిని పూజించాలి
- చాగంటి కోటేశ్వరరావు అద్భుతమైన ప్రవచనకర్త
- భాగవత సప్తాహంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భక్తి, ఆధ్మాత్మికత అలవర్చుకోగలిగితే శాంతి, సుఖం లభిస్తాయని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చెప్పారు. భగవంతుడి కరుణ కలుగాలంటే లీనమై వినాలని, ప్రార్థించాలని అన్నారు. దేవుడిని ధైర్యంగా, విశ్వాసం, ప్రేమభావంతో పూజించాలని చెప్పారు. తెలంగాణ కళాభారతి ప్రాంగణంలో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావుతో ఏర్పాటుచేసిన భాగవత సప్తాహంలో భాగంగా చివరిరోజు శుక్రవారంనాటి కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం దంపతులు చాగంటి కోటేశ్వరరావును సన్మానించారు. కార్యక్రమంలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. భగవంతుని గురించి చదివినా, విన్నా, ఇతరులకు చెప్పినా చాలా పెద్దపుణ్యం వస్తుందనేది మనందరి విశ్వాసమన్నారు. మహాభారతంలో ద్రౌపది వస్త్రాపహరణం గురించి ప్రస్తావిస్తూ.. తన వస్త్రాలు లాగేస్తుంటే ఒక చేతిని అడ్డంపెట్టుకుని తనను కాపాడాలని ద్రౌపది మరో చేత్తో దీనంగా అర్థిస్తుంటుందని, ఆమె తన స్వశక్తి చాలదనుకుని, అశక్తురాలై, రెండు చేతులు జోడించి 'పరమాత్మా, పరంజ్యోతి.. నీవు తప్ప నాకు ఇంకెవ్వరులేరు.. ఇక మీరే వచ్చి ఆదుకోవాలి' అని ప్రార్థించినప్పుడు తక్షణం బయలుదేరి ఆమెను రక్షిస్తాడని వివరించారు. గజేంద్ర మోక్షం గురించి చెప్తూ.. గజరాజు మొసలి చేతిలో చిక్కి చాలా పెనుగులాడుతూ ఉంటుందని, తన శక్తిచాలదనుకున్నప్పుడు భగవంతున్ని ప్రార్థిస్తుందని, ప్రార్థన కూడా సంశయాత్మకంగా ఉంటుందని అన్నారు. 'కలడందురు దీనుల యెడ.. కలడందురు పరమయోగి గణముల పాలన్.. కలడందురన్ని దిశలన్.. కలడు కలండనెడువాడు కలడోలేడో' అంటూ భగవంతుడు ఉన్నాడో లేడో అనే సందేహంతో గజరాజు ప్రార్థించినప్పుడు భగవంతుడు రాడని, చివరకు నీవే తప్ప నాకు ఇంకే దిక్కులేదని గజేంద్రుడు ప్రార్థిస్తే అప్పుడు వచ్చి కాపాడుతాడని చెప్పారు. భగవంతుడి కరుణ మనకు కలుగాలంటే మనం లీనమై వినాలని, లీనమై ప్రార్థించాలని సీఎం కేసీఆర్ చెప్పారు. చిన్నప్పుడు తనకు రెండుమూడువేల పద్యాలు కంఠతా వచ్చేవని, ఇప్పుడు కొన్ని గుర్తుకు రావడంలేదని అన్నారు.

### దైవాన్ని విశ్వసించేవారిలో నేనూ ఒకడిని

చాగంటి కోటేశ్వరరావు తన ప్రవచనాల్లో డొక్కా సీతమ్మ గురించి చెప్తుంటారని, ఎవరూ ఆకలితో ఉండకూడదనే భావనతో జీవితమంతా అన్నదానం చేసిన మహత్తరమైన వ్యక్తి అని అన్నారు. ఆమె గురించి తెలిసినవారు ఆమెను దైవస్వరూపంగా చూశారని చెప్పారు. ఇలాంటి ఉత్తమమైన లక్షణం మనుషులకు, భవిష్యత్ తరాలకు మంచిదనే ఉద్దేశంతో చాగంటిలాంటివారు తమ ప్రవచనాల్లో ఆమె గురించి చెప్తుంటారని పేర్కొన్నారు. భక్తి, ఆధ్యాత్మికత మనం కూడా అలవర్చుకోగలిగితే మనకు శాంతి, సుఖం లభిస్తాయని చెప్పారు. భగవంతుడి కరుణ కూడా తప్పకుండా లభిస్తుందన్నారు. తాను దైవాన్ని పూర్తిగా విశ్వసిస్తానని, బాహాటంగానే పూజిస్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టంచేశారు. 'భగవంతుడిని పూజించదల్చుకున్నప్పుడు ధైర్యంగా, విశ్వాసంతో, ప్రేమతో, భావంతో పూజచేయాలి. ఎవరేమనుకుంటారో అనుకుని పూజలు చేసేవాళ్లు పూజలు మానేయాలి. పూజలు పూర్తి భక్తిభావంతో చేస్తే సమాజానికి, అందరికీ మంచిది' అని చెప్పారు.



శుక్రవారం తెలంగాణ కళాభారతి ప్రాంగణంలో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును సన్మానిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, శోభ దంపతులు

### కొందరు మృగాలుగా ప్రవర్తిస్తున్నారు..

ఈ మధ్య మనసుకు చాలాబాధ కలిగించే విషయాలు జరుగుతున్నాయని సీఎం కేసీఆర్ విచారం వ్యక్తంచేశారు. ఎందుకో మానవ ప్రవృత్తి మారిపోతున్నదని, కొందరు మృగాలుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. దేవాలయం గొప్ప కమ్యూనిటీ సెంటర్ అని, కొందరు తెలియక దానిని ఛాందసవాదమని మాట్లాడుతుంటారని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరంలేదన్నారు. 'దేవాలయానికి వెళ్తే చెప్పులు వదిలి, క్యూ లైన్లో వెళ్తాం. వీటన్నింటితో స్వీయక్రమశిక్షణ వస్తుంది. ఎక్కడికిపోయినా రాని క్రమశిక్షణ దేవాలయానికి వెళ్తే ఇట్టే వస్తుంది' అని సీఎం కేసీఆర్ చెప్పారు.

### చాగంటి అద్భుతమైన ప్రవచనకర్త

సంస్కారం, మంచి, సద్గుణాలు, భక్తిభావాన్ని పెంపొందించే ప్రవచనం గొప్పగా అందించిన చాగంటి కోటేశ్వరరావుకు రాష్ట్రం తరపున, కుటుంబపక్షాన సీఎం ధన్యవాదాలు తెలిపారు. చాగంటి అద్భుతమైన ప్రవచనకర్త అని కొనియాడారు. మానవజాతికి దొరికిన గొప్ప మణిపూస అని అభివర్ణించారు. తాను కూడా చాలా సందర్భాల్లో ఆయన ప్రవచనాలు విన్నానని తెలిపారు. చాగంటి ద్వారా సమాజానికి మేలు, లాభం తప్పక జరుగుతాయని చెప్పారు.

## స్ఫూర్తిమంత నేత కేసీఆర్

- బ్రహ్మశ్రీ చాగంటి ప్రశంసలు
- ముగిసిన భాగవత సప్తాహం
- హాజరైన సీఎం కేసీఆర్ దంపతులు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాష్ట్రం చక్కటి పురోభివృద్ధి పొందాలని ఆశిస్తూ, తాను ధార్మికుడై, చక్కటి అనురక్తి కలిగిన ముఖ్యమంత్రి ఉండటం ఎంతో సంతోషకరమని ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు చెప్పారు. సమకాలీన సమాజంలో స్ఫూర్తిమంత నాయకత్వ లక్షణాలు కలిగిన నాయకుడిని చూడాలని అందరూ అనుకుంటారని, తాను కూడా సీఎం కేసీఆర్‌ను దగ్గరగా చూడాలని కోరుకునేవాడినని తెలిపారు. ఈ రోజు ఆ అవకాశం దొరికిందని సంతోషం వ్యక్తంచేశారు. తెలంగాణ కళాభారతి ప్రాంగణంలో భాగవత సప్తాహం చివరిరోజు ఆయన అభిభాషణ చేస్తూ.. ధర్మం పట్ల, దైవం పట్ల తిరుగులేని నమ్మకాన్ని ప్రకటించిన కేసీఆర్‌ను చూసి సంతోషిస్తున్నానని చెప్పారు. ఒత్తిడితో కూడిన జీవితంలో ఉండేవారైనా అలవోకగా ఒక్క తప్పు లేకుండా 'కలడందురు దీనుల యెడ..' అనే పద్యాన్ని చెప్పి భగవంతుని పట్ల విశ్వాసంలో మొహమాటాలు లేకుండా త్రికరణశుద్ధితో ఎలా ఉండాలో చెప్పారని కొనియాడారు. వారు వృద్ధిలోకి రావాలని, వారి నాయకత్వంలో రాష్ట్ర ప్రజలు ధార్మికులై, శాంతిభద్రతలతో సంతోషంగా ఉండే అదృష్టాన్ని శ్రీకృష్ణ పరమాత్మ అనుగ్రహించాలని ప్రార్థించారు. అన్నింటికీ ఆలంబనం ధర్మమేనని, ఎవరి ధర్మాన్ని వారు పాటిస్తే ఎవరూ ఎవరి జోలికి వెళ్లే పరిస్థితి ఉండదని చాగంటి చెప్పారు. అందుకే ధర్మప్రచారం జరుగాలని, ధర్మాత్ములు రక్షింపబడాలని అన్నారు. ప్రభువు ధర్మాత్ముడు అయితే ప్రజలు సంతోషంగా ఉంటారని చెప్పారు. సమకాలీన సమాజంలో శాసనసభ్యులు, ముఖ్యమంత్రులే ప్రభువులని అన్నారు. రాష్ట్రంలో ధర్మంపట్ల అనురక్తి కలిగిన ధర్మాత్ములను కాపాడాలని చెప్పారు. ఒక వ్యక్తి శరీరం వదిలేసివెళ్తే కనీసం నాలుగు ఇండ్లల్లోనైనా ఆయన వెళ్లిపోయారా! అని బెంగపెట్టుకొని ఆ రోజు అన్నం వండుకోలేని పరిస్థితి కలుగకపోతే ఆ వ్యక్తి సమాజంలో అంతకాలం బతికి ప్రయోజనం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కవిత, కేసీఆర్ కుటుంబసభ్యులు, తెలంగాణ జాగృతి నాయకురాలు మంచాల వరలక్ష్మి, టీఆర్‌ఎస్ నాయకులు మాచర్ల పద్మజ, కార్పొరేటర్ ముఠా పద్మ తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం సాయంత్రం ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి కేసీఆర్, మండలి వైస్ చైర్మన్ నేతి విద్యాసాగర్, మంత్రులు కొప్పల ఈశ్వర్, మహమూద్ అలీ, ఇద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు తదితరులు

# మూడేండ్లలోనే కాళేశ్వరం పూర్తి

మొదటిపేజీ తరువాయి...

రైతాంగం పూర్తిలాభం పొందగలుగుతుందని పేర్కొన్నారు.

### అన్నిమతాలకు సమాన గౌరవం

అన్ని మతాలకు సమాన గౌరవం లభించేలా తెలంగాణను ముందుకు తీసుకెళ్లడంలో కృతనిశ్చయంతో ఉన్నామని, దానికి మీరంతా సాక్షులని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. తెలంగాణ రావడానికి కొద్దిరోజుల ముందు వరంగల్‌లోని చర్చికి వెళ్లినప్పుడు 1969 ఉద్యమకారులుగా ఉన్నవాళ్లు అక్కడ కలిశారని, ఏసు దయతో తప్పకుండా తెలంగాణ వస్తది, ఆయన ఆశీస్సులు ఉంటాయని, రాష్ట్రం బాగుపడుతుందని చెప్పారని గుర్తుచేసుకున్నారు. అదే పద్ధతిలో పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నామని చెప్పారు. ఏ పండుగ వచ్చినా మనమంతా ఐక్యంగా జరుపుకొంటామని సీఎం అన్నారు. ఎన్నో మతాలకు నెలవైన భారతదేశం గొప్పదని చెప్పారు. 'క్రిస్టియన్ దేశానికి వెళ్తే ఏడాదికి ఒకటిరెండు పండుగలు ఉంటాయి. ఇస్లామిక్ దేశాలకు వెళ్తే రంజాన్, బక్రీద్ వంటి పండుగలుంటాయి. హిందూదేశానికి వెళ్తే మూడునాలుగు పండుగలు ఉంటాయి. భారతదేశంలో మాత్రం ఎన్నో పండుగలు. రంగ్ ఫిరంగి వంటి దేశం. అన్ని రకాల పండుగలను సమిష్టిగా జరుపుకొనే గుణం ఉండాలి. మనుషుల్ని మనుషులుగా ప్రేమించే తత్వం ఉంటుందనడానికి తెలంగాణ రాష్ట్రం గొప్ప ఉదాహరణ' అని సీఎం కేసీఆర్ చెప్పారు. ఇదే గ్రౌండ్‌లో ఇఫ్తార్ పార్టీలు, బతుకమ్మ బోనాలు, క్రిస్మస్ ఉత్సవాలు నిర్వహిస్తూ ఉంటామని గుర్తుచేశారు. కొన్ని వేలమంది కలిసి ఒకచోట కూర్చొని మెర్రీ క్రిస్మస్, హ్యాపీ క్రిస్మస్ అని చెప్పుకొంటామన్నారు. రాబోయే వారంపది రోజుల్లో క్రైస్తవ ప్రముఖులను కలుసుకొని, వారి సమస్యల పరిష్కారంపై చర్చిద్దామని హామీ ఇచ్చారు.



ఎల్బీ స్టేడియంలో చిన్నారులకు క్రిస్మస్ గిఫ్ట్‌లను అందజేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

### సంక్షేమంలో మనకు సాటిలేదు

తెలంగాణ రాష్ట్రంలో తాగునీటి సమస్య శాశ్వతంగా తీరనున్నదని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. గతంలో ఉన్న నీటి బాధలు ఇప్పుడు లేవని, మిషన్ భగీరథ కార్యక్రమం త్వరలో నూరుశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు కరంట్ దైవాధీనంగా ఉండేదని, ఇప్పుడు బ్రహ్మాండగా.. కరంట్ సమస్య లేని రాష్ట్రాన్ని చూస్తున్నామని అన్నారు. పేదల సంక్షేమంలో దేశంలోనే ఏ రాష్ట్రం కూడా తెలంగాణకు సాటిరాదని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు కులం, మతం అనేది లేకుండా అర్హులకు రూ.2 వేల పింఛన్ ఇచ్చి ఆదుకునే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. నిరాదరణకు గురైన ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు, అనేక రకాలుగా ఆధారపడి బతికేవాళ్ళకు పింఛన్లు ఇస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాలకు కులం, మతం అడ్డుగోడలు కావన్న సీఎం.. ఇతర వర్గాలకు వర్తించే విధంగా ఓన్ యువర్ కార్, ఓవర్సీస్ స్కాలర్‌షిప్, షాదీముబారక్ వంటి సంక్షేమ పథకాలు క్రైస్తవులకు కూడా లభిస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని, దేశంలోని క్రైస్తవులందరికీ సీఎం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కే కేశవరావు, మంత్రులు మహమూద్‌అలీ, కొప్పుల ఈశ్వర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు ఏకేఖాన్, ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్‌మిశ్రా, క్రైస్తవ బిషప్‌లు రెవరెండ్ పురుషోత్తం, తుమ్మబాల, రఫుల్, హాకబ్, గొల్లపల్లి జాన్, ఐఏఎస్ అధికారి రేమండ్ పీటర్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, క్రైస్తవ మత పెద్దలు, పెద్దసంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

### చీకటిలో పుట్టిన బిడ్డ ఏడ్వలే

గైనకాలజిస్ట్‌గా పనిచేస్తున్నప్పుడు ఎదురైన అనుభవాన్ని గవర్నర్ ఈ సందర్భంగా గుర్తుచేసుకొన్నారు. 'ఓ మహిళకు నేను సాధారణ ప్రసవం చేయగా పుట్టిన బిడ్డ ఎంతసేపయినా ఏడువలేదు. ఎందుకు ఏడువడం లేదని నర్సునడిగితే, కరంట్‌పోయింది మేడం.. గర్భంలో చీకటిగా ఉండటాన్ని అలవాటుచేసుకున్న శిశువు బయటికివచ్చినా చీకటిగా ఉండటంతోనే ఏడువడంలేదని చెప్పింది. ఆ మాటలు విని నాతో సహా డాక్టర్లంతా నవ్వుకున్నాం' అని సరదా ఘటనను గవర్నర్ వివరించారు.

### నల్లగొండ డిపోకు బంగారు.. కల్వకుర్తి డిపోకు వెండి పతకం

టీఎస్‌ఆర్టీసీకి ఇంధన పొదుపులో బంగారు, వెండి పతకాలు లభించాయి. 2018-19 ఏడాదిలో నల్లగొండ డిపోలో 106 బస్సులు 171.51లక్షల కిలోమీటర్లు తిరిగి 1.65 లక్షల లీటర్ల ఇంధనం ఆదా అయ్యింది. రూ.109.96 లక్షల భారం తగ్గింది. ఇందుకు నల్లగొండ డిపోకు బంగారు పతకం లభించింది. కల్వకుర్తి డిపోలో 77 బస్సులతో 98.71 లక్షల కిలోమీటర్లు ఆపరేట్ చేసిన సర్వీసుల ద్వారా 1.37 లక్షల లీటర్ల ఇంధనం ఆదాతో రూ.91.45 లక్షల ఖర్చు మిగిలింది. దీంతో కల్వకుర్తి డిపోకు వెండి పతకం లభించింది.

**ముహూర్తం**

సూర్యోదయం: 6.44 గంటలకు

సూర్యాస్తమయం: 5.38 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, కృష్ణపక్షం దశమి సాయంత్రం 5.15 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: చిత్త రాత్రి 7.49 వరకు, తదుపరి స్వాతి, అమృతఘడియలు: మధ్యాహ్నం 1.47 నుంచి 3.17 వరకు, రాహుకాలం: ఉదయం 9.28 నుంచి 10.49 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.44 నుంచి 8.11 వరకు, వర్జ్యం: అర్ధరాత్రి 1.09 నుంచి 2.40 వరకు.

# దేశంలోనే గొప్ప రాష్ట్రం.. తెలంగాణ

- కాళేశ్వరం ఇంజినీరింగ్ అద్భుతం.. ఈ ప్రాజెక్ట్ రైతులకు ఉపయోగం
- హరితహారం గొప్ప కార్యక్రమం.. సీఎం కేసీఆర్‌కు అభినందనలు
- విద్యుత్ రంగంలో తెలంగాణ భేష్.. విద్యుత్ వినియోగం,ఆదాలోనూ ఆదర్శం
- టీఎస్ రెడ్‌కో ఇంధన పొదుపు పురస్కారాల ప్రదానోత్సవంలో గవర్నర్ తమిళిసై

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** దేశంలోనే తెలంగాణ గొప్ప రాష్ట్రమని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ కొనియాడారు. యువరక్తంతో తొణికిసలాడుతున్న యంగెస్ట్ స్టేట్ అని అభివర్ణించారు. తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీఎస్ రెడ్‌కో) ఆధ్వర్యంలో శుక్రవారం ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్యభవన్‌లో నిర్వహించిన ఇంధన పొదుపు పురస్కారాల ప్రదానోత్సవానికి మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇంధన వినియోగాన్ని తగ్గించిన సంస్థలకు ఎనిమిది క్యాటగిరీల్లో అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ అద్భుతమని, ఇది రాష్ట్రంలోని ప్రతీ రైతుకు ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఇటీవలే ప్రాజెక్టును సందర్శించానని, ఈ ప్రాజెక్టుతో రైతుల కష్టాలు తీరుతాయని చెప్పారు. హరితహారం గొప్ప కార్యక్రమమని, సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తూ పచ్చదనాన్ని పెంచుతున్నారని ప్రశంసించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో తొలగించిన వృక్ష సంపదకు ప్రత్యామ్నాయంగా స్థలాన్ని కేటాయించి మొక్కలు పెంచడం గొప్ప విషయమంటూ సీఎం కేసీఆర్‌కు అభినందనలు తెలిపారు. విద్యుత్‌రంగ అభివృద్ధిని బట్టే పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయని.. తెలంగాణ గణనీయంగా విద్యుత్ ఉత్పత్తి చేయడంతోపాటు అన్నివర్గాలకు 24గంటల సరఫరాచేస్తూ ముందువరుసలో ఉన్నదన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ఎక్కువగా పొదుపు చేస్తున్నారని, సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉన్నదని చెప్పారు. జీహెచ్‌ఎంసీలో 4.5 లక్షల ఎల్‌ఈడీ బల్బులను వాడటం శుభపరిణామమని అన్నారు. విద్యుత్‌తోపాటు నీటి వనరులను ఆదాచేయాలని పిలుపునిచ్చారు.



ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్యభవన్‌లో ఇంధన పొదుపు పురస్కారాల ప్రదానోత్సవంలో పాల్గొన్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, మంత్రి జగదీశ్‌రెడ్డి, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు

### దేశానికే దిక్సూచి

విద్యుత్‌రంగంలో తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలుస్తున్నదని మంత్రి జగదీశ్‌రెడ్డి చెప్పారు. ఉమ్మడిరాష్ట్రంలో విద్యుత్‌రంగం సంక్షోభంలో ఉంటే.. తెలంగాణ ఏర్పడిన ఆరునెలల్లోనే 24 గంటల విద్యుత్‌ను అందించి చరిత్ర సృష్టించామని గుర్తుచేశారు. సోలార్‌విద్యుత్‌లో గతంలో 70 మెగావాట్లు ఉత్పత్తిచేస్తే.. తాజాగా 3,700 మెగావాట్లు ఉత్పత్తి చేస్తున్నామన్నారు. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరాతోపాటు తలసరి విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. దేశంలోనే గొప్ప ప్రాజెక్ట్ అయిన కాళేశ్వరానికి నిరంతర విద్యుత్‌ను సరఫరాచేస్తున్నామని.. సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి కృషితో 24 గంటలు విద్యుత్ అం దిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో టీఎస్‌రెడ్‌కో చైర్మన్ అబ్దుల్ అలీం, వైస్‌చైర్మన్, ఎండీ ఎన్ జానయ్య, విద్యుత్ ఇంజినీర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీ, విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీ అంజయ్య, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ చైర్మన్ రామేశ్వర్‌రావు పాల్గొన్నారు.

### అవార్డులు అందుకున్న సంస్థలు, వ్యక్తులు

మైహోం ఇండస్ట్రీస్ (మేళ్లచెరువు), కేశోరాం సిమెంట్స్ (బసంత్‌నగర్), ఓరియంట్ సిమెంట్ లిమిటెడ్ (దేవాపూర్), టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (ఆదిబట్ల), ఐటీసీ లిమిటెడ్ (భద్రాచలం), దక్షిణ మధ్యరైల్వే సంచాలన్‌భవన్ (సికింద్రాబాద్), సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, పీ ఓబుల్‌రెడ్డి పబ్లిక్ స్కూల్(జూబ్లీహిల్స్), ఐటీసీ కాకతీయ (హైదరాబాద్), టీఎస్‌ఆర్టీసీ కల్వకుర్తి డిపో, నల్లగొండ డిపో, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజి బోర్డు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, సిరిసిల్ల మున్సిపాలిటీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జగత్‌పల్లి, వనపర్తి), డీఏవీ పబ్లిక్ స్కూల్ (సఫిల్‌గూడ), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇందిరానగర్ (సిద్దిపేట), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్ జగిత్యాల), సంకల్ప స్వచ్ఛంద సేవాసంస్థ, బ్రహ్మకుమారీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ, దక్షిణ మధ్యరైల్వే క్యారేజీ వర్క్‌షాప్ (లాలాగూడ), టీకే శ్రీదేవి (డైరెక్టర్ పురపాలకశాఖ), ప్రొఫెసర్ రాజ్‌కిరణ్ వీ బొలోలికర్(ఆస్కి).

**లోకం పోకడ**



తను పెట్టిన పోస్టుకు ఎన్ని లైకులు వచ్చాయో చూసుకుంటున్నాడు డాక్టర్!

# భవన అనుమతులకు సింగిల్ విండో

- టీఎస్‌ఐపాస్ తరహాలో విధానం
- తప్పుడు అనుమతులు తీసుకున్నా.. అక్రమనిర్మాణాలు చేపట్టినా కూల్చివేతలే
- రాష్ట్రస్థాయి టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సమావేశంలో మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పౌరుల సౌకర్యం, సంతోషమే లక్ష్యంగా నూతన పురపాలక చట్టాన్ని కఠినంగా అమలుచేస్తామని పురపాలక శాఖ మంత్రి కే తారకరామారావు తెలిపారు. సులభంగా, అత్యంత పారదర్శకంగా, వేగంగా భవననిర్మాణ అనుమతులను పొందేలా టీఎస్‌ఐపాస్ తరహాలో కొత్త విధానం తెస్తామని తెలిపారు. శుక్రవారం బుద్ధభవన్‌లో రాష్ట్రస్థాయి టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతూ.. గతంలో పరిశ్రమలశాఖ అనుమతుల విధానం పూర్తిగా మార్చి సింగిల్‌విండో పద్ధతిని తీసుకొచ్చి విజయం సాధించామని గుర్తుచేశారు. ఇదే విధంగా అత్యంత పారదర్శకంగా ఉండే భవన నిర్మాణ అనుమతుల విధానాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. అనుమతుల ప్రక్రియ సమయాన్ని తగ్గించి, పారదర్శకత పెంచే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. దశాబ్దాలుగా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పనితీరు పట్ల ప్రజల్లో నెలకొన్న అనుమానాల్ని తొలిగించి, అత్యంత పారదర్శకంగా, వేగంగా అనుమతులిచ్చే నూతన విధానానికి ప్రభుత్వం రూపకల్పన చేస్తుందని తెలిపారు. ఈ విధానంలో రాష్ట్రంలో 75 గజాల్లోపు భవననిర్మాణం చేపట్టేవారు రిజిస్ట్రేషన్ చేసుకుంటే సరిపోతుందని, 600 గజాలలోపు భవననిర్మాణాలకు సెల్ఫ్‌డిక్లరేషన్, 600 గజాలపైన భవననిర్మాణ అనుమతులకు సింగిల్‌విండో పద్ధతిలో అనుమతులకు నూతన విధానం వీలు కల్పిస్తుందని చెప్పారు.



టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్ తదితరులున్నారు

### ఒత్తిళ్లకు తలొగ్గద్దు.. అండగా నేనుంటా

ప్రజలు, అధికారులపై అత్యంత విశ్వాసం ఉంచి నూతన విధానాన్ని తీసుకొస్తున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. ప్రజలు ఈ విధానాన్ని దుర్వినియోగం చేసి, తప్పుడు అనుమతులు తీసుకున్నా, అక్రమ నిర్మాణాలు చేపట్టినా వాటిని ఎలాంటి నోటీసులేకుండా కూల్చివేసే అధికారం నూతన పురపాలక చట్టంలో ఉన్నదని చెప్పారు. నూతన విధానం అమలు బాధ్యత టౌన్‌ప్లానింగ్ అధికారులదేనని స్పష్టంచేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతి ఆరోపణలపై కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి హెచ్చరించారు. భవననిర్మాణ అనుమతుల్లో ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గాల్సిన అవసరం లేదని, నిబంధనల ప్రకారమే వ్యవహరించాలని సిబ్బది, అధికారులకు మంత్రి సూచించారు. ప్రజల సౌకర్యం, సంతోషమే లక్ష్యాలుగా పనిచేద్దామని కోరారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఖాళీల భర్తీ, వారికి అవసరమైన మౌలికవసతుల కల్పనకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

### ప్రతి పురపాలికకు మాస్టర్ ప్లాన్

మెరుగైన జీవన ప్రమాణాలు, ఉపాధి అవకాశాలకోసం ప్రజలు పట్టణాల వైపు చూస్తున్నారని, పట్టణీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో పట్టణాల్లో మౌలికవసతుల కల్పనతోపాటు పట్టణాన్ని సమగ్ర కార్యాచరణతో అభివృద్ధిచేయాల్సిన అవసరమున్నదని మంత్రి కేటీఆర్ చెప్పారు. పెరుగుతున్న పట్టణీకరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు నూతన పురపాలక చట్టం దోహదంచేస్తుందని తెలిపారు. ఇందుకోసం ప్రతి పురపాలికకు ఒక మాస్టర్ ప్లాన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, మాస్టర్‌ప్లాన్ రూపకల్పన క్యాలెండర్ కూడా తయారుచేయాలని డీటీసీపీ అధికారుల్ని మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ విజయవంతంగా అనుసరిస్తున్న ల్యాండ్‌పూలింగ్ వంటి పద్ధతులను రాష్ట్రంలో ఉన్న ఆరు పట్టణాభివృద్ధి సంస్థలు అనుసరించాలని కోరారు. సమావేశంలో పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్, హైదరాబాద్ చీఫ్ సిటీ ప్లానర్ దేవేందర్‌రెడ్డి, డీటీసీపీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేటు డిగ్రీ కళాశాలల తరలింపు కఠినతరం

- అనధికార తరలింపు నియంత్రణకు ఉన్నత విద్యాశాఖ చర్యలు
- వర్సిటీ రిజిస్ట్రార్ల భేటీలో పాపిరెడ్డి భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ప్రైవేటు డిగ్రీ కాలేజీల బలోపేతానికి ఉన్నత విద్యామండలి చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు అనధికార షిఫ్టింగ్‌లో కొనసాగుతున్న డిగ్రీ కాలేజీలకు చెక్ పెడుతూ నిబంధనలను కఠినతరం చేసింది. ఒక మండలం నుంచి మరో మండలానికి కళాశాలను తరలించే అధికారం ముఖ్యమంత్రికి ఇవ్వాలని నిర్ణయించింది. అదేమండలంలో మరో ప్రాంతానికి తరలించడానికి మాత్రం ఉన్నతవిద్యాశాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.శుక్రవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తన కార్యాలయంలో వర్సిటీ రిజిస్ట్రార్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల పరిధిలో కొనసాగుతున్న ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు ఉమ్మడి మార్గదర్శకాలను రూపొందించారు.

**యూనివర్సిటీల్లో ఇంక్యుబేటర్, ఇన్నోవేషన్, స్టార్టప్‌కేంద్రాలు**

అన్ని యూనివర్సిటీల్లో ఇంక్యుబేషన్, ఇన్నోవేషన్, స్టార్టప్ కేంద్రాలను తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి రిజిస్ట్రార్లను ఆదేశించారు. మార్చి లోగా వీటి ఏర్పాటులో పురోగతి సాధించాలని సూచించారు.

## వర్సిటీ పోస్టుల భర్తీకి స్క్రీనింగ్ టెస్ట్!

మెరిట్ పద్ధతిలో, పారదర్శకంగా నియామకాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వర్సిటీల పరిధిలో చేపట్టనున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ ప్రక్రియలో స్క్రీనింగ్ కోసం పరీక్షలు నిర్వహించే యోచనలో ఉన్నతవిద్యాశాఖ ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. దీనిద్వారా పారదర్శకంగా, మెరిట్ పద్ధతిలో నియామకాలు చేపట్టే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. స్క్రీనింగ్‌లో మెరిట్ లిస్ట్ ఆధారంగా 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూలకు ఎంపికచేసే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. ఈ పరీక్షలు ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటే కాకుండా.. థర్డ్‌పార్టీతో పరీక్షలను నిర్వహించాలనే యోచిస్తున్నట్టు కూడా సమాచారం. వర్సిటీ అధికారాలకు ఏ మాత్రం భంగం వాటిల్లకుండా.. ఈ నియామకాలు చేపట్టే విధానం కొనసాగిస్తామని అధికారులు చెప్తున్నారు. కొన్ని యూనివర్సిటీల్లో గతంలో నిర్వహించిన నియామకాల్లో పలు అవకతవకలు జరిగినట్టు వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో వర్సిటీలలో ఉన్న 1,061 పోస్టుల భర్తీని పూర్తి పారదర్శకంగా చేపట్టడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణ బాధ్యతలను ఎవరికి అప్పగించాలనే దానిపై ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరుపుతామని ఉన్నత విద్యామండలి అధికారులు పేర్కొంటున్నారు.

## తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌పై సింగరేణి ప్రకటనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్– న్యూఢిల్లీ మధ్య నడిచే తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌పై బొగ్గు ఉత్పత్తిలో నంబర్‌వన్‌గా నిలిచిన సింగరేణి ప్రకటనలు తళుకులీనుతున్నాయి. కోల్‌మూమెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జే అల్విన్, జనరల్ మేనేజర్ ఆంటోనిరాజా, రైల్వే అధికారులు ఢిల్లీ బయల్దేరిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌కు వీడ్కోలు పలికారు. ప్రకటనల విభాగంలో కొత్త అవకాశాలను సృష్టించుకోవాలన్న దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మాల్యా ఆలోచనల నేపథ్యంలో సింగరేణి సంస్థ తొలిసారి ఈ తరహా ప్రకటనలు ఇచ్చేందుకు ముందుకువచ్చింది.



# హవాలా డబ్బు కోటి పట్టివేత

- ఐదుగురిని అదుపులోకి తీసుకొన్న టాస్క్‌ఫోర్స్
- విచారణ కోసం ఆదాయం పన్ను శాఖకు అప్పగింత



ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదును పరిశీలిస్తున్న హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్, అదనపు డీసీపీ చక్రవర్తి

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** పెద్దమొత్తంలో హవాలా డబ్బు తరలిస్తున్న ఐదుగురుసభ్యుల ముఠాను ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం హైదరాబాద్ సీపీ అంజనీకుమార్ మీడియా సమావేశంలో వెల్లడించారు. కేపీహెచ్‌బీ కాలనీలో టెంట్‌హౌస్ వ్యాపారం నిర్వహించే ఎం ఈశ్వర్‌రెడ్డి ఈ నెల 16న గౌలిగూడ అశోక్‌బజార్‌లోని బాలాజీ స్వీట్‌హౌస్ సమీపంలో రూ.80లక్షలు ఉన్న బ్యాగ్ ను తీసుకొని వెళ్తూ ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు తారసపడ్డాడు. తనిఖీ చేయగా పెద్ద మొత్తంలో నగదు బయటపడింది. ఈశ్వర్‌రెడ్డి వద్ద నగదుకు సంబంధించి ఎలాంటి అధికారికపత్రాలు లేకపోవడంతో ఆ డబ్బు ను స్వాధీనం చేసుకొని ఈశ్వర్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించారు. డైనమిక్ టూల్స్ లిమిటెడ్ ఎండీ రాజ్‌కుమార్ ఆదేశాల మేరకు గౌలిగూడకు వచ్చి రాజేశ్‌శర్మ, రాం రాజ్ పర్మార్, ప్రవాశ్‌సింగ్, విశాల్ సావంత్ నుంచి డబ్బు తీసుకొని వెళ్తున్నట్టు పోలీసుల విచారణలో ఈశ్వర్‌రెడ్డి వెల్లడించాడు. దాంతో ఆ నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి లెక్కల్లో చూపని రూ.21.5 లక్షల నగదు కూడా స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నలుగురిలో రాజేశ్‌శర్మ, విశాల్ సావంత్ మహారాష్ట్రకు చెందినవారు కాగా, రాంరాజ్ పర్మార్ మధ్యప్రదేశ్, ప్రకాశ్‌సింగ్ రాజస్థాన్‌కు చెందినవారు. వీరంతా గత కొంతకాలంలంగా గౌలిగూడ ప్రాంతంలో నివసిస్తున్నారు. విశాల్ సావంత్ హవాలా డబ్బు రవాణా చేస్తూ పట్టుబడడం ఇది రెండోసారి. స్వాధీనం చేసుకొన్న మొత్తం రూ.1.01,50,000 నగదుతోపాటు ఐదుగురిని ఆదాయం పన్ను శాఖకు అప్పగించారు. మీడియా సమావేశంలో టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ చక్రవర్తి, ఇన్‌స్పెక్టర్ కే శ్రీనివాస్, ఎస్సైలు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్, గోవిందస్వామి పాల్గొన్నారు.

# పారిశ్రామికవేత్తలుగా మహిళలు

- అనేక చర్యలతో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- వీహబ్ తరహా సంస్థ ఏర్పాటు దేశంలోనే ప్రథమం
- వీహబ్ ఉత్పత్తులకు ప్రభుత్వమే తొలి కస్టమర్
- 'వింగ్' ప్రారంభ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్
- డీపీఐఐటీ, వీహబ్ ఆధ్వర్యంలో పనిచేయనున్న 'వింగ్'



శుక్రవారం వీహబ్‌లో మహిళా స్టార్టప్‌లు తయారుచేసిన వస్తువుల ప్రదర్శనను తిలకిస్తున్న ఐటీశాఖమంత్రి కేటీఆర్, ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, వీహబ్ సీఈవో దీప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారుచేయడానికి, వారిని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారక రామారావు చెప్పారు. దేశంలోనే వీహబ్ లాంటి సంస్థను ఏర్పాటుచేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. టీఎస్‌ఐపాస్ ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) ఆధ్వర్యంలో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారుచేయడానికి ఉద్దేశించిన వింగ్ కార్యక్రమాన్ని తెలంగాణలో వీ హబ్ భాగస్వామ్యంతో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంద్వారా దేశవ్యాప్తంగా ఏటా 7500 మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారుచేయడానికి కేంద్రం నిధులు, సహకారం అందించనున్నది. శుక్రవారం జూబ్లీహిల్స్ అంబేద్కర్ యూనివర్సిటీ అవరణలోని వీహబ్ కార్యాలయంలో నిర్వహించిన వింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తలకు భూముల కేటాయింపులో అదనపు రాయితీలు, సీడ్ క్యాపిటల్ అసిస్టెన్స్ అందిస్తున్నామని చెప్పారు. డీపీఐఐటీ, వీహబ్ సంయుక్తంగా ఏర్పాటుచేస్తున్న వింగ్ రాబోయేరోజుల్లో అద్భుతంగా విజయవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. స్టార్టప్‌లకు తెలంగాణ ఐటీశాఖ ప్రత్యేక అవకాశాలు ఇస్తుందని, వాటికి మొదటి కస్టమర్‌గా ప్రభుత్వం ఉంటుందని చెప్పారు. వీహబ్ ఏర్పాటుచేసిన అతి తక్కువ సమయంలోనే బాగా పనిచేస్తున్నదంటూ ప్రశంసించారు. వీహబ్ ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలను తయారుచేయడానికి రూ.15 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటుచేశామని తెలిపారు. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు రూ.25 లక్షల నుంచి కోటి రూపాయల వరకు గ్రాంట్‌గా అందిస్తున్నామని చెప్పారు. జీఐజీ, ఆస్ట్రేలియన్ హైకమిషన్, స్విస్‌నెక్స్, ఇంటెల్, మైక్రోసాఫ్ట్, ప్రాక్టర్ అండ్ గ్యాంబుల్, హెచ్‌డీఎఫ్‌సీ, సెల్స్‌ఫోర్స్ లాంటి సంస్థలతో వీహబ్ ఒప్పందం చేసుకుందన్నారు. ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇంక్లూజివ్ గ్రోత్ లక్ష్యంగా వీహబ్‌ను ఏర్పాటుచేశామన్నారు. దేశంలో మహిళా జనాభా పురుషులతో దాదాపు సమానంగా ఉన్నా.. పారిశ్రామికవేత్తల సంఖ్య తక్కువగా ఉన్నదని చెప్పారు. పారిశ్రామికవేత్తలుగా మహిళలు విజయవంతంగా కావడానికి అనేక అడ్డంకులు ఉంటాయన్నారు. ఈ కారణంగానే 14% మాత్రమే మహిళా పారిశ్రామికవేత్తలు ఉన్నారన్నారు. ఈ సందర్భంగా మహిళా స్టార్టప్‌లు తయారుచేసిన వస్తువుల ప్రదర్శను మంత్రి కేటీఆర్ తిలకించారు. నేషనల్ స్టార్టప్ అవార్డులను అందించారు. కార్యక్రమంలో పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, వీహబ్ సీఈవో దీప్తి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో విస్తృతంగా జీఎస్టీ తనిఖీలు

సినీనటి లావణ్యత్రిపాఠి ఇంట్లో సోదాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) అధికారులు హైదరాబాద్‌లో పలువురు వ్యాపారులు, సంస్థలు, సినీతారల ఇండ్లు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. సేవాపన్నులను ఎగవేస్తున్న చిట్‌ఫండ్ కంపెనీలు, కోల్డ్‌స్టోరేజీ యూనిట్లు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, కన్‌స్ట్రక్షన్ కంపెనీలతోపాటు ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీల్లో బుధవారం నుంచి 23 బృందాలు సోదాలు నిర్వహిస్తున్నాయి. శుక్రవారం జూబ్లీహిల్స్‌లో సినీనటి లావణ్యత్రిపాఠి ఇంట్లో అర్ధరాత్రి వరకు సోదాలు కొనసాగాయి. తనిఖీ నేపథ్యంలో ఆమె షూటింగ్ రద్దుచేసుకొని ఇంటికి వచ్చారు. నిర్మాతల నుంచి తీసుకున్న పారితోషికంలో 18 శాతం సేవాపన్ను చెల్లించని కారణంగా తనిఖీలు చేసినట్టు అధికారులు వెల్లడించారు. ఒక మీడియా సంస్థలో కూడా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

## తెలంగాణకు పెట్టుబడులు తెండి

- ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్
- టీహబ్‌లో అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో వ్యాపార సదస్సు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ ప్రాంతంలో పుట్టిపెరిగినవారిగా ఇక్కడ పెట్టుబడులు పెట్టడమే కాకుండా, అమెరికా నుంచి ఇక్కడికి పెట్టుబడులు తీసుకువచ్చేలా కృషి చేయాలని, తెలంగాణలో పెట్టుబడులకు ముందుకొచ్చే తెలుగువారికి పూర్తి సహకారం అందిస్తామని ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ తెలిపారు. పెట్టుబడులతో ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్నారు. తెలంగాణలో హైదరాబాద్‌తో పాటు మరో రెండు ద్వితీయశ్రేణి పట్టణాల్లో ఐటీహబ్‌లను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. శుక్రవారం టీహబ్‌లో అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో వ్యాపార సదస్సు నిర్వహించారు. గ్రీన్‌కార్డుపై అవగాహన, స్టార్టప్ సంస్థలు.. ఇన్వెస్టర్ల మధ్య అనుసంధాన సదస్సులు జరిగారు. ఈ సందర్భంగా జయేశ్‌రంజన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి అనువైన వాతావరణం ఉన్నదని, టీఎస్‌ఐపాస్ ద్వారా అతి తక్కువ సమయంలో అనుమతులిస్తున్నామని తెలిపారు. అమెరికా తెలుగు సంఘం ఇలాంటి సమావేశాలు నిర్వహించడంతో పెట్టుబడులు ఎక్కువగావచ్చే అవకాశముందని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఐఎసీసీ చైర్మన్ శ్రీకాంత్, పాశం కిరణ్, న్యాయనిపుణులు సోమిరెడ్డి, రాణాప్రతాప్ చేగు, జయంత్, రమాదేవి, డాక్టర్ పావని పాల్గొన్నారు.

## ఏడుగురు నౌకాదళ సిబ్బంది అరెస్టు

- నౌకాదళ, సెంట్రల్ ఇంటెలిజెన్స్ 'డాల్ఫిన్ నోస్' ఆపరేషన్
- పాకిస్థాన్‌కు సహకరిస్తున్నారని ఆరోపణలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశానికి సంబంధించిన రక్షణరంగ సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్నారన్న ఆరోపణలపై ఏడుగురు నౌకాదళ అధికారులను, వీరికి సహకరిస్తున్న మరో హవాలా ఆపరేటర్‌ను విశాఖపట్నం పోలీసులు శుక్రవారం అరెస్టుచేశారు. పాకిస్థాన్‌లోని కొన్ని ఉగ్రవాద గ్రూప్‌లతో సంబంధాలు పెట్టుకొని వారికి గూఢచర్యానికి సంబంధించిన సమాచారాన్ని కొందరు నేవీ అధికారులు చేరవేస్తున్నట్టు నిఘావర్గాలకు తెలిసింది. అప్రమత్తమైన నౌకాదళ ఇంటెలిజెన్స్ అధికారులు, సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు, ఏపీ ఇంటెలిజెన్స్ అధికారులు కలిసి సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. దీనికి 'ఆపరేషన్ డాల్ఫిన్స్ నోస్' అని పేరు పెట్టిన నిఘా అధికారులు అత్యంత కీలక సమాచారాన్ని సేకరించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురు నేవీ సిబ్బందిని ముంబై, విశాఖపట్నం, కార్వార్ నావెల్ బేస్‌ల నుంచి అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. గూఢచర్యం వ్యవహారంలో మరికొందరు అనుమానితులను సైతం ప్రశ్నిస్తున్నట్టు ఏపీ పోలీసులు తెలిపారు. నిందితులను విజయవాడ ఎన్‌ఐఏ కోర్టులో శుక్రవారం హాజరుపర్చారు. వీరికి కోర్టు జనవరి 3 వరకు జుడీషియల్ కస్టడీ విధించినట్టు సమాచారం. పట్టుబడిన ఏడుగురు నేవీసిబ్బంది ఎలాంటి సమాచారాన్ని చేరవేశారు.. దానివల్ల ఎలాం టి దాడులకు పథకరచన చేశారు.. వంటి పలు అంశాలపైన అధికారులు ఆరా తీస్తున్నట్టు తెలిసింది.

# ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు చారిత్రాత్మకం

- సీఎం కేసీఆర్, హైకోర్టు సీజే చౌహాన్ కృషి మరువలేనిది
- బచ్‌పన్ బచావో ఆందోళన్ కోఆర్డినేటర్ చందన
- ఫాస్ట్ ట్రాక్ కోర్టులతో సత్వర న్యాయం: వినోద్‌కుమార్



బాలికలకు విద్యపై పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, బచ్‌పన్ బచావో ఆందోళన్ కోఆర్డినేటర్ చందన, తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో 36 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాశ్ సత్యార్థి స్థాపించిన బచ్‌పన్ బచావో ఆందోళన్ సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ చందన పేర్కొన్నారు. ఈ కోర్టుల ఏర్పాటులో సీఎం కేసీఆర్, హైకోర్టు సీజే చౌహాన్ కృషి మరువలేనిదన్నారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్‌ను ఆమె కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కరీంనగర్ ఎంపీగా ఉన్న సమయంలో వినోద్‌కుమార్ 2018 మే 10న ప్రతి జిల్లాలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు లేఖ రాసిన విషయాన్ని చందన గుర్తుచేశారు. వినోద్‌కుమార్ ఎంపీగా ఉన్న సమయంలోనే కైలాశ్ సత్యార్థి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఆవశ్యకతను వివరించారన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల వల్ల లైంగికదాడుల బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని చందన చెప్పారు. రాష్ట్రంలో 36 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటుకానుండటంతో లైంగికదాడి ఘటనల్లో సత్వర న్యాయానికి ఆస్కారం ఉంటుందని వినోద్‌కుమార్ అన్నారు. 36 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటుచేయడం రాష్ట్ర చరిత్రలోనే ఒక సువర్ణ ఘట్టమని తెలిపారు.

## జైపూర్ మూడో యూనిట్‌కు పచ్చజెండా

- థర్మల్ విద్యుత్ ఉత్పత్తి రంగంలో సింగరేణి మరో ముందడుగు
- 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి అనుమతి
- క్లియరెన్స్ ఇచ్చిన కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ
- 5,879.62 కోట్లతో నిర్మాణం.. అందుబాటులో127.31 హెక్టార్ల భూమి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద ఇప్పటికే రెండు యూనిట్ల ద్వారా 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్‌ను ఉత్పత్తిచేస్తున్న సింగరేణి మరో అడుగు ముందుకేసింది. సింగరేణి ప్రతిపాదించిన మూడోయూనిట్ నిర్మాణానికి కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ క్లియరెన్స్ ఇచ్చింది. దీంతో మూడోయూనిట్‌గా 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి అన్నిరకాల అనుమతులు వచ్చినట్టయింది. సింగరేణి త్వరలోనే ఈ విద్యుత్ కేంద్రం నిర్మాణ పనులు చేపట్టనున్నది. తెలంగాణ కొంగుబంగారంగా చెప్పుకొనే సింగరేణి సంస్థ.. రాష్ట్ర అవసరాలు, పరిస్థితులు, ఆర్థిక, వ్యాపారవృద్ధిలో భాగంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి కూడా దిగింది. మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద 600 మెగావాట్ల చొప్పున రెండు యూనిట్లను ఇప్పటికే ప్రారంభించి.. దేశంలోనే అత్యధికంగా పీఎల్‌ఎఫ్ (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్) నమోదుచేసిన థర్మల్ విద్యుత్ కేంద్రాలుగా నిలిచాయి. ఈ నేపథ్యంలో 800 మెగావాట్ల సామర్థ్యంతో మూడోయూనిట్‌ను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇదికూడా చేపడితే సింగరేణి ఆధ్వర్యంలో ఉత్పత్తి అయ్యే మొత్తం థర్మల్ విద్యుత్ 2వేల మెగావాట్లకు చేరుకుంటుంది. జైపూర్ వద్దే అందుబాటులోఉన్న 127.31 హెక్టార్ల స్థలాన్ని వినియోగించుకుని 800 మెగావాట్ల మూడో థర్మల్ విద్యుత్‌కేంద్రం నిర్మాణానికి ప్రణాళిక రూపొందించింది. దీనికి పర్యావరణ అనుమతుల కోసం కేంద్రానికి నివేదించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా పర్యావరణకు ఎలాంటి హాని కలుగనివిధంగా తీసుకునే చర్యలపై సంతృప్తి వ్యక్తంచేసిన కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ నిర్మాణానికి క్లియరెన్స్ ఇచ్చింది. దీంతో రూ.5,879.62 కోట్లతో జైపూర్ వద్ద మూడు యూనిట్ థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి సింగరేణి సిద్ధమవుతున్నది.

# కాళేశ్వరంలో మరో అద్భుతం

- ప్రారంభానికి సిద్ధమైన అన్నపూర్ణ రిజర్వాయర్
- 90 రోజుల్లో 88.24 టీఎంసీల ఎత్తిపోత
- ఇక్కడినుంచి రంగనాయకసాగర్, మల్లన్నసాగర్‌కు జలాల తరలింపు
- ఆసియాలోనే అతిపెద్ద సర్జ్‌పూల్ ఇక్కడే
- ఏడాదిన్నరలోనే పనులు పూర్తిచేసిన తెలంగాణ ప్రభుత్వం



మధ్యమానేరు నుంచి సర్జ్‌పూల్‌కు వచ్చే గ్రావిటీ కెనాల్



ఆసియాలోనే అతిపెద్ద సర్జ్‌పూల్ (మహాబావి) ఇదే

**( కే ప్రకాశ్‌రావు )**
**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

అనేక అద్భుతాలకు, రికార్డులకు నిలయంగా ఉన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మరో కీలకఘట్టం ఆవిష్కృతం కాబోతున్నది. ఆసియాలోనే అతిపెద్ద సర్జ్‌పూల్ (మహాబావి) ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్ ప్రారంభానికి సిద్ధమైంది. శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి మల్లన్నసాగర్ వరకు నీటిని ఎత్తిపోయడంలో ఈరిజర్వాయరే అత్యంతకీలకం. ప్రస్తుత అంచనాలప్రకారం ఈ రిజర్వాయర్ నుంచి 90 రోజుల్లో 88.24 టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చు. స్వరాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీరు ఇచ్చే లక్ష్యంలో అన్నపూర్ణ రిజర్వాయర్ కీలకభూమిక పోషించనున్నది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి వద్ద అన్నపూర్ణ రిజర్వాయర్‌ను నిర్మించారు. 3.5 టీఎంసీల సామర్థ్యంగల ఈ రిజర్వాయర్‌ను గుట్టల మధ్య ఏర్పాటుచేయడంతో పరిసరాలు ప్రకృతి అందాలతో కనువిందు చేస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 10లో భాగంగా ఏర్పాటుచేసిన ఈ రిజర్వాయర్ శ్రీరాజరాజేశ్వర జలాశయానికి పది కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు శ్రీరాజరాజేశ్వర ప్రాజెక్టు క్రస్టు గేట్ల నుంచి నీటిని పంపిస్తారు. మధ్యమానేరు నుంచి 2.067 కిలోమీటర్ల పొడవు గ్రావిటీ కాల్వ ద్వారా ప్రవహించేనీరు.. ఆ తదుపరి సొరంగమార్గంలో 7.03 కిలోమీటర్ల దూరం వచ్చి సర్జ్‌పూల్‌లో కలుస్తుంది. సర్జ్‌పూల్‌కు వచ్చే నీటిని ఎప్పటికప్పుడు అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోసేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధంచేసింది. ఇందుకోసం నాలుగు మోటర్లను ఏర్పాటుచేశారు. ఒక్కో మోటర్ సామర్థ్యం 106 మెగావాట్లు. నాలుగు మోటర్లు కలిపి రోజుకు ఒక టీఎంసీ నీటిని సర్జ్‌పూల్ నుంచి 101.2 మీటర్ల ఎత్తులో ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి పోస్తాయి. అక్కడినుంచి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటుచేసిన రంగనాయకసాగర్‌కు, అక్కడినుంచి మల్లన్నసాగర్ ప్రాజెక్టు వరకు నీటిని తీసుకెళ్తారు. ఇప్పటికే మోటర్లను బిగించడమేకాకుండా.. మూడింటికి డ్రైరన్ కూడా నిర్వహించారు. దాదాపు అన్ని మోటర్లు వెట్‌రన్‌కు సిద్ధంగా ఉన్నాయి. ఈ మోటర్లు నడిచేందుకు అవసరమైన విద్యుత్ కోసం రిజర్వాయర్ పరిధిలోనే 400కేవీ సామర్థ్యంగల సబ్‌స్టేషన్‌ను ఏర్పాటుచేశారు. ఈ రిజర్వాయర్ వినియోగంలోకి వస్తే సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 35 వేల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందనున్నది.

**ఆసియాలోనే అతిపెద్ద సర్జ్‌పూల్**

ఆసియాలోనే అతిపెద్ద సర్జ్‌పూల్ (మహాబావి) ఇక్కడే నిర్మించారు. 56 మీటర్ల వెడల్పు, 92 మీటర్ల లోతుతో ఇది ఉంటుంది. ఈ మహాబావిని చూసేందుకు చాలామంది వచ్చి వెళ్తున్నారు. మహాబావితోపాటు అన్నపూర్ణ రిజర్వాయర్‌ను ఏడాదిన్నరలోపే సిద్ధంచేయడం.. ప్రభుత్వం ప్రాజెక్టుల పనులను పూర్తిచేసే విషయంలో చూపుతున్న శ్రద్ధకు నిదర్శనంగా నిలుస్తున్నది. మహాబావి నిర్మాణం సమయంలో భూమిపొరల్లో వచ్చిన బండలు, ఇతర ఇబ్బందులను అధిగమించి, నిరంతరం పనిచేసి తక్కువ సమయంలో పూర్తిచేశారు. సీఎం కేసీఆర్ ఈ పనులను సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడంతోపాటు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తూ ప్రాజెక్టును తక్కువకాలంలో పూర్తిచేయించడంలో కీలకపాత్ర పోషించారు.

**వ్యవసాయ విశ్వవిద్యాలయానికి**
## రూ.34.24 కోట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. 2019–20 ఆర్థిక సంవత్సరానికి విశ్వవిద్యాలయం ఉద్యోగుల వేతనాల కోసం రూ. 34.24 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు వ్యవసాయ, సహకార శాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.





తెలంగాణ ప్రభుత్వం
సాధారణ పరిపాలన (GPM & AR) శాఖ
నోటిఫికేషన్
తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌లో రాష్ట్ర సమాచార కమిషనర్ పదవి కోసం 2019లో సవరించిన RTI చట్టం 2005లోని సెక్షన్ 15 మరియు 16లోని నిబంధనల ప్రకారం అర్హతలు మరియు ప్రమాణాలు కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించబడును.
దరఖాస్తులు ప్రొఫార్మా ప్రకారం అవసరమైన డాక్యుమెంట్లు జతపరచి రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా చీఫ్ సెక్రటరీ కార్యాలయం, 9వ అంతస్తు BRK భవన్, సెక్రటేరియెట్, హైదరాబాద్‌కు పంపవలెను. దరఖాస్తుల స్వీకరణకు ఆఖరి తేది: 20–12–2019 సా. 5.00 గం. నుండి 31–12–2019, సా. 5.00 గంటల వరకు పొడిగించబడినది.
వివరాలకు www.telangana.gov.in
సం/– స్పెషల్ చీఫ్ సెక్రటరీ టు గవర్నమెంట్ (పొలిటికల్)
DIPR RO. No. 2033-DP/CL/Advt/1/2019-20, Dt: 20/12/2019

SHRIRAM HOUSING FINANCE
SHRIRAM HOUSING FINANCE LTD.
WALK-IN-INTERVIEW
RELATIONSHIP EXECUTIVE'S-65 Nos. (Across Telangana State)
1 to 3 years experience in Retail Loan Sales / Insurance Sales.
CLUSTER SALES MANAGER'S-10 Nos. (Hyderabad, Nalgonda, Mahboobnagar, Sangareddy, Khammam, Hanumakonda) - 6 to 8 years experience in Home Loan/Mortgage Sales with Team handling experience.
Interview Date: 23rd & 24th Dec. 2019 • Time: 10am to 5pm
Venue: Shriram Housing Finance Ltd, 1st Floor, Uma Hyderabad House, Raj Bhavan Road, Somajiguda, Hyderabad-500082. Landmark: Above Blue Dart.
Interested candidates also can send their resumes to:
mahesh.madam@shriramhousing.com / parthiban.m@shriramhousing.com



పౌరసత్వ సవరణ చట్టాన్ని రాష్ట్రంలో అమలుచేసే ప్రసక్తే లేదు. బీహార్‌లో జాతీయ పౌర పట్టికను అమలుచేయాల్సిన అవసరం ఏమున్నది?

**నితీశ్ కుమార్, బీహార్ ముఖ్యమంత్రి**

ప్రజాభిప్రాయ సేకరణ గురించి మమతా బెనర్జీ మాట్లాడటం దిగ్భ్రాంతికరం. ఐక్యరాజ్య సమితి తరఫున రెఫరెండాన్ని ఎవరు పర్యవేక్షిస్తారు? ఇది భారత అంతర్గత విషయంలో విదేశీ జోక్యాన్ని ఆహ్వానించటమే. 130 కోట్ల ప్రజల తీర్పునకు అవమానకరం. మమతా బెనర్జీ వెంటనే క్షమాపణలు చెప్పాలి.

**ప్రకాశ్ జవదేకర్, కేంద్ర మంత్రి**



**చరిత్రలో నేడు**



1894

కెనడా 5వ ప్రధానిగా మాకెంజీ బోవెల్.

1946

దక్షిణ జపాన్‌లో భూకంపం, 1,086 మంది మృతి.





1975

రాజ్యాంగాన్ని ఆవిష్కరించుకున్న మడగాస్కర్.

ప్రజాకాంక్షలను అర్థం చేసుకొని పరిష్కరించే బదులు ప్రజాందోళనలను అణిచివేసే చర్యలకు దిగటం ప్రభుత్వం చేయకూడదు. ప్రజల శాంతియుత ఆందోళనలను కూడా శాంతిభద్రతల సమస్యగా పరిగణించటం తగదు. ఢిల్లీతో సహా ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు, పలు నగరాల్లో 144 సెక్షన్ విధించటం, ఇంటర్నెట్ లేకుండా చేయటం ప్రజల హక్కులను నిరాకరించటమే. ఈ సందర్భంగా 144 సెక్షన్‌ను కనిష్ఠంగా మాత్రమే వినియోగించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించటం గమనార్హం.

**ది హిందూ**

పౌరసత్వ సవరణ చట్టంపై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం చెబుతున్న సమాధానాలతో ప్రజలు సంతృప్తి చెందటం లేదు. దేశవ్యాప్తంగా చేపట్టదలచిన జాతీయ పౌరపట్టిక, పౌరసత్వ సవరణ చట్టంపై ప్రజల ఆందోళనకు అర్థమున్నది. అస్సాం తరహా సమస్యలు ఉత్పన్నమై, పౌరసత్వ నిరూపణ కోసం విదేశీ ట్రిబ్యునల్ ముందు హాజరయ్యే పరిస్థితులు వస్తాయని ప్రజలు ఆందోళన చెందటం సహజం.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**



# టూ ప్లస్ టూ చర్చలు

భారత అమెరికా సంబంధాలలో అత్యంత ప్రాధాన్యం గల సమావేశం బుధవారం జరిగింది. రెండుదేశాల విదేశాంగ, రక్షణ మంత్రుల (టూ ప్లస్ టూ) భేటీలో వ్యూహాత్మక బంధంపై కీలక చర్చలు జరుగడం విశేషం. విదేశాంగ మంత్రి జయ్‌శంకర్, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అమెరికా మంత్రులు మైక్ పాంపియో, మార్క్ ఎస్పర్‌తో చర్చలు జరిపారు. ఆ తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతినిధుల సభ అభిశంసనను ఎదుర్కొంటున్నదశలో ఈ భేటీ జరిగింది. మరోవైపు భారత్‌లో జాతీయ పౌర పట్టిక, పౌరసత్వ సవరణ చట్టంపై భారీస్థాయిలో ఆందోళనలు సాగుతున్నాయి. అయినా ఈ వివాదాలతో నిమిత్తం లేకుండా చర్చలు అనుకున్న ప్రకారం సాగడం రెండుదేశాల సంబంధాల దృఢత్వాన్ని సూచిస్తున్నది. ఈ గందరగోళాలు, మీడియా వేసే ప్రశ్నలు మా సమావేశానికి సంబంధం లేనివని ప్రపంచం గ్రహించాలె. రెండు దేశాలకు వచ్చే దశాబ్దాలలో ప్రధానమైన వ్యూహాత్మక సంబంధాన్ని వృద్ధి చేయడానికి ఇరుదేశాల నాయకులు ఎంతో చిత్తశుద్ధితో కృషిచేస్తున్నారని పాంపియో చేసిన ప్రకటన సందర్భానుసారంగా ఉన్నది. రెండుదేశాల నాయకత్వాలు ఆంతరంగికంగా ఎంతో ఒత్తిడిని ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ చర్చలకు తగిన ప్రాధాన్యం లభించలేదు. కానీ మారుతున్న పరిస్థితుల్లో రెండు దేశాలు వివిధరంగాలలో సహకరించుకోవడం, సమన్వయంతో వ్యవహరించడం కోసం ఈ చర్చలు దోహదపడుతాయి. 2018లో మొదలైన ఈ టూ ప్లస్ టూ చర్చలు ఆశించినరీతిలో పురోగతి సాధిస్తున్నాయి.

**రెండుదేశాల మధ్య సంబంధాలు అల్లుకుపోవడానికి నాలుగు మౌలిక ఒప్పందాలు కీలకమైనవి. వీటిలో రెండు ఇప్పటికే కుదిరాయి. మూడవదైన కమ్యూనికేషన్స్ కాంపాటిబిలిటీ అండ్ సెక్యూరిటీ అగ్రిమెంట్‌పై అంగీకారం కుదిరింది. దీంతో రెండుదేశాల మధ్య రహస్య సమాచార, సాంకేతి క పరిజ్ఞానం బదిలీపై అడ్డంకులు ఉండవు. ఈ నేపథ్యంలో రెండు దేశాలలోని ప్రైవేటు రక్షణ రంగ కంపెనీల మధ్య భాగస్వామ్యానికి ఈ చర్చల్లో ఆమోదం లభించింది. దీంతో రక్షణరంగంలో భారీ పెట్టుబడులతో కూడిన ఒప్పందాలకు రంగం సిద్ధమైంది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో సాధించిన ప్రగ తి మూలంగా భారత్ అంతర్జాతీయ రంగంలో ప్రధాన శక్తిగా అవతరిస్తున్న భారత్‌కు అమెరికా మైత్రి కూడా అనుకూలాంశమే.**

ప్రచ్ఛన్నయుద్ధం ముగిసిన తర్వాత కాలంలో భారత్ అమెరికా మధ్య స్నేహసంబంధాలు బలపడటం మొదలైంది. కానీ అంతర్జాతీయ రంగంలో బలబలాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో తదనుగుణమైన వ్యూహాలను రూపొందించుకోవడం రెండు దేశాలకూ అవసరమే. భారత్ ఉపఖండంలో ఎదురవుతున్న సవాళ్ళు, భారత పాకిస్థాన్ వైషమ్యాలు కూడా చర్చకువచ్చాయి. శాంతి పరిరక్షణ దళాలను పంపించడంలో ప్రధాన పాత్ర పోషించే భారత్ ఇరుగుపొరుగు దేశాలను కూడా ఇందుకు కూడగట్టాలని భావిస్తున్నది. ఇవన్నీ మంత్రులస్థాయి చర్చల్లో చోటుచేసుకున్నాయి. ప్రత్యేకించి చైనా ప్రాబల్యం అనూహ్యంగా పెరుగుతుండటం అమెరికాను కలవరానికి గురిచేస్తున్నది. జపాన్, ఆస్ట్రేలియాతో పాటు భారత్‌ను కూడగట్టాలనే వ్యూహం ఇప్పటికే మొదలైంది. అయితే భారత్‌తో సహా ఏ దేశమూ అమెరికా ఆశించినస్థాయిలో స్పందించడం లేదు. ఈ నేపథ్యంలో చైనాను కట్టడి చేయడం ఈ టూ ప్లస్ టూ చర్చల్లో ప్రధానాంశమైంది. చైనా ప్రాబల్యానికి దీటుగా అన్ని ప్రాంతాలలో సమిష్టిగా వ్యవహరించాలనే దృఢనిశ్చయం వ్యక్తమైంది. రెండుదేశాల సైన్యాల మధ్య సహకారం పెంచడం ఈ మొత్తం చర్చలలో కీలకాంశంగా చెప్పుకోవచ్చు. మొదట నావికాదళాల మధ్య సహకారానికి ప్రాధాన్యమిస్తున్నాయి. అమెరికా సైన్యం అన్ని సముద్రజలాల్లో బలమైన స్థావరాలను కలిగి ఉన్నది. ఇండో పసిఫిక్ కమాండ్, సెం ట్రల్ కమాండ్, ఆఫ్రికా కమాండ్ పేర విస్తరించి ఉన్న అమెరికా నావికాదళాలతో భారత్ నౌకా విభాగాలను అనుసంధానం చేయాలని రెండుదేశాలు నిర్ణయించాయి. ఇదే రీతిలో భవిష్యత్తులో వైమానిక దళాల మధ్య కూడా అనుసంధానాన్ని పెంచుతాయి. సైనికదళాల మధ్య సమన్వయాన్ని ఏర్పరుస్తాయి.

రెండుదేశాల మధ్య సంబంధాలు అల్లుకుపోవడానికి నాలుగు మౌలిక ఒప్పందాలు కీలకమైనవి. వీటిలో రెండు ఇప్పటికే కుదిరాయి. మూడవదైన కమ్యూనికేషన్స్ కాంపాటిబిలిటీ అండ్ సెక్యూరిటీ అగ్రిమెంట్‌పై అంగీకారం కుదిరింది. దీంతో రెండుదేశాల మధ్య రహస్య సమాచార, సాంకేతిక పరిజ్ఞానం బదిలీపై అడ్డంకులు ఉండవు. ఈ నేపథ్యంలో రెండు దేశాలలోని ప్రైవేటు రక్షణ రంగ కంపెనీల మధ్య భాగస్వామ్యానికి ఈ చర్చల్లో ఆమోదం లభించింది. దీంతో రక్షణరంగంలో భారీ పెట్టుబడులతో కూడిన ఒప్పందాలకు రంగం సిద్ధమైంది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో సాధించిన ప్రగతి మూలంగా భారత్ అంతర్జాతీయ రంగంలో ప్రధాన శక్తిగా అవతరిస్తున్న భారత్‌కు అమెరికా మైత్రి కూడా అనుకూలాంశమే. ఆర్థికరంగంలో కూడా భారత్ ముందడుగు వేస్తున్నది. అయితే ఈ సందర్భంగా రెండు జాగ్రత్తలను పాటించడం అవసరం. ఒకటి అమెరికాతో ఎంత సన్నిహితంగా ఉన్న ఆ దేశానికి ఉపగ్రహంగా మారకుండా స్థిరంగా నిలబడగలుగాలె. తనదైన సొంత విదేశాంగ విధానాన్ని అనుసరించాలె. మరొకటి–ఆంతరంగికంగా ప్రశాంతంగా ఉన్నప్పుడే దేశం ఆర్థికాభివృద్ధిని సాధించగలుగుతుంది. అంతర్జాతీయరంగంలో ప్రబలశక్తిగా నిలబడగలుగుతుంది. ఇందుకు పౌర పట్టిక విషయంలో తలెత్తిన ఆందోళనలే ఉదాహరణ. అమెరికాలో ప్రతినిధుల సభ విదేశాంగ కమిటీ సమావేశాన్ని విదేశాంగ మంత్రి జయ్‌శంకర్ రద్దుచేసుకోవలసి వచ్చింది. ప్రతినిధుల సభలో కశ్మీర్ అంశాన్ని లేవనెత్తిన సభ్యురాలు ఈ సమావేశానికి హాజరవుతుండటమే ఇందుకు కారణం. దేశంలో అల్లర్లు చెలరేగితే ఇతర దేశాలు దానిని అలుసుగా తీసుకుంటాయి. అందువల్ల ఆంతరంగికంగా శాంతిస్థాపన ప్రాధాన్యాన్ని కేంద్రం గుర్తించాలె.

**జనగళం**

### సరైన న్యాయం

యూపీ ఉన్నావ్ లైంగికదాడి ఘటనలో ఎమ్మెల్యే కుల్‌దీప్‌సింగ్ సెంగార్‌కు దోషిగా శిక్ష ఖరారైంది. ఉద్యోగం కావాలంటూ వెళ్లిన మైనర్ బాలికపై ఎమ్మెల్యే లైంగికదాడికి పాల్పడటం హేయనీయం. ఇది చాలదంటూ ఘటన నుంచి తప్పించుకోవటానికి ఎమ్మెల్యే సెంగార్ పలు రకాల ప్రయత్నాలు చేశాడు. బాధితురాలు సీఎం ఇంటిముందు న్యాయం జరుగాలంటూ ఆత్మహత్యా ప్రయత్నం చేసిన మరుసటి రోజే కస్టడీలో ఉన్న బాధితురాలి తండ్రి మరణించాడు. దీంతో ఉన్నావ్ బాధితురాలికి మద్దతుగా దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. తర్వాత అరెస్టు అయిన సెంగార్‌ను ఇన్నిరోజులకు ఢిల్లీ కోర్టు దోషిగా తేల్చి జీవితఖైదు విధించడంతో బాధితురాలికి న్యాయం జరిగింది.

**- కె.ప్రవీణ్, హైదరాబాద్**

### ఆలోచనలో అర్థం

మహిళలపై నేరాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో 'షీ' టీమ్స్‌ను ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. దీంతో మహిళలపై జరుగుతున్న నేరాలు గణనీయంగా తగ్గాయి. ఇదే విధంగా మహిళలకు రక్షణ కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా కూడా గ్రామ స్వయం సహాయక సంఘాల ద్వారా 'షీ' టీంలను ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఒకవేళ రాష్ట్రవ్యాప్తంగా షీ టీమ్‌లు ఏర్పాటయితే మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు కచ్చితంగా అడ్డుకట్ట పడుతుంది. ప్రభుత్వ ఆలోచన చాలా మంచిది.

**- మాసబోయిన రజనీగౌడ్, బద్దిపల్లి, కరీంనగర్**

### కఠినశిక్షలు అమలు చేయాలె

గత కొన్ని రోజులుగా ఏసీబీ అధికారుల దాడుల్లో రోజుకొక్కరు చిక్కుతుండటం శోచనీయం. ఇటీవల చిక్కిన హుజూరాబాద్ డిప్యూటీ తహశీల్దార్ సందీప్ వీడియో సామాజిక మాధ్యమాల్లో చెక్కర్లు కొడుతున్నది. ఇలాంటి అవినీతి అధికారులను కఠినంగా శిక్షించాలంటూ నెటిజన్లు కోరుతున్నారు. ఏసీబీ వలలో చిక్కిన అవినీతి అధికారులకు సరైన శిక్ష పడితేనే ఇలాంటి ఘటనలు పునరావృతం కావు.

**- సీహెచ్.అరుణ్‌కుమార్, మంచిర్యాల**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ముక్తసరి



**దేవులపల్లి ప్రభాకరరావు**

# ముందున్నది ముసళ్ల పండుగ

ఈ రోజుల్లో అందరి చేతుల్లో, ఉద్యమించే వారి చేతుల్లో, ఉద్యమాలను అణగదొక్కాలనుకునే వారి చేతుల్లో ఇంటర్నెట్ ఒక ముఖ్యమైన ఆయుధం. విశేషించి ఉద్యమకారులకు ఇంటర్నెట్ తమ ఉద్యమవ్యాప్తికి సులభంగా అందుబాటులో ఉన్న ఆయుధం. గొంతు విప్పడానికి ఇంటర్నెట్ సులభంగా ఉపయోగపడుతున్నది గనుక గొంతు నొక్కడానికి ఇంటర్నెట్‌ను తొలిగించాలని, నిషేధించాలని నేటి పాలకులు భావిస్తున్నారు.

ముందున్నది ముసళ్ల పండుగ–ఇప్పటిది నథింగ్ అంటారు రానున్న రోజుల పరిణామాలను ఊహించగలిగినవాళ్లు. ఈ సంగతి పోతులూరి వీరబ్రహ్మంగారు చెప్పినారో లేదో తెలియదు–ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషకులు ఈ మాటలు అంటున్నారు. 'ముసళ్ల పండుగ చేసుకుంటాయా' అని యాదగిరి చిన్నబ్బాయి అడిగాడు. ముసళ్ల పండుగ చేసుకోవాలంటే మూగ, జల జీవాలు ఎన్నో ఖతం కాక తప్పదు, చిన్నబ్బాయికి అన్నీ సందేహాలే. సందేహాల సందోహం, సందేహాల బందూకు చిన్నబ్బాయి. 'త్వరలో రాజ్యాంగం రద్దయి ఇండియన్ హిందూ రిపబ్లిక్ ఏర్పడుతుందా?' అని చాలా అమాయకంగా అడిగాడు చిన్నబ్బాయి. 'గింతలేదు, గంత ప్రశ్నా' అని అందరు ఆశ్చర్యపడ్డారు. అడుగాలని ఉన్నా అందరు ఇటువంటి ప్రశ్నలు అడుగడానికి సాహసించరు. ఈ పిల్లగాడు సాహసించి మనసులో ఉన్నది బయటికి కక్కిండు. ఈ ప్రశ్నలకు జవాబులు ఎవరు చెప్పాలె! కాలం చెప్పుతుందని ఒకాయన తాత్త్విక ధోరణితో అన్నాడు. 'పాకిస్థాన్ వాళ్లందరికి భారత పౌరసత్వం ఇస్తామని ప్రకటించండి..' అంటూ ప్రధానమంత్రి మోదీజీ ఈ దేశం ప్రతిపక్షాలకు ఒక సవాల్ విసిరారు. 'ఇక పాకిస్థాన్ ఖాళీ అవుతుందా' అని చిన్నబ్బాయి ప్రశ్నించాడు. ముసళ్ల పండుగ ముచ్చటతో మొదలైంది తర్కం. 'ఆగె ఆగె దేఖియె హోతాహైక్యా' అని ఉర్దూలో అంటారు. 'ఏమైతది, ఎవరూ ఏం పీకలేరు' అని ఎమర్జన్సీ టైమ్‌లో సైతం మాట్లాడని మాటలు మాట్లాడుతున్నారు. చిన్నబ్బాయికి, చిన్నబ్బాయి వంటి వారికి ఎన్నో సందేహాలు కలుగడం సహజమే. ఎవరైనా ఉన్న మాటంటే కొందరికి ఎందుకో ఉలుకు. మూడేండ్ల కిందట మూడు, నాలుగు లక్ష్యాలతో నోట్లరద్దు జరిగినప్పుడు ఎవరి అభిప్రాయాలు వారు చెప్పారు–నిజానికి ఉలుకు అవసరం లేదు. ఆర్థికవేత్తగా, ఆర్థిక సంస్కరణల నిపుణుడిగా, పదేండ్లు ప్రధానిగా ప్రసిద్ధి పొందిన డాక్టర్ మన్మోహన్‌సింగ్ నోట్లరద్దును తీవ్రంగా విమర్శించారు–అది చట్టబద్ధ దోపిడీ అని, ఆర్థిక వ్యవస్థలో తీవ్రపరిణామాలకు దారి తీస్తుందన్నారు. ఆ పెద్దమనిషి హెచ్చరికలను ఖాతరు చేయలేదు, ఆయనను అవమానించారు. ఆ రోజు ఆయన చేసిన హెచ్చరికలన్నీ నిజాలుగా రూఢీ అవుతున్నాయని ఈరోజు ప్రపంచంలో–ప్రపంచ బ్యాంకులో, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థలో, ఇతర అంతర్జాతీయ ఆర్థిక సంస్థల్లో, అంతర్జాతీయస్థాయి విశ్వవిద్యాలయాల ఆర్థిక పరిశోధనా విభాగాల్లో అంగీకరించని ఆర్థికవేత్త లేడంటే అతిశయోక్తి కాదు. యూరప్‌లో, అమెరికాలో జరుగుతున్న ఆర్థిక సమావేశాల్లో ఎక్కడా భారతదేశం ప్రస్తావన రావడం లేదని, అభివృద్ధి చెందుతున్న దేశంగా ఇంతకుముందున్న విలువ ఇప్పుడు భారతదేశానికి లేదని అంటున్నారు. భారతదేశం ఆర్థికంగా తిరోగమిస్తున్నదని, వార్షిక అభివృద్ధి రేటు ఎన్నడూ లేనంతగా క్షీణించిందని అందరు అంటున్నారు. 'భారత ఆర్థిక వ్యవస్థ వెనుకకు వెళ్లడం లేదు, ముందుకు వెళ్లడం లేదు' అని కేంద్ర ఆర్థికమంత్రి అమ్మాజీ అంటున్నారు. దీన్ని అభివృద్ధి అంటారా? దీని భావమేమిటో అమ్మాజీయే వరించాలి. భారత ప్రభుత్వానికి, ప్రధాన మంత్రి మోదీజీకి కొంతకాలం ప్రధాన ఆర్థిక సలహాదారుగా వ్యవహరించిన అరవింద్ సుబ్రహ్మణ్యం నోట్లరద్దు నాటినుంచి దేశం ఆర్థిక వ్యవస్థ ఎంతగా దిగజారుతున్నదో ఇటీవల ఆర్థిక పరిభాషలో దీర్ఘంగా వివరించారు. ఒక్కమాటలో ఆయన సారాంశాన్ని ఈ విధంగా వివరించారు.. "..This is not just any slow down, this is the great slow down that India is experiencing" ఈ మాటలను, నోట్లరద్దు తర్వాత భారత ఆర్థికవ్యవస్థ దుస్థితిపై ఆయన విశ్లేషణను గమనించినప్పుడు 'ముందున్నది ముసళ్ల పండుగ' అని అనకతప్పదు.

గెటు పంచాయితీ, గట్టు పంచాయితీ, జట్టు పంచాయితీ, ముట్టు పంచాయితీ–పంచాయితీ, తగాదా, గొడవ ఏదైనా ఇద్దరు వ్యక్తుల మధ్య, లేక రెండుమతాల మధ్య చెలరేగినప్పుడు ధ్వనించే మొదటి మాట 'నోర్మూయ్'. నోరు మూయిస్తే గొడవ బయటికి పొక్కకుండా అక్కడే ఆగిపోతుందని అనుకుంటారు. గ్రామ పంచాయతీ నుంచి రాష్ట్ర, జాతీయ చట్టసభల వరకు 'నోర్మూయించే' ప్రయత్నాలు జోరుగా జరుగుతుంటాయి. ఆధునిక కమ్యూనికేషన్ సదుపాయాలు మారుమూల గ్రామాలకు సైతం విస్తరించిన ఈ రోజుల్లో నోరు తెరిస్తే (ఎస్సెమ్మెస్, మెయిల్, ఇంటర్నెట్, మొబైల్ ద్వారా) సమాచారం, విమర్శలు, ఆరోపణలు, హెచ్చరికలు, సందేశాలు, ఆదేశాలు, అభియోగాలు క్షణాల్లో సర్వత్రా విస్తరిస్తాయని భయపడుతున్నారు. ఈ రోజుల్లో అందరి చేతుల్లో, ఉద్యమించే వారి చేతుల్లో, ఉద్యమాలను అణగదొక్కాలనుకునే వారి చేతుల్లో ఇంటర్నెట్ ఒక ముఖ్యమైన ఆయుధం. విశేషించి ఉద్యమకారులకు ఇంటర్నెట్ తమ ఉద్యమ వ్యాప్తికి సులభంగా అందుబాటులో ఉన్న ఆయుధం. గొంతు విప్పడానికి ఇంటర్నెట్ సులభంగా ఉపయోగపడుతున్నది గనుక గొంతు నొక్కడానికి ఇంటర్నెట్‌ను తొలిగించాలని, నిషేధించాలని నేటి పాలకులు భావిస్తున్నారు. 2019, ఆగస్టు 5న పార్లమెంటులో ఒక చట్టం చేయడం ద్వాకా జమ్ము–కశ్మీర్ రాష్ట్రానికున్న ప్రత్యేక ప్రతిపత్తిని (370 ఆర్టికల్, 35ఎ ఆర్టికల్) రద్దు చేయాలనుకున్న మోదీజీ ప్రభుత్వం ఆ చట్టం అమలుకు జమ్ము–కశ్మీర్‌లో లక్షల మంది సైనికులను, సీఆర్పీఎఫ్, ఇతర సాయుధ బలగాలను మోహరించడం వల్ల ఆశించిన ఫలితం లభిస్తుందనుకోలేదు. సాయుధ బలగాల మోహరింపు కంటే ముఖ్యం ఇంటర్నెట్‌ను నిషేధించడమని భావించారు. ఇంతవరకు–ఆగస్టు 5 నుంచి నాలుగున్నర నెలలు గడిచినా, సాయుధ బలగాలను కొంతవరకు ఉపసంహరిస్తున్నట్లు వార్తలు వస్తున్నా, అంతర్జాతీయ స్థాయిలో, ముఖ్యంగా అమెరికా, బ్రిటన్ తదితర దేశాల్లో, అక్కడి చట్టసభల్లో, మీడియాలో తీవ్ర విమర్శలు చెలరేగుతున్నా (జమ్ము–కశ్మీర్‌లో మానవహక్కులకు భంగం జరుగుతున్నదని, ఇంటర్నెట్‌ను నిషేధించడం ద్వారా భావప్రకటన స్వాతంత్ర్యానికి విఘాతం కలుగుతున్నదని) మోదీజీ ప్రభుత్వం జమ్ము–కశ్మీర్‌లో ఇంటర్నెట్‌పై నిషేధం తొలిగించడానికి సాహసించడం లేదు. సైన్యం కంటే, ఇతర సాయుధ బలగాల కంటే ఇంటర్నెట్‌పై నిషేధం, గొంతు నొక్కడం, భావ ప్రసరణ వ్యాప్తిని నిరోధించడం అతి ముఖ్యమని బహుశా మోదీజీ ప్రభుత్వం భావిస్తున్నది. జమ్ము–కశ్మీర్‌లో ఇంటర్నెట్‌పై నిషేధం అక్రమమని అమెరికన్ కాంగ్రెస్ (ప్రజాప్రతినిధుల సభ–పార్లమెంటు) ఒక తీర్మానంలో విమర్శించింది. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసన ఉద్యమాలు విజృంభించిన ఈశాన్య భారతంలో (ముఖ్యంగా అస్సాం, త్రిపుర రాష్ట్రాల్లో) సైతం మోదీజీ ప్రభుత్వం ఇంటర్నెట్ నిషేధాన్ని ఒక ఆయుధంగా ప్రయోగిస్తున్నది. 72 ఏండ్ల స్వతంత్ర భారతంలో, భావప్రకటన స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలనలో దేశద్రోహం కేసుల్లో ఇరుక్కున్న జాతిపిత గాంధీజీ 150వ జయంతి ఉత్సవాలు జరుగుతున్నవేళ మోదీజీ ప్రభుత్వం జరుపుతున్న అపూర్వ ఆయుధ ప్రయోగం ఇది. దేశమంతా నార్మల్, జమ్ము–కశ్మీర్, అస్సాం, బెంగాల్, త్రిపుర, అరుణాచల్‌ప్రదేశ్, మేఘాలయ అన్నీ నార్మల్–అయినా, అరుణాచల్‌ప్రదేశ్, మేఘాలయ రాష్ట్రాల్లో దేశ వ్యవహారాల మంత్రి పర్యటన రద్దు, భారత్‌లో జపాన్ ప్రధాని, బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి పర్యటనలు రద్దు, వార్తా ప్రసారాల విషయంలో కొన్ని ఆదేశాలిస్తూ కేంద్ర సమాచార ప్రసారశాఖ నుంచి అన్ని టీవీ ఛానళ్లకు హుకూం జారీ, భారతదేశం వెళ్లాలనుకుంటే 'జర జాగ్రత్తగా ఉండాలని' అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇజ్రాయెల్ ప్రభుత్వాల నుంచి ఆ దేశాలు, పౌరులకు హెచ్చరికలు, భారతదేశంలో ప్రజాస్వామ్యం విలువలు నశిస్తున్నాయని అమెరికన్ కాంగ్రెస్ విదేశ వ్యవహారాల కమిటీలో తీర్మానం, భారతదేశంలో అన్ని మతాలకు సమాన స్వేచ్ఛ లభించడం లేదని అమెరికా మానవ హక్కుల కమిషన్ అసంతృప్తి–ముసళ్ల పండుగ రాకముందే ఈ దేశంలో ఇటువంటి పరిణామాలు. 24 ఏండ్లు ఇరాక్ అధినేతగా, నియంతగా వ్యవహరించిన సద్దాం హుస్సేన్ రహస్యంగా మానవ సంహార ఆయుధాలను ఉత్పత్తి చేస్తున్నాడని అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ విలియమ్ బుష్, బ్రిటన్ ప్రధాని టోనీ బ్లెయిర్ అనుమానించారు; అటువంటి ఉత్పత్తి ఏదీ జరుగడం లేదని ఐరాస ఇన్‌స్పెక్టర్లు ఇరాక్ గల్లీగల్లీ శోధించి వచ్చి చెప్పినా బుష్, బ్లెయిర్ అనుమానం దూరం కాలేదు. సద్దాంను ఉరితీసి చంపేవరకు బుష్, బ్లెయిర్ నిద్రపోలేదు. ప్రజాస్వామ్యానికి సమాధికట్టే భయంకర ఆయుధం ఇంటర్నెట్ నిషేధమని తెలిస్తే బుష్, బ్లెయిర్ ఏం చేసేవారో!...

> భారతదేశం వెళ్లాలనుకుంటే 'జర జాగ్రత్తగా ఉండాలని' అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇజ్రాయెల్ ప్రభుత్వాల నుంచి ఆ దేశాలు, పౌరులకు హెచ్చరికలు, భారతదేశంలో ప్రజాస్వామ్యం విలువలు నశిస్తున్నాయని అమెరికన్ కాంగ్రెస్ విదేశ వ్యవహారాల కమిటీలో తీర్మానం, భారతదేశంలో అన్ని మతాలకు సమా న స్వేచ్ఛ లభించడం లేదని అమెరికా మానవ హక్కుల కమిషన్ అసంతృప్తి-ముసళ్ల పండుగ రాకముందే ఈ దేశంలో ఇటువంటి పరిణామాలు.

# తెలంగాణకు న్యాయం చేయాలె

నీటి పొరుదల

**శ్రీధర్‌రావు దేశ్‌పాండే**

**సల్లా విజయ్‌కుమార్**

## పొంచి ఉన్న పోతిరెడ్డిపాడు ముప్పు-2

1976లో మూడు కృష్ణా బేసిన్ రాష్ట్రాలు, తమిళనా డు, కేంద్రం శ్రీశైలం నుంచి చెన్నైకి మూడు రాష్ట్రాలు చెరో 5 టీఎంసీ నీరు ఇవ్వాలనే ఒప్పందంపై సంతకం చేశాయి. ఆ తర్వాత 1977 ఒప్పందం జరిగింది. ఒప్పందాల పర్యవసానంగా చెన్నైకి 1500 క్యూసెక్కుల సామర్థ్యం గల ఓపెన్ చానెల్ ద్వారా 15 టీఎంసీల నీటిని తీసుకెళ్లాలి. మరోవైపు శ్రీశైలం కుడి కెనాల్ ద్వారా 19 టీఎంసీల నీటిని 75 శాతం నికర జలాల కోసం ప్లానింగ్ కమిషన్ క్లియరెన్స్ ఉచ్చుకున్నారు. దాంట్లో 200 కి.మీ.ల కెనాల్‌తో పాటుగా, ఒక అప్రోచ్ చానల్, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, శ్రీశైలం కుడి ప్రధాన కాలువ (ఎస్‌ఆర్‌ఎంసీ), బనకచెర్ల వద్ద ఒక క్రాస్ రెగ్యులేటర్‌ను ప్రతిపాదించారు.19 టీఎంసీలలో 11 టీఎంసీలను తెలంగాణ ప్రాజెక్టుల ద్వారా వచ్చే రిటర్న్ ఫ్లోను, 8 టీఎంసీలను కేసీ కెనాల్ ఆధునీకరణ ద్వారా మిగిలే జలాలను కేటాయించారు.

ఇట్లా తెలుగు గంగ, ఎస్‌ఆర్‌బీసీలకు న్యాయబద్ధత కల్పించి 1983 నాటికల్లా తమిళనాడుతో ఒప్పందం కుదుర్చుకొని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, ఇతర అన్ని అనుబంధ పనులకు శ్రీకారం చుట్టారు. ఆ పనుల్లో ప్రతిపాదించినవి ఆశ్చర్యం గొలుపుతాయి. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ కేవలం 11,150 క్యూసెక్కులుగా ఉంచి, అక్కడి నుంచి వచ్చే నీటిని తరలించే మూడు క్రాస్ రెగ్యులేటర్ల ద్వారా మొత్తం 33,450 క్యూసెక్కుల సామర్థ్యం (11,150X3) ఎందుకు అన్న ప్రశ్న జలరంగ నిపుణులను కలిగేది. అయితే, దీనికి సమాధానం 2006లో దొరికింది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను, ఎస్‌ఆర్‌ఎంసీని 44 వేల క్యూసెక్కులకు పెంచుతున్నట్లు ప్రకటించారు. దివంగత ఆర్.విద్యాసాగర్‌రావు ఎండబ్ల్యూడీ ఏ చీఫ్ ఇంజినీర్‌గా ఒకసారి కేంద్ర జలసంఘం చైర్మన్ ఎంఎస్ రెడ్డితో బనకచర్ల సందర్శించినప్పుడు ఈ అంశాన్ని గమనించారు. ఎంఎస్ రెడ్డితో ప్రస్తావిస్తే మనకెందుకులే అని ఆయన చర్చను మళ్లించారు. అయితే విద్యాసాగర్‌రావు మదిని ఈ అంశం తొలుస్తూనే ఉన్నది. ఉద్యమ సమయంలో 'నీళ్ళు నిజాలు' పుస్తకంలో దీన్ని ప్రస్తావిస్తూ 'దాల్ మే కుచ్ కాలా హై' అని రాశారు.

వాస్తవంగా నేడున్న నిర్మాణాల సామర్థ్యం చూస్తే.. నేడు పోతిరెడ్డిపాడు వద్ద మొత్తం పాతవి 4 గేట్లు (3+1 స్టాండ్ బై), కొత్తవి 10 గేట్లు (9+1 స్టాండ్ బై). అన్నీ గేట్ల లెవెల్లు, కొలతలు సమానమే కాబట్టి, 9 గేట్ల ద్వారా 44,000 క్యూసెక్కుల డిశ్చార్జ్ వెళ్తుంది కాబట్టి ఒక్కో గేట్ ద్వారా 4,889 క్యూసెక్కులు వెళ్తుంది. మొత్తం 14 గేట్ల ద్వారా 68,440 క్యూసెక్కుల డిశ్చార్జ్. ఇది 880 ఫీట్ల లెవెల్లో శ్రీశైలంలో నీటి మట్టం ఉంటే. కానీ వరద సమయాల్లో, అంటే 885 ఫీట్ల గరిష్ఠ లెవెల్లో శ్రీశైలంలో నీటి మట్టం ఉంటే 1,71,460 క్యూసెక్కులు విడుదల చేయవచ్చు. వీటికితోడు 5,500 క్యూసెక్కుల ఎలక్ట్రిక్ పవర్ స్లూయిస్ ద్వారా విడుదల చేయవచ్చు. అంటే మొత్తం 1,77,000 క్యూసెక్కుల డిశ్చార్జ్ చేయడానికి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం ఉంది. అయితే, కెనాల్ (ఎస్‌ఆర్‌ఎంసీ) సామర్థ్యం ఎంత ఉందో అంతే డిశ్చార్జ్ కెనాల్లో వెళ్లగలుగుతుంది. నేడు 44 వేల క్యూసెక్కులు మాత్రమే కెనాల్ కెపాసిటీ (256 ఫీట్ల బెడ్ విడ్త్, 39 ఫీట్ల లోతు) ఉన్నది కాబట్టి అంతే గరిష్ఠ డిశ్చార్జ్ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా సాధ్యమవుతుంది. ఏపీ చెబుతున్నట్లుగా 80 వేల క్యూసెక్కులుగా పెంచడం కెనాల్ కొలతలు మార్చకుండానే సాధ్యమవుతుంది. కాంక్రీట్ లైనింగ్ చేసినట్లయితే ఆ కెనాల్ కొలతలేమీ మార్చకుండానే 85,560 క్యూసెక్కుల సామర్థ్యంతో కెనాల్లో డిశ్చార్జ్ చేయవచ్చు. బహుశా నేడు ఆంధ్రప్రదేశ్ యోచిస్తున్నది ఈ విధంగా పెంచడమే అనుకోవాలి.

అంటే, 85,560 క్యూసెక్కుల సామర్థ్యంతో కెనాల్లో డిశ్చార్జ్ పంపిస్తే రోజుకు 7.4 టీఎంసీల నీటిని తరలించవచ్చు. ఇప్పటికే బనకచెర్ల వద్ద క్రాస్ రెగ్యులేటర్ల కెపాసిటీని 44 వేల క్యూసెక్కులకు పెంచిన ఆంధ్రప్రదేశ్ ఇకముందు 85,560 క్యూసెక్కుల డిశ్చార్జ్‌కు పెంచడం పెద్ద కష్టమైన పనికాదు. వరద జలాలను మాత్రమే తరలిస్తామని వారు చెపుతున్నప్పటికీ 854 అడుగుల మట్టంలో శ్రీశైలం జలాశయంలో నీరుంటే పోతిరెడ్డిపాడు జలాశయం నుంచి నీటిని తరలించబోరన్న గ్యారంటీ ఏమిటి? దీన్ని నియంత్రించడం సాధ్యమా? ఇప్పుడు మన అనుభవాలను బట్టి చూస్తే అది సాధ్యం కాదనే తెలుస్తున్నది. ఇక తెలంగాణకు గ్రావిటీ మార్గాన ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ స్కీమ్ మాత్రమే నిర్మాణంలో ఉంది. దాని కెపాసిటీ 4 వేల క్యూసెక్కులు (రోజుకు 0.35 టీఎంసీ) మాత్రమే. లిఫ్ట్ స్కీమ్ అయినప్పటికీ పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు, డిండి ప్రాజెక్టులు మొదలైతే శ్రీశైలం జలాశయం నుంచి సుమారు 30 వేల క్యూసెక్కులను (పాలమూరు– 22,000, కల్వకుర్తి–5000, టన్నెల్–4000) తరలించే అవకాశం ఉంటుంది. అంటే రోజుకు 2.69 టీఎంసీలు తెలంగాణ నీటిని కరువు ప్రాంతాలకు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ఇవ్వగలుగుతుంది.

**కేసీ కెనాల్:** తుంగభద్ర ఆధారంగా నిర్మించిన కేసీ కెనాల్‌ను శ్రీశైలం రిజర్వాయర్‌పై ఆధారపడే ప్రాజెక్టుగా మార్చివేశారు. కేసీ కెనాల్ ద్వారా తీసుకెళ్లే నీటిలో 90 శాతానికి పైగా కృష్ణా బేసిన్ అవలకు మరలిస్తారు.

**ఎస్‌ఎల్‌బీసీ:** 1969లో ఏర్పడిన బచావత్ ట్రిబ్యునల్ ఎదుట, 1970లో శ్రీశైలం రిజర్వాయర్ నుంచి గ్రావిటీ ద్వారా కృష్ణా బేసిన్లోని నల్గొండ, ఖమ్మం జిల్లాలకు 150 టీఎంసీల సాగు నీళ్లివ్వడానికి ఎస్‌ఎల్‌బీసీ స్కీమ్‌ను నాటి ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే 1973లో ఆ ప్రాజెక్టుకు నికర జలాలు కాకుండా, మిగులు జలాలు కేటాయిస్తే చాలని నివేదించింది. మిగులు జలాల కేటాయింపులు నాటి బచావత్ ట్రిబ్యునల్ చేయలేదు. ఆ తర్వాతి కాలంలో 1985లో ఎస్‌ఎల్‌బీసీని 30 టీఎంసీలకు పరిమితం చేసి (4000 క్యూసెక్కుల డిశ్చార్జ్) పోలవరం ప్రాజెక్టు ద్వారా కృష్ణా నదికి మళ్లించే గోదావరి జలాలకు ముడిపెట్టి సిడబ్ల్యూసీ క్లియరెన్స్‌కు నివేదించింది. సీడబ్ల్యూసీ ఆ ప్రాజెక్టు రిపోర్టును పోలవరం ప్రాజెక్టు క్లియరెన్స్ వచ్చాక నివేదించండని 1986లో వెనక్కి పంపింది. అట్లా బుట్టదాఖలైన ఆ ప్రాజెక్టును తెలంగాణ ప్రజలను సముదాయించేందుకు వాడుకుంటూ వచ్చాయి ఉమ్మడి ప్రభుత్వాలు. మొదట ఎస్‌ఎల్‌బీసీని శ్రీశైలం కుడివైపున గల ఎస్‌ఆర్‌బీసీకి సమాన ప్రాజెక్టుగా, ఆ తర్వాత తెలుగుగంగ ప్రాజెక్టుకు సమానంగా పేర్కొంటూ, ఆ తర్వాత తాత్కాలికంగా నాగార్జునసాగర్ నుంచి లిఫ్ట్ ద్వారా తెస్తామని చెప్పి సాగదీస్తూ వచ్చాయి. తెలంగాణ ఉద్యమం తీవ్రమయ్యాక 2005లో గానీ పనులు మొదలుపెట్టలేదు. నేడు కొత్తగా కొంతమంది శ్రీశైలం నుంచి కుడివైపున నిర్మాణం పూర్తిగావస్తున్న వెలిగొండ (రోజుకు ఒక టీఎంసీ) తరలించుకుపోగల మరో టన్నెల్ స్కీమ్‌కు సమానమైన ప్రాజెక్టుగా ఎస్‌ఎల్‌బీసీని పేర్కొంటున్నారు. ముందుముందు మరే స్కీమ్‌తో సమానమని ప్రచారం జరుగుతుందో చూడాలి. ఏదేమైనా పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని పెంచడం తెలంగాణ ప్రాజెక్టులకు గొడ్డలిపెట్టు లాంటిదని చెప్పకతప్పదు.

ఎన్ డబ్ల్యూడీఏ తెలుగు గంగ ప్రాజెక్టును గొప్ప అంతర్రాష్ట్ర నదీ జలాల తరలింపు ప్రాజెక్టుగా కీర్తిస్తూ ఉంటుంది. కానీ నిజానికి శ్రీశైలం రిజర్వాయర్ పక్కనే ఉన్న మహబూబ్‌నగర్ ప్రజలు తాగునీటికి అలమటిస్తూ ఉంటే, వందల కిలోమీటర్ల దూరంలో పంటల కోసం నీటిని (చెన్నైకి తాగునీరు ఇవ్వడాన్ని మేం ఆక్షేపించడం లేదు) తరలించే పోతిరెడ్డిపాడు లాంటి ఒక ఇల్లీగల్ ప్రాజెక్టును, తెలుగుగంగను రాష్ట్రాల మధ్య సహకారానికి గొప్ప నిదర్శనమనడం సత్యదూరం. నిష్పక్షపాతంగా కేంద్ర సంస్థలు పనిచేసి తెలంగాణకు న్యాయం చేయాలి. బేసిన్లోని కరువు పీడిత, ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు తెలంగాణ ప్రతిపాదిత ప్రాజెక్టుల ద్వారా శ్రీశైలం నుంచి నికర జలాలను మళ్లించడంలో సహాయపడాల్సిన బాధ్యత సీడబ్ల్యూసీ, ఎన్‌డబ్ల్యూడీఏ, కేఆర్‌ఎంబీ లాంటి సంస్థలపై ఉన్నది.

> తెలంగాణ ఉద్యమం తీవ్రమయ్యాక 2005లో గానీ పనులు మొదలుపెట్టలేదు. నేడు కొత్తగా కొంతమంది శ్రీశైలం నుంచి కుడివైపున నిర్మాణం పూర్తిగావస్తున్న వెలిగొండ (రోజుకు ఒక టీఎంసీ) తరలించుకుపోగల మరో టన్నెల్ స్కీమ్‌కు సమానమైన ప్రాజెక్టుగా ఎస్‌ఎల్‌బీసీని పేర్కొంటున్నారు. ముందుముందు మరే స్కీమ్‌తో సమానమని ప్రచారం జరుగుతుందో చూడాలి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com




వారణాసిలో లాఠీచార్జీ.. ఢిల్లీలోని ఇండియాగేట్ వద్ద పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడిన యువకుడు

## నిరసనలపై ప్రభుత్వం ఉక్కుపాదం: సోనియాగాంధీ

**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజలు తీవ్ర నిరసనలపై ఉక్కుపాదం మోపుతున్నదని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని శుక్రవారం ఆమె ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వ విభజన ఎజెండాకు, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, ఐఐఎంల విద్యార్థులు రోడ్డెక్కి నిరసన చేపడుతున్నా మోదీ సర్కార్ పట్టించుకోవడం లేదన్నారు. సీఏఏకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలు, విద్యార్థులకు సంఘీభావం తెలుపుతున్నానని పేర్కొన్నారు.



హైదరాబాద్‌లోని చార్మినార్ వద్ద భారీ నిరసన ప్రదర్శన

## సీఏఏను ఆమోదించం

ముస్లిం, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మక్కా మసీదు, చార్మినార్ వద్ద ప్రదర్శన

**రంగారెడ్డి జిల్లా, నమస్తే తెలంగాణ/చార్మినార్:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను ఆమోదించబోమని శుక్రవారం హైదరాబాద్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో శాలిబండ, మొఘల్‌పురా తదితర ప్రాంతాల్లో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న పలు ముస్లిం సంఘాలు తెలిపాయి. శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల తర్వాత మక్కా మసీదు వద్ద భారీ సంఖ్యలో ముస్లింలు కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు సుమారు 14 మందిని అరెస్ట్ చేసి కాంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చార్మినార్, మక్కా మసీదుల వద్ద పలు ముస్లిం, విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. పోలీసులు చార్మినార్ వద్ద ముందు జాగ్రత్త చర్యగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 33 మంది మహిళలతోపాటు 50 మందికి పైగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సౌత్ జోన్ ఇన్‌చార్జి ఏసీపీ అవినాశ్ మహంతి చెప్పారు. కాగా, మొఘల్‌పురాలోని డీజేఎస్ సంస్థ కార్యాలయం వద్ద ఆందోళనకారులు పోలీసులపైకి రాళ్లు రువ్వారు.



# యూపీ రణరంగం

### రాష్ట్రమంతటా విస్తరించిన సీఏఏ వ్యతిరేక నిరసనలు.. ప్రధాన నగరాల్లో హింస.. తొమ్మిదిమంది మృతి



శుక్రవారం ఢిల్లీలోని జామా మసీదు వద్ద నిరసనలో పాల్గొన్న వేలాది మంది ముస్లింలు

- 12కుపైగా జిల్లాల్లో మొబైల్ సేవలు బంద్
- దేశవ్యాప్తంగా కొనసాగిన నిరసనలు
- ఢిల్లీలో జామా మసీదు వద్ద వేలమంది ప్రదర్శన
- యూటర్న్ తీసుకుంటున్న బీజేపీ మిత్ర పక్షాలు
- మెత్తబడుతున్న కేంద్రం.. సలహాలు స్వీకరించేందుకు సిద్ధమని వెల్లడి

**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:** పౌరసత్వ సవరణ చట్టంపై (సీఏఏ) ప్రజాగ్రహం కొనసాగుతున్నది. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసినా, ఆంక్షలు విధించినా నిరసనకారులు వెనక్కి తగ్గడం లేదు. దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం ఉత్తరప్రదేశ్ రణరంగంగా మారింది. ముస్లింల ప్రార్థనల అనంతరం అనేక నగరాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోగా, ఎనిమిదేండ్ల బాలుడు సహా తొమ్మిది మంది మరణించారు. ఢిల్లీలోని జామా మసీదు వద్ద భారీ నిరసన ప్రదర్శన జరిగింది. అనేక రాష్ట్రాల్లో వేలమంది ఆందోళనకారులు రోడ్లమీదికి వచ్చారు. యూపీ, కర్ణాటకలో పలు నగరాల్లో మొబైల్ సేవలను నిలిపివేశారు. ప్రజాగ్రహం నేపథ్యంలో బీజేపీ మిత్రపక్షాలు ఒక్కొక్కటిగా యూటర్న్ తీసుకుంటున్నాయి. ఎన్నార్సీని బీహార్‌లో అమలుచేయబోమంటూ జేడీయూ అధ్యక్షుడు, ఆ రాష్ట్ర సీఎం నితీశ్ కుమార్ ప్రకటించారు. సమాజంలోని ఒక వర్గం ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయడంలో కేంద్రం విఫలమైందని లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ విమర్శించారు. ఈ నేపథ్యంలో కేంద్రం కాస్త మెత్తబడ్డట్టు కనిపిస్తున్నది. ఈ చట్టంపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు, సందేహాలను నివృత్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర హోంశాఖకు చెందిన ఓ అధికారి పేర్కొన్నారు.

**20 జిల్లాల్లో ఉద్రిక్తత**

సీఏఏ వ్యతిరేక ప్రదర్శనలతో ఉత్తరప్రదేశ్ అట్టుడుకుతున్నది. ఆందోళనలు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాయి. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన హింసాత్మక ఘటనల్లో తొమ్మిది మంది ఆందోళనకారులు మృతిచెందినట్టు తెలుస్తున్నది. మీరట్‌లో ముగ్గురు, బిజ్నూర్‌లో ఇద్దరు, వారణాసి, ఫిరోజ్‌బాద్, సంభల్, కాన్పూర్‌లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. వారణాసిలో తొక్కిసలాట జరిగి ఎనిమిదేండ్ల బాలుడు మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 జిల్లాల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. అనేక చోట్ల ఆందోళనకారులు పోలీసులపైకి రాళ్లు రువ్వారు. వారిని అదుపు చేసేందుకు పోలీసులు కాల్పులు జరిపారు. ఫిరోజాబాద్‌లో నిరసనకారులు పలు వాహనాలకు నిప్పు పెట్టారు. కాన్పూర్‌లో ఆందోళనకారులు జరిపిన దాడిలో ఎస్పీ అపర్ణ గుప్తా సహా నలుగురు పోలీసులు గాయపడ్డారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఏడుగురు గాయపడ్డారు. లక్నో, బులంద్ షహర్‌లో నిరసనకారులు పలు వాహనాలకు నిప్పు పెట్టారు. ఈ నేపథ్యంలో డజనుకు పైగా జిల్లాల్లో 45 గంటలపాటు ఇంటర్నెట్ సేవలను నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. లక్నోలో శుక్రవారం కూడా పలుచోట్ల మొబైల్ సేవలను నిలిపివేశారు. అలీగఢ్ నగరంలో వరుసగా ఐదోరోజు ఇంటర్నెట్ సేవలు బంద్ అయ్యాయి. గత రెండు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు మూడువేల మందిని అరెస్ట్ చేసినట్టు సమాచారం.

- గురువారం రణరంగంగా మారిన కర్ణాటక శుక్రవారం కాస్త కోలుకున్నది. కేరళ నుంచి మంగళూరులోకి ప్రవేశంపై అధికారులు ఆంక్షలు విధించారు. గురువారం నాటి హింస నేపథ్యంలో మంగళూరుతోపాటు దక్షిణ కన్నడ జిల్లాలో 48 గంటలపాటు మొబైల్ సేవలను నిలిపివేశారు. గుర్తింపు కార్డులు లేకుండా నగరంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన 50 మందిని అరెస్ట్ చేశారు. బెంగళూరుతోపాటు పలు ప్రాంతాల్లో ఈ నెల 19 నుంచి 21వరకు ఆంక్షలు విధించడాన్ని ఆ రాష్ట్ర హైకోర్టు తప్పు బట్టింది. మరోవైపు ఉత్తర కేరళలోని నాలుగు జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించారు.
- అసోంలో మొబైల్ సేవలను పునరుద్ధరించారు. నల్బరిలో సీఎం సర్బానంద సోనోవాల్ తన మంత్రివర్గ సహచరులతో కలిసి 'శాంతి పాదయాత్ర' నిర్వహించారు.
- మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఎంఐఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పుణెలో వివిధ సంఘాల నేతృత్వంలో దాదాపు పది వేల మందితో భారీ ప్రదర్శన జరిగింది. నాందేడ్, బీడ్, పర్భని, హింగోలి జిల్లాల్లో ఆందోళనకారులు బస్సులను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో మొత్తం 12 మంది పోలీసులు గాయపడ్డారు. గుజరాత్‌లోని వడోదరలో పోలీసులపైకి రాళ్లు రువ్వారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో హింస చెలరేగగా రెండు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కర్ఫ్యూ విధించారు.

### హోరెత్తిన జామా మసీదు

ఢిల్లీలోని చారిత్రాత్మక జామా మసీదు సీఏఏ వ్యతిరేక ఆందోళనకు వేదికైంది. శుక్రవారం ప్రార్థనలు ముగిసిన అనంతరం వేలాది మంది ముస్లింలు సీఏఏకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. భారీ జాతీయ జెండాను, ప్లకార్డులను ప్రదర్శించారు. వీరికి చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని భీమ్ ఆర్మీ తోడైంది. అంతకుముందు జామా మసీదు నుంచి జంతర్‌మంతర్ వరకు ప్రదర్శన నిర్వహించేందుకు ఆజాద్ అనుమతి కోరగా, పోలీసులు నిరాకరించారు. దీంతో ఆయన తన అనుచరులతో కలిసి మసీదులోనికి వెళ్లారు. ప్రార్థనలు పూర్తికాగానే సీఏఏకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వేల మంది మసీదు నుంచి రోడ్ల మీదికి వచ్చారు. జామా మసీదు, ఓల్డ్ క్వార్టర్స్, ఇండియాగేట్, సెంట్రల్ పార్క్ తదితర ప్రాంతాలన్నీ నిరసనకారులతో నిండిపోయాయి. జామా మసీదు వద్ద అర్ధరాత్రి వరకు నిరసనలు కొనసాగాయి. ఢిల్లీ మెట్రోరైలు సంస్థ దాదాపు 17 స్టేషన్లను మూసివేసింది. ఢిల్లీలోని ఇతర ప్రాంతాల్లోనూ నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఇండియా గేట్ వద్ద జరిగిన ప్రదర్శనలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ పాల్గొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నివాసం వద్ద ఆందోళన చేపట్టిన మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె, ఢిల్లీ మహిళా కాంగ్రెస్ నేత శర్మిష్ఠ ముఖర్జీని పోలీసులు అరెస్ట్ చేశారు.



యూపీలోని మీరట్‌లో తుపాకీని ఎక్కుపెట్టిన పోలీసు.. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో భారీ ప్రదర్శన

## నేను అలా అనలేదు

ఐరాస ఆధ్వర్యంలో రెఫరెండం జరుపాలన్న వ్యాఖ్యపై మమత వివరణ



పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ) అమలు కోసం ఐక్యరాజ్యసమితి నేతృత్వంలో రెఫరెండం నిర్వహించడానికి కేంద్రం సిద్ధమేనా అని తాను అనలేదని, అభిప్రాయ సేకరణ జరుపాలని అన్నానని పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ తెలిపారు. సీఏఏ, ఎన్నార్సీని వ్యతిరేకిస్తున్న ఆమె ఐరాస ఆధ్వర్యంలో రెఫరండం నిర్వహించాలని, ఓడిపోతే కేంద్ర ప్రభుత్వం గద్దె దిగాలని సవాల్ విసినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగడంతో ఆమె స్పందించారు. 'రెఫరండం నిర్వహించాలని నేను అనలేదు. అభిప్రాయ సేకరణ జరుపాలని అన్నాను. అది కూడా దేశానికి చెందిన నిష్పాక్షిక నిపుణులతో నిర్వహించాలని కోరాను. అయితే ఈ ప్రక్రియపై ఐక్యరాజ్యసమితి ఓ కన్ను వేసి ఉంచాలని సూచించాను' అని తెలిపారు.

## మతం పేరిట కేంద్రం వివక్ష: అసదుద్దీన్ ఒవైసీ



మతం ఆధారంగా కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం, దానికి సారథ్యం వహిస్తున్న బీజేపీ వివక్ష ప్రదర్శిస్తున్నాయని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై కేంద్రం గందరగోళం సృష్టిస్తున్నదన్నారు. సీఏఏను అమలు చేసే విషయమై కేంద్రం తీసుకున్న ఏకపక్ష నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళనకారులు ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. సీఏఏకు వ్యతిరేకంగా సాగుతున్న ఆందోళనల్లో హింసకు తావివ్వద్దు. హింస ప్రజ్వరిల్లడంతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిరసన ప్రదర్శనలలో హింసకు దిగుతున్న వారు అసలు లక్ష్యానికి శత్రువులు అని అసదుద్దీన్ అభివర్ణించారు. సీఏఏను కేంద్రం వెనక్కి తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా తాము ఈనెల 21న (శనివారం) హైదరాబాద్ దారుసలాంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.

## ఏ ఎన్నార్సీ.. ఎక్కడి ఎన్నార్సీ: నితీశ్‌కుమార్



ప్రతిపాదిత జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ)ను వ్యతిరేకిస్తున్న రాష్ట్రాల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. తాజాగా బీజేపీ మిత్రపక్షమైన జనతాదళ్ (యూ) ఎన్నార్సీని వ్యతిరేకించింది. ఆ పార్టీ అధ్యక్షుడు, బీహార్ సీఎం నితీశ్‌కుమార్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నార్సీకి మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని చెప్పారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ బిల్లుకు ఆయన మద్దతు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్నార్సీపై అభిప్రాయాన్ని చెప్పాలని విలేకరులు ఆయనను ప్రశ్నించగా.. 'ఏ ఎన్నార్సీ, ఎక్కడి ఎన్నార్సీ.. ఎందుకది.. రాష్ట్రంలో దాన్ని అస్సలు అమలు చేయం' అని స్పష్టం చేశారు.

## పార్టీల యూటర్న్!

**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలు రాజకీయ పార్టీలను ఆలోచనలో పడేశాయా? అంటే.. అవుననే సమాధానం వస్తున్నది. సీఏఏకు మద్దతు ఇచ్చిన పార్టీలు ఇప్పుడు జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ) విషయంలో యూటర్న్ తీసుకుంటున్నాయి. వీటిల్లో బీజేపీ మిత్రపక్షాలు కూడా ఉండటం గమనార్హం. ఇందులో సీఏఏ లేదా ఎన్నార్సీని వ్యతిరేకిస్తున్న పార్టీలు, రాష్ట్రాలు ఏవి అన్న విషయాన్ని ఓ సారి పరిశీలిస్తే

**సీఏఏ లేదా ఎన్నార్సీని వ్యతిరేకించే రాష్ట్రాలు**

పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, బీహార్

**సీఏఏ లేదా ఎన్నార్సీని వ్యతిరేకించే పార్టీలు**

తృణమూల్ కాంగ్రెస్, టీఆర్ఎస్, ఎంఐఎం, శివసేన, వైఎస్ఆర్‌సీపీ, బిజూ జనతాదళ్, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, జనతాదళ్ (యూ), అసోం గణపరిషత్ తదితర పార్టీలు ఉన్నాయి.

**సీఏఏకు మద్దతు ఇచ్చి ఎన్నార్సీతో విభేదిస్తున్న పార్టీలు**

బిజూ జనతాదళ్, వైఎస్ఆర్‌సీపీ, జనతాదళ్ (యూ)

**సీఏఏకు మద్దతుఇచ్చి పునరాలోచనలో పడిన పార్టీలు**

శివసేన, అసోం గణపరిషత్

# జార్ఖండ్‌లో బీజేపీ డౌటే!

- జేఎంఎం-కాంగ్రెస్-ఆర్జేడీ కూటమివైపే ఎగ్జిట్‌పోల్స్ మొగ్గు
- హంగ్ వస్తుందని మరికొన్ని సంస్థల అంచనా
- ప్రశాంతంగా ముగిసిన చివరి విడుత ఎన్నికలు
- 23న ఫలితాల వెల్లడి



జార్ఖండ్‌లోని దుమ్కా నియోజకవర్గ కేంద్రంలో బారులుతీరిన ఓటర్లు

**రాంచీ:** జార్ఖండ్‌లో అధికార బీజేపీకి ఎదురుదెబ్బ తగలనుందా? రాష్ట్రంలో ఆ పార్టీ అధికారం కోల్పోనుందా? అంటే అవుననే అంటున్నాయి ఎగ్జిట్ పోల్స్ అంచనాలు. రాష్ట్రంలో జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం)-కాంగ్రెస్-ఆర్జేడీ కూటమి అధికారంలోకి రానుందని పలు సంస్థలు అంచనావేశాయి. హంగ్ వస్తుందంటూ మరికొన్ని సంస్థలు పేర్కొన్నాయి. 81 అసెంబ్లీ స్థానాలున్న జార్ఖండ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 41 స్థానాలు అవసరం. జార్ఖండ్ చివరి విడుత ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 16 స్థానాలకు ఈ విడుతలో ఎన్నికలు నిర్వహించారు. 71.69 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. జార్ఖండ్ మాజీ సీఎం, జేఎంఎం అధినేత హేమంత్ సొరేన్‌తోపాటు పలువురు కీలక నేతలు ఈ విడుతలో బరిలో ఉన్నారు. దుమ్కా స్థానం నుంచి మంత్రి లూయిస్ మరాండి.. సొరేన్‌పై బరిలో నిలిచారు. గత ఎన్నికల్లో సొరేన్‌పై మరాండి గెలుపొందారు. తాజా ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడనున్నాయి.

**ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు**

**టైమ్స్‌నౌ:** కాంగ్రెస్+ 44, బీజేపీ 28, జేవీఎం 3, ఇతరులు 6.

**ఇండియాటుడే- యాక్సిస్ - మై ఇండియా:** కాంగ్రెస్+ 38-50, బీజేపీ 22-32, ఏజేఎస్‌యూ 3-5, ఇతరులు 6-11.

**ఐఏఎన్ఎస్-సీఓటర్-ఏబీపీ:** కాంగ్రెస్+35, బీజేపీ 32, ఏజేఎస్‌యూ 5, ఇతరులు 9.

**ఆజ్‌తక్:** కాంగ్రెస్+ 38-50, బీజేపీ 22-32, జేవీఎం 2-4, ఏజేఎస్‌యూ 3-5, ఇతరులు 4-7.

**న్యూస్-ఎక్స్ఐ:** జేఎంఎం-17-22, కాంగ్రెస్ 9-12, బీజేపీ 30-35, ఏజేఎస్‌యూ 8-12, జేవీఎం 4-6, ఇతరులు 8-10.

**'టైమ్స్ ఆఫ్ ఇండియా' పోల్ ఆఫ్ పోల్స్:** కాంగ్రెస్+ 41, బీజేపీ29, జేవీఎం 3, ఏజేఎస్‌యూ 3, ఇతరులు 5.

**ఎన్డీటీవీ పోల్ ఆఫ్ పోల్స్:** కాంగ్రెస్+41, బీజేపీ-29.

## జవాన్లకు శాటిలైట్ ఫోన్లు

మారుమూల ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో మాట్లాడే అవకాశం

**న్యూఢిల్లీ:** సమాచార వ్యవస్థలు లేని మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వహించే జవాన్లకు శాటిలైట్ ఫోన్లు అందుబాటులోకి రానున్నాయి. దీంతో వారు కూడా తమ కుటుంబ సభ్యులతో మాట్లాడుకునే అవకాశం కలుగనున్నది. శాటిలైట్ కమ్యూనికేషన్ (వీ శాట్) ఆధారంగా జవాన్లకు ఈ సౌకర్యం కల్పించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం తెలిపింది. మారుమూల ప్రాంతాల్లోని మిలిటరీ, పారామిలిటరీ సిబ్బందికి ఈ వ్యవస్థ ద్వారా రోజుకు ఒక జీబీ డేటాను ఉచితంగా అందిస్తామని, దానితో వారు తమ కుటుంబ సభ్యులతో సంభాషించవచ్చని టెలికాం కార్యదర్శి అన్షు ప్రకాశ్ తెలిపారు. రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొన్న 1409 మారుమూల ప్రాంతాల్లో వీశాట్ వినియోగానికి డిజిటల్ కమ్యూనికేషన్ కమిషన్ (డీసీసీ) శుక్రవారం అంగీకారం తెలిపిందని చెప్పారు. ఈ వ్యవస్థ ద్వారా జవాన్లు చాలా తక్కువ ఖర్చుతో తమ కుటుంబీకులతో మాట్లాడుకోవచ్చని ప్రకాశ్ వివరించారు.

# ఆందోళన వద్దు

### 1987 జూలై 1 కంటే ముందు జన్మించినవారంతా భారతీయులే

ఆ తేదీ కంటే ముందు పుట్టిన తల్లిదండ్రుల పిల్లలు కూడా పౌరులే: కేంద్రం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:** చట్టం ప్రకారం 1987 జూలై 1వ తేదీ కంటే ముందు భారత్‌లో జన్మించిన వారందరూ భారతీయులేనని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. ఆ తేదీ కంటే ముందు జన్మించిన తల్లిదండ్రులకు పుట్టిన పిల్లలు కూడా భారతీయులేనని పేర్కొంది. పౌరసత్వ సవరణ చట్టం గురించి, ప్రతిపాదిత జాతీయ పౌర జాబితా (ఎన్నార్సీ) గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించింది. పౌరసత్వ సవరణ చట్టం-2019పై (సీఏఏ) దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు ఈ మేరకు స్పష్టతనిచ్చారు. అసోం విషయానికి వస్తే, భారత పౌరుల గుర్తింపునకు 1971ని కటాఫ్ తేదీ అని ఆ అధికారి గుర్తు చేశారు. సీఏఏని అసోం ఎన్నార్సీతో పోల్చవద్దని, అసోం కటాఫ్ తేదీ వేరు అని పేర్కొన్నారు.

**2004లో పౌరసత్వ చట్టంలో చేసిన సవరణల ప్రకారం..**

- 1950 జనవరి 26వ తేదీ తర్వాత, 1987 జూలై 1వతేదీ కంటే ముందు లేదా 1987 జూలై 1వ తేదీ తర్వాత, 2004 డిసెంబర్ 3 కంటే ముందు భారత్‌లో జన్మించిన వారు భారత పౌరులే. అయితే వారు జన్మించిన సమయానికి వారి తల్లిదండ్రుల్లో ఒకరు భారత పౌరులై ఉండాలి.
- 1992 డిసెంబర్ 10న లేదా ఆ తర్వాత, 2004 డిసెంబర్ 3 కంటే ముందు ఎవరైనా విదేశాల్లో జన్మించి ఉంటే, వారు పుట్టిన తేదీ నాటికి వారి తల్లిదండ్రుల్లో ఒకరు జన్మతః భారత పౌరులై ఉంటే వారిని కూడా భారతీయులుగా పరిగణిస్తారు.
- 2004 డిసెంబర్ 3 తర్వాత భారత్‌లో జన్మించి, వారి తల్లిదండ్రులు ఇద్దరూ భారత పౌరులై ఉంటే లేదా తల్లిదండ్రుల్లో ఒకరు భారత పౌరుడై ఉండి, మరొకరు అక్రమ వలసదారు కాకపోతే వారిని కూడా భారతీయులుగానే పరిగణిస్తారు.

## ఉత్తరాదిన భూ ప్రకంపనలు

హిందూకుష్ పర్వత శ్రేణుల్లో 6.4 తీవ్రతతో భూకంపం

ఢిల్లీతో పాటు జమ్ముకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానాలో కంపించిన భూమి

**న్యూఢిల్లీ:** ఉత్తర భారతాన్ని భూప్రకంపనలు వణికించాయి. దేశ రాజధాని సహా పలు రాష్ట్రాల్లో శుక్రవారం సాయంత్రం ఈ ప్రకంపనలు నమోదయ్యాయి. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లోని హిందూకుష్ పర్వత శ్రేణుల్లో సంభవించిన భారీ భూకంపం తీవ్రత వల్ల ఉత్తరాదిలోని పలు రాష్ట్రాల్లో వాటి ప్రకంపనలు కనిపించాయి. హిందూకుష్ పర్వత శ్రేణుల్లో భూకంప కేంద్రాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌కు 250 కి.మీ. దూరంలో, 210 కి.మీ. లోతున భూకంప కేంద్రం ఉన్నట్టు తెలిపారు. దాని తీవ్రత 6.4గా నమోదైనట్లు పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో ఉన్న జాతీయ భూకంప పర్యవేక్షణ కేంద్రం వెల్లడించింది. 6.1 తీవ్రతతో భూకంపం వచ్చినట్లు అమెరికా జియాలాజికల్ సర్వే పేర్కొంది. దీంతో ఢిల్లీ, దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధి, చండీగఢ్, మథుర, లక్నో, ప్రయాగ్‌రాజ్, జమ్ముకశ్మీర్, ఫరీద్‌కోట్, చంబా, డెహ్రాడూన్, నోయిడా, ఘజియాబాద్, గురుగావ్ వంటి చాలా ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించింది. హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానాలోని కొన్ని ప్రాంతాల్లో కూడా స్వల్పంగా భూమి కంపించింది. ఉన్నట్టుండి ప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.



## 'మిస్ అమెరికా'గా రసాయన శాస్త్రవేత్త

వేదికపైనే ప్రయోగం చేసి అబ్బురపరిచిన కెమిల్లె ష్రియర్

**వర్జీనియా:** వర్జీనియా యూనివర్సిటీలో జీవరసాయన శాస్త్రంలో డాక్టరేట్ చేస్తున్న 24 ఏండ్ల కెమిల్లె ష్రియర్ 2020 సంవత్సరానికి గాను మిస్ అమెరికా కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. కనెక్టికట్ నగరంలో గురువారం జరిగిన ఈ పోటీల్లో 50 మంది సుందరాంగులను వెనక్కినెట్టి ఆమె ఈ ఘనత సాధించారు. పోటీల్లో భాగంగా వేదికపైనే ఆమె చేసిన ఓ రసాయన ప్రయోగానికి జడ్జిలతో పాటు ఆహుతులు సైతం అబ్బురపడ్డారు. ఈ పురస్కారం ద్వారా ఆమెకు 50వేల అమెరికన్ డాలర్లు లభించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కిరీటాన్ని అందుకున్న తర్వాత కెమిల్లె మాట్లాడుతూ.. ఇకపై తన ప్రయోగాలతో ఇతరుల్ని చైతన్యవంతుల్ని చేయడంలో కృషి చేస్తానన్నారు.

## ఫేస్‌బుక్‌ను వీడని కష్టాలు

26.7 కోట్ల మంది ఖాతాదారుల సమాచారం బహిర్గతం

**న్యూఢిల్లీ:** గతేడాది సామాజిక మాధ్యమ వేదిక 'ఫేస్‌బుక్' కుంభకోణాలు, డేటా తస్కరణ సమస్యల్లో చిక్కుకున్నది. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి కొనసాగుతున్నది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో 4.9 కోట్ల మంది ఇన్‌స్టాగ్రామ్ యూజర్లు, 41.9 కోట్ల మంది ఫేస్‌బుక్ ఖాతాదారుల డేటాబేస్ బహిర్గతమైంది. అందులో తాజాగా 26,71,40,436 మంది ఫేస్‌బుక్ ఖాతాదారుల ఐడీలు, ఫోన్ నంబర్లు, పేర్లు ఆన్‌లైన్‌లో బహిరంగంగా లభ్యమవుతున్నాయని కంపారిటెక్ సంస్థ, భద్రతా పరిశోధకుడు బాబ్ డియాచెంకో సంయుక్తంగా రూపొందించిన నివేదికలో పేర్కొన్నారు. ఎటువంటి పాస్‌వర్డ్, ధ్రువీకరణ లేకుండానే ఇంటర్నెట్ నుంచి ఈ వివరాలు పొందొచ్చునని, దీన్ని స్పామ్ సందేశాలు, చౌర్యపరమైన దాడులకు ఉపయోగించుకునే ప్రమాదం ఉందని చెప్పారు.

## నీటిపారుదల కుంభకోణంలో అజిత్‌పవార్ పాత్రలేదు!

**నాగ్‌పూర్:** నీటిపారుదలకుంభకోణంలో ఎన్సీపీ నేత అజిత్‌పవార్ పాత్రలేదంటూ మహారాష్ట్ర అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) ఉన్నతాధికారి ఒకరు శుక్రవారం బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్‌కి అఫిడవిట్ సమర్పించారు. అవినీతి కేసులో అజిత్ పాత్ర లేదని అందులో స్పష్టం చేశారు. అఫిడవిట్‌పై స్పందించిన బీజేపీ నేత, మాజీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్.. అజిత్‌పవార్‌కు క్లీన్‌చిట్ ఇవ్వడాన్ని తమ పార్టీ తిరస్కరిస్తున్నదని, అందుకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్తామని పేర్కొన్నారు. ఈ కేసులో ప్రజాప్రయోజన వాజ్యం వేసిన పిటిషనర్ మాత్రం కుంభకోణంపై వచ్చిన ఆరోపణలవిషయం లో దర్యాప్తు చేయాలని కోరుతున్నారు.

## భారతీయులకు ఆటంకాలు కల్పించొద్దు

- హెచ్-1బీ వీసా ఆంక్షలపై అమెరికాకు జై శంకర్ విజ్ఞప్తి



**వాషింగ్టన్:** తమ దేశం నుంచి వచ్చే ప్రతిభావంతులకు ఆటంకాలు సృష్టించొద్దని అమెరికాకు భారత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ విజ్ఞప్తి చేశారు. భారతీయ ఐటీ నిపుణుల కోసం జారీ చేసే హెచ్-1బీ వీసాలు రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో భాగమన్నారు. అమెరికా విదేశాంగ, రక్షణశాఖల మంత్రులు మైక్ పాంపియో, మార్క్ ఎస్పర్‌లతో భారత్ రక్షణ, విదేశాంగ మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జైశంకర్ మలి విడుత ముఖాముఖీ (2+2) చర్చల్లో పాల్గొన్నారు. ఈ చర్చలు గురువారం ముగిశాయి. మరోవైపు 370 అధికరణాన్ని రద్దు చేసిన తర్వాత కశ్మీర్ లోయలో ఆంక్షలను ఎత్తేయాలని కోరుతూ అమెరికా కాంగ్రెస్‌లో ప్రమీలా జయపాల్ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఆమె సభ్యురాలిగా ఉన్న ఓ కమిటీతో సమావేశానికి జైశంకర్ నిరాకరించారు.

# మాజీ ఎంపీపీకి మంత్రి కేటీఆర్ చేయూత

- శస్త్రచికిత్సకు రూ.రెండు లక్షల ఎల్‌వోసీ మంజూరు
- హైదరాబాద్‌లోని దవాఖానకు వెళ్లి పరామర్శ



శుక్రవారం హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో గంగ సాయవ్వను పరామర్శిస్తున్న మంత్రి కేటీఆర్

**గంభీరావుపేట:** ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ఎప్పుడూ ముందేఉంటారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మాజీ ఎంపీపీ గంగసాయవ్వ చికిత్సకు చేయూతనిచ్చారు. శస్త్రచికిత్స అనంతరం శుక్రవారం స్వయంగా దవాఖానకు వెళ్లి పరామర్శించారు. వారంకిందట గంభీరావుపేట మాజీ ఎంపీపీ గంగసాయవ్వ కాలికి గాయమైంది. స్థానిక దవాఖానల్లో చూపించుకోగా, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లాలని సూచించారు. ఆమె నాలుగురోజుల కిందట హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చేరగా, పరీక్షించిన వైద్యులు శస్త్రచికిత్స అవసరమని సూచించారు. మెరుగైన వైద్యం కోసం సాయంచేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు.. మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి.. గంగసాయవ్వ శస్త్రచికిత్సకు సీఎమ్మార్‌ఎఫ్ కింద రూ.రెండులక్షల ఎల్‌వోసీ మంజూరుచేశారు. వైద్యులు గురువారం శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. మంత్రి కేటీఆర్ శుక్రవారం దవాఖానకు వెళ్లి సాయవ్వను పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. గాయం నయమయ్యే వరకు వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మంత్రివెంట సిరిసిల్ల జిల్లా టీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి తోట ఆగయ్య, నేతలు రాజారాం, అందె సుభాష్ ఉన్నారు.

## సమత కేసులో డిశ్చార్జి పిటిషన్ కొట్టివేత

సోమవారం నుంచి సాక్షుల విచారణ

**ఆదిలాబాద్, నమస్తేతెలంగాణ ప్రతినిధి:** సమత కేసులో నిందితుల తరఫు న్యాయవాది రహీం దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను ఆదిలాబాద్ ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. ఐదో రోజైన శుక్రవారం ముగ్గురు నిందితులు షేక్‌బాబా, షేక్ షాబొద్దీన్, షేక్ మగ్దూంను పోలీసులు ఆదిలాబాద్ జైలునుంచి ప్రత్యేక కోర్టుకు తీసుకొచ్చారు. నిందితులపై పోలీసులు ఊహాజనితమైన చార్జిషీట్ నమోదు చేశారంటూ వారి తరఫు న్యాయవాది రహీం గురువారం కోర్టులో డిశ్చార్జి పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్‌ను కొట్టివేసేందుకు అవసరమైన సాక్ష్యాలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ రమణారెడ్డి కోర్టుకు సమర్పించారు. శుక్రవారం వీటిని పరిశీలించిన కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. చార్జిషీట్‌లో పోలీసులు 44 మంది సాక్షులను చేర్చారు. ఈనెల 23 నుంచి 31 వరకు ఆరు రోజుల సెలవులను మినహాయించి మిగితా రోజుల్లో సాక్షులను కోర్టు విచారించనున్నది. రోజుకు ఏడునుంచి ఎనిమిదిమందిని విచారించే అవకాశం ఉన్నదని పీపీ తెలిపారు. కేసు విచారణ సోమవారానికి వాయిదా పడగా నిందితులను ఆదిలాబాద్ జైలుకు తరలించారు.

## రేపు కొమురవెల్లి మల్లన్న కల్యాణం

- ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి హరీశ్‌రావు
- హాజరుకానున్న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని



**సిద్దిపేట ప్రతినిధి, నమస్తేతెలంగాణ:** సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. తోట బావి వద్ద నూతనంగా నిర్మించిన కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10.45 గంటలకు స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. స్వామివారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సమర్పించనున్నారు. ఈ వేడుకకు దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మండలి చీఫ్ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు తదితరులు కానున్నారు.

**రెండు రోజులపాటు వేడుకలు**

స్వామివారి కల్యాణోత్సవాన్ని రెండు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈనెల 22న స్వామివారికి దృష్టికుంభం (బలిహరణం), ఉదయం 10.45 గంటలకు స్వామి వారి కల్యాణం, మధ్యాహ్నం ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి శకటోత్సవం (బండ్లు తిరుగుట), 23న ఉదయం ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, అనంతరం మహా మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయి.





స్విచ్ ఆన్ చేసిన సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదలచేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

## ప్రతి నీటిబొట్టు సద్వినియోగం

- విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదల

**నందికొండ:** రాష్ట్రంలో ప్రతి నీటిబొట్టు సద్వినియోగమయ్యేలా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక ప్రణాళికలు చేపడుతున్నారని విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమకాల్వకు యాసంగి పంటల కోసం శుక్రవారం ఆయన నీటిని విడుదల చేశారు. ముందుగా నల్లగొండ, మిర్యాలగూడ, కోదాడ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, బొల్లం మల్లయ్యయాదవ్‌తో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. నీటిని పొదుపుగా వాడుకోవడంలో తెలంగాణ రైతుల్లో చైతన్యం వచ్చిందని చెప్పారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ఆన్ అండ్‌ఆఫ్ పద్ధతిలో వరిని ఆరుతడి పంటగా సాగుచేయడంతో తెగులు రాకుండా పంట దిగుబడి కూడా పెరిగిందన్నారు. నాగార్జునసాగర్ డ్యాంలో పుష్కలంగా నీరు ఉండటంతో యాసంగి సాగుకు కూడా ఇబ్బందిలేదని చెప్పారు. ఎడమకాల్వకు ఏప్రిల్ 2వ తేదీ వరకు ఆరువిడుతలుగా నీటిని విడుదల చేస్తామని ఎన్నెస్పీ సీఈ నర్సింహ తెలిపారు.

# మాంద్యంలోనూ ఆగని సంక్షేమం

- మున్సిపాలిటీ ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్‌దే విజయం
- మంత్రి తన్నీరు హరీశ్‌రావు ధీమా



కోనాయిపల్లి పీబీలో మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

**తూప్రాన్ రూరల్:** దేశంలో ఆర్థికమాంద్యం తలెత్తినప్పటికీ రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఆగడంలేదని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలోని 40 లక్షల ఆసరా పింఛన్ లబ్ధిదారులకు నెలకు రూ.875 కోట్లు, వ్యవసాయరంగానికి ఏడాదికి రూ.12 వేలకోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తున్నదని చెప్పారు. మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్, కలెక్టర్ ధర్మారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, టీఎస్‌ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పన్యాల భూపతిరెడ్డితో కలిసి ఆయన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. పలు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్ స్థానం దక్కించుకోగా, రాష్ట్రంలో గజ్వేల్ మొదటిస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ హయాంలో సమాజంలోని అన్నివర్గాలకు సముచితస్థానం లభిస్తున్నదని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో నిరుపేద ఆడపడుచులకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు దశలవారీగా అమలు జరుగుతున్నాయని తెలిపారు. మల్కాపూర్‌లో ప్రతి కుటుంబానికి పాడిగేదెల పంపిణీ కోసం ప్రొసీడింగ్ కాపీలు అందజేశామని, కోనాయిపల్లి (పీబీ)లో ఆక్సిజన్ పార్క్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో సొంతిండ్లులేని నిరుపేదలు ఉండొద్దని, పూరి గుడిసెలు కనిపించొద్దన్నదే సీఎం కేసీఆర్ అభిమతమని చెప్పారు.

**రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు లేవు**

జెడ్పీ ఎన్నికల్లో 32 జెడ్పీచైర్మన్ స్థానాలను టీఆర్‌ఎస్ కైవసం చేసుకున్నదని, అదే తరహాలో వచ్చే మున్సిపల్ ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తంచేశారు. టీఆర్‌ఎస్ శ్రేణులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పురపాలికల్లో గులాబీ జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలు లేవని, ఉన్నది ఒకేఒక్క టీఆర్‌ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్‌యేనన్నారు. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో సంక్రాంతి తర్వాత టీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాలను ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, గడ ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

## సీఐ, హెడ్‌కానిస్టేబుల్‌పై బదిలీ వేటు

నిందితులకు సహకారం..

**భువనగిరి, నమస్తే తెలంగాణ:** ఓ కేసు విషయంలో నిందితులకు సహకరించినందుకుగాను భువనగిరి రూరల్ సీఐ, బీబీనగర్ హెడ్‌కానిస్టేబుల్‌పై బదిలీ వేటు పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి సమీపంలో ఈనెల 18న తెల్లవారుజామున నిషేధిత పేలుడు పేదార్థాలతో వెళ్తున్న వాహనాన్ని ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. వాహనంతోపాటు తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని భువనగిరి రూరల్ సీఐ సురేందర్‌రెడ్డికి అప్పగించారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుచేయాల్సి ఉండగా, చాకచక్యంగా వ్యవహరించిన రూరల్ సీఐ బీబీనగర్‌లో కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, బీబీనగర్ హెడ్‌కానిస్టేబుల్ కరుణాకర్.. పేలుడు పదార్థాల కేసులో నిందితులుగా ఉన్న తొమ్మిదిమందిలో ప్రధాన నిందితుడితో లోపాయికార ఒప్పందం కుదుర్చుకున్నారు. కేసును తారుమారుచేసే ప్రయత్నంలో భాగంగా నిందితులపై పలు సెక్షన్లను తగ్గించి యాంటిసిపేటరీ బెయిల్ ఇప్పించేందుకు ప్రయత్నాలు చేశారు. ఎస్‌వోటీ, ఇంటెలిజెన్స్ పోలీసులు ఈ విషయాన్ని రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీపీ.. రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ కరుణాకర్‌ను బదిలీచేసి కమిషనరేట్‌కు అటాచ్ చేశారు. దీనిపై పూర్తి విచారణ చేపట్టాలని డీసీపీ నారాయణరెడ్డిని ఆదేశించారు.

## వణికిస్తున్న చలిగాలులు

**హైదరాబాద్ సిటీబ్యూరో/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో తూర్పుదిశ నుంచి వీస్తున్న చలిగాలులతో రాష్ట్రంలో పలుచోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గి చలి పెరుగుతున్నది. పలు జిల్లాలలో రాత్రి ఉష్ణోగ్రతలు 13 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. కామారెడ్డి జిల్లా బీబీపేటలో 11.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, మెదక్ జిల్లా టేక్మాల్‌లో 11.8, కుమ్రంభీం జిల్లా తిర్యానిలో 11.9 డిగ్రీలు, గ్రేటర్ హైదరాబాద్‌లో 16.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. మూడ్రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు.



శాంతినగర్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో మంత్రి నిరంజన్‌రెడ్డి ఉన్నారు

## పురపోరులో గులాబీ జెండా ఎగరాలి

- అలంపూర్‌లో మున్సిపల్ ఎన్నికల శంఖారావం
- హాజరైన మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

**జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో అలంపూర్ నియోజకవర్గంలోని అన్ని మున్సిపాలిటీల్లో టీఆర్‌ఎస్ జెండాను ఎగరవేయాలని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలంలోని శాంతినగర్‌లో ఇద్దరు మంత్రులు మున్సిపల్ ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. శుక్రవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సభలో మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అబ్రహం ఆధ్వర్యంలో అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు అందజేస్తామన్నారు. మెఘా ఫుడ్ పార్క్ ఏర్పాటు విషయంలో కేంద్రంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

**అలంపూర్ నుంచి శ్రీశైలానికి బోటింగ్**

అలంపూర్ నుంచి శ్రీశైలం వరకు బోటింగ్ ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తానని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హామీ ఇచ్చారు. కేంద్రం నుంచి నిధులను తీసుకొచ్చి జోగుళాంబ ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ఆయా కార్యక్రయాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే అబ్రహం, ఢిల్లీలో ప్రభుత్వ అధికార ప్రతినిధి మందజగన్నాథం పాల్గొన్నారు.

## అర్వింద్ రాజీనామా చేయాలి

ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు డిమాండ్



**మెట్‌పల్లి, నమస్తే తెలంగాణ:** పసుపు బోర్డు పేరుతో రైతులను దగాచేసిన ద్రోహి నిజామాబాద్ ఎంపీ అర్వింద్ అని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలోతొక్కి పసుపు, ఎర్రజొన్న రైతులను, ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. శుక్రవారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఆరునెలల కిందట జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఐదు రోజుల్లో పసుపు బోర్డు ఏర్పాటుచేయిస్తానని స్టాంప్ పేపర్ రాసిచ్చిన అర్వింద్.. ఇప్పుడు మాటమార్చడం సిగ్గుచేటన్నారు. కొంతైనా ఇంగిత జ్ఞానం, మానవత్వం ఉంటే ఎంపీ పదవికి రాజీనామాచేయాలని డిమాండ్‌చేశారు.

# జోరుగా ఎత్తిపోతలు

- ఎస్సారార్‌లో 23 టీఎంసీలు నిల్వ
- సరస్వతి బరాజ్‌లో 7.39 టీఎంసీలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని లక్ష్మి పంప్‌హౌస్‌లో నడుస్తున్న మోటర్లు

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2లోని నంది, గాయత్రి పంప్‌హౌస్‌లలో మోటర్లు గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నాయి. శుక్రవారం ఎల్లంపల్లి నుంచి జంట సొరంగాల ద్వారా వచ్చిన నీటిని పెద్దపల్లి ధర్మారం మండలం నందిమేడారంలోని నందిపంప్‌హౌస్‌లో 4, 5, 6వ మోటర్లు ఎత్తిపోశాయి. అక్కడి నుంచి నంది రిజర్వాయర్‌కు చేరగా, జలాశయం గేట్లు ఎత్తడంతో జంటసొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని గాయత్రి పంప్‌హౌస్‌కు చేరుకుంటున్నాయి. ఇక్కడి 1, 6, 7వ పంపులు ఎత్తిపోస్తుండటంతో గ్రావిటీ కాల్వ ద్వారా వరద కాల్వకు చేరుకుంటున్నాయి. ఇక్కడి నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయం వైపు కాళేశ్వర జలాలు పరుగులు తీస్తున్నాయి. ఈనెల 5 నుంచి శుక్రవారం సాయంత్రం వరకు గాయత్రి పంపుహౌస్ నుంచి 9.483 టీఎంసీల నీటిని ఎస్సారార్‌కు తరలించినట్టు అధికారులు తెలిపారు. ఎస్సారార్ పూర్తి సామర్థ్యం 25.873 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.085 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.9,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అంతే మొత్తంలో అవుట్‌ఫ్లో నమోదైంది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మి పంప్‌హౌస్‌లో మూడు మోటర్లను నడిపించి 6,360 క్యూసెక్కుల నీటిని సరస్వతి బరాజ్‌కు తరలించారు. ప్రస్తుతం సరస్వతి బరాజ్‌లో 7.39 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

# పురిట్లోనే చావు!

- బయటకొచ్చిన తల, గర్భిణి కడుపులోనే మొండెం
- సాధారణ ప్రసవం చేస్తుండగా శిశువు మృతి
- నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రభుత్వ దవాఖానలో దారుణం
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బాధితుల ఆందోళన
- సూపరింటెండెంట్, వైద్యురాలి సస్పెన్షన్

**అచ్చంపేట రూరల్ /అచ్చంపేట, నమస్తే తెలంగాణ:** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని ప్రభుత్వ దవాఖానలో దారుణం జరిగింది. పురిట్లోనే శిశువు మరణించింది. సాధారణ ప్రసవం చేస్తుండగా శిశువు తల.. మొండెం నుంచి వేరై బయటకు రాగా, మొండెం గర్భంలోనే ఉండిపోయింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు ఇలా.. అచ్చంపేట మండలం నడింపల్లికి చెందిన స్వాతి ప్రసవం కోసం ఈనెల 18న పట్టణంలోని ప్రభుత్వ సివిల్ దవాఖానలో చేరింది. దవాఖాన సూపరింటెండెంట్ తారాసింగ్, వైద్యులు సిరాజుద్దీన్, సుధారాణి అదేరోజు ఉదయం 11 గంటలకు సాధారణ ప్రసవం చేసేందుకు యత్నించారు. ఆ సమయంలో శిశువు తల బయటకు కనిపించడంతో తలను పట్టుకుని లాగారు. మొండెం కడుపులో ఉండిపోయి కేవలం తల మాత్రమే బయటకు వచ్చింది. గర్భంలోని శిశువు పొట్ట.. నీటితో నిండి ఉన్నదని, శిశువు బయటకు రావడంలేదని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని జజ్జిఖాన దవాఖానకు వెళ్లాలని వైద్యులు సూచించారు. గురువారం జజ్జిఖాన దవాఖానలో స్వాతికి ఆపరేషన్ చేసిన వైద్యులు.. శిశువు మొండెంను బయటకు తీశారు. అచ్చంపేట దవాఖాన వైద్యులు తలను తొలగించినట్టు గానీ, శిశువు చనిపోయినట్టు గానీ తమకు చెప్పలేదని స్వాతి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు చనిపోయిందని ఆరోపిస్తూ శుక్రవారం అచ్చంపేటలోని దవాఖాన వద్ద ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడిన డీఎంహెచ్‌వో సుధాకర్‌లాల్, ఉప వైద్యాధికారి మోహనయ్య.. వైద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు.. అధికారులను ఆదేశించారు.

**ఘటనపై కలెక్టర్ విచారణ**

అచ్చంపేట ప్రభుత్వ దవాఖానలో జరిగిన ఘటనపై శుక్రవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ విచారణ చేపట్టారు. దవాఖానను సందర్శించి వైద్యులు, బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడారు. విచారణ నివేదికను వైద్యారోగ్యశాఖ కమిషనర్, ఉన్నతాధికారులకు పంపించినట్టు తెలిపారు. దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ తారాసింగ్, డ్యూటీ డాక్టర్ సుధాను సస్పెండ్ చేశామని చెప్పారు. దవాఖానకు వచ్చే వారి పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న స్వాతికి మెరుగైన వైద్యం అందించేలా చూస్తామని, అక్కడికి డాక్టర్‌ను కూడా పంపిస్తున్నామని శ్రీధర్ తెలిపారు.



సంగారెడ్డిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో కేంద్ర కమిటీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి. చిత్రంలో నాయకులు మామిండ్ల రాజేందర్, రేచల్ తదితరులు

## పీఆర్సీని ప్రకటించాలి

- టీఎన్జీవో కేంద్ర కమిటీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి
- సంగారెడ్డిలో ప్రీ క్రిస్మస్ వేడుకలు

**సంగారెడ్డిఅర్బన్, నమస్తేతెలంగాణ:** కొంతకాలంగా సర్కార్ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు పీఆర్సీని ప్రకటించాలని టీఎన్జీవోస్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశంతోపాటు ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కారం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషికి పూర్తి వివరాలతో కూడిన వినతిపత్రాన్ని ఇదివరకే అందజేశామన్నారు. ఉద్యోగుల సమస్యలపై 16 డిమాండ్లను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లామని, దీంతో పీఆర్సీ అమలుకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని వేశారని గుర్తుచేశారు. 18 నెలలైనా కమిటీ నివేదిక సమర్పించకపోవడంతో పీఆర్సీ ప్రకటనపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వలేక పోయిందన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ నివేదికను తెప్పించాలని, జాప్యం జరిగితే ఐఆర్‌ను ప్రకటించి ఉద్యోగుల ఎదురుచూపులకు కానుక అందించాలని ఆయన సీఎం కేసీఆర్‌కు విన్నవించారు. సమావేశంలో కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్, రాష్ట్ర నాయకురాలు రేచల్ తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్‌లోని ఐటీ టవర్ పనులను పరిశీలిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

## ఐటీ టవర్‌తో స్థానికులకు ఉపాధి

మంత్రి గంగుల కమలాకర్

**కార్పొరేషన్, నమస్తే తెలంగాణ/ కరీంనగర్ కల్చరల్:** కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఈ నెల 30న ప్రారంభించనున్న ఐటీ టవర్‌లో అత్యధిక శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం ఆయన ఐటీ టవర్ పనులను పరిశీలించారు. స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు, అభివృద్ధి వికేంద్రీకరణ లక్ష్యంతోనే ఐటీశాఖ మంత్రి కేటీఆర్ కరీంనగర్‌కు ఐటీ టవర్‌ను మంజూరుచేశారని చెప్పారు. టవర్ పనులను వేగంగా పూర్తిచేస్తామని తెలిపారు. ఈ టవర్‌ను ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ 30న ప్రారంభించనున్నట్టు గంగుల పేర్కొన్నారు.

## సాగర్ ఎడమకాల్వలో ఫుట్‌బాల్ కోచ్ గల్లంతు



నితీశ్‌రెడ్డి (ఫైల్)

**వేములపల్లి:** సాగర్ ఎడమ కాల్వలో ప్రమాదవశాత్తు జారిపడి ఫుట్‌బాల్ కోచ్ గల్లంతైన ఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం శివారులో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. హైదరాబాద్‌లోని రామంతాపూర్‌కు చెందిన ఫుట్‌బాల్ కోచ్ నితీశ్‌రెడ్డి(24) తన స్నేహితులు తరుణ్, ఉదయ్ కుమార్, శివకుమార్, మణికుమార్ మిర్యాలగూడలో కలుసుకున్నారు. అక్కడి నుంచి వస్తూ శెట్టిపాలెం దగ్గరలో సాగర్ ఎడమకాల్వ బ్రిడ్జి వద్ద కారు నిలిపి కాల్వలోకి దిగారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నితీశ్‌రెడ్డి కాల్వలో జారిపడి గల్లంతయ్యాడు. గాలింపు చేపట్టినా శుక్రవారం కూడా జాడ తెలియరాలేదు.



పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) వ్యతిరేకిస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో ముస్లింలు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి కాంగ్రెస్, వామపక్ష పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం వారు కలెక్టరేట్‌లో జేసీకి వినతిపత్రం సమర్పించారు. - కామారెడ్డి, నమస్తే తెలంగాణ

## ఆటోడ్రైవర్ ఆత్మహత్య

అత్త, ఏఎస్సై వేధింపులే కారణమంటూ సూసైడ్‌నోట్



నిరంజన్ (ఫైల్)

**కంది:** అత్తతోపాటు ఏఎస్సై వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నట్టు ఆటో డ్రైవర్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం సంగారెడ్డిలో చోటుచేసుకున్నది. పట్టణ సీఐ వెంకటేశ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నారాయణరెడ్డి కాలనీకి చెందిన చాకలి నిరంజన్ (29) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి అనురాధతో ప్రేమ వివాహం జరిగింది. గతంలో ఓ చోరీ కేసులో జైలుకు వెళ్లివచ్చాడు. కొంతకాలంగా మళ్లీ పాత స్నేహితులతో తిరుగుతూ తాగుడుకు బానిసై మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని అతడి భార్య అనురాధ గురువారం మధ్యాహ్నం 100 నంబర్‌కు డయల్‌చేసి ఫిర్యాదు చేసింది. దీంతో ఇద్దరిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఈ క్రమంలో శుక్రవారం నిరంజన్ తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అత్త, ఏఎస్సై వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ సూసైడ్‌నోట్ రాయడం కలకలం రేపింది.

## ఏసీబీకి చిక్కిన డిప్యూటీ తాసిల్దార్



డిప్యూటీ తాసిల్దార్ వాజేష్

**పరిగి, నమస్తేతెలంగాణ:** వికారాబాద్ జిల్లా పరిగి డిప్యూటీ తాసిల్దార్ వాజేష్ రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు శుక్రవారం పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పరిగిలోని సర్వే నంబర్ 25లో వార్ల సూర్యకుమారి పేరిట రెండు ఎకరాల భూమి ఉండగా అందులో ఎకరం స్థలంలో రైస్‌మిల్ ఉన్నది. మరో ఎకరం భూమికి సంబంధించి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వడానికి, ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు డిప్యూటీ తాసిల్దార్ వాజేష్ రూ.20వేలు లంచం డిమాండ్ చేయగా సూర్యకుమారి కుమారుడు సతీశ్‌కుమార్ అంగీకరించారు. ఈ మేరకు మొదట రూ.5 వేలు ఇచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం వికారాబాద్ కలెక్టరేట్ ప్రవేశ ద్వారం వద్ద సతీశ్ కుమార్ నుంచి డిప్యూటీ తాసిల్దార్ వాజేష్ రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకొని ఏసీబీ కోర్టులో హాజరుపరుచనున్నట్టు ఏసీబీ డీఎస్పీ సూర్యనారాయణ తెలిపారు.



అండర్-19 ప్రపంచ కప్ టోర్నీ కోసం శుక్రవారం ముంబై నుంచి దక్షిణాఫ్రికాకు బయల్దేరుతున్న భారత యువ జట్టు




# పేదరికాన్ని జయించి..

**ప్రతిభకు పేదరికం అడ్డుకాదనేది మరోమారు తేటతెల్లమైంది. సాధించాలన్న కసికి స్వయంకృషి తోడైతే ప్రపంచాన్ని అయినా జయించవచ్చని నిరూపిత మైంది. లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఎదురైన అవరోధాలను అధిగమిస్తే వచ్చే మజానే వేరు. అవును కష్టాన్నే నమ్ముకున్న కుటుంబాల నుంచి వచ్చిన యశస్వి జైస్వాల్, ప్రియం గార్గ్, కార్తీక్ త్యాగి ఈ కోవలోకే వస్తారు. తమ తల్లిదండ్రుల ఆశలను, ఆకాంక్షలను నిజం చేస్తూ అనతికాలంలోనే దేశం చూపు తిప్పకునే స్థాయి క్రికెటర్లుగా ఎదిగారు. ఇందులో ఒకరు డ్రైవర్ కొడుకైతే, మరొకరు సన్నకారు రైతు కుమారుడు, పొట్టకూటి కోసం ముంబై వీధుల్లో స్వయంగా పానీపూరీలు అమ్మి అష్టకష్టాలు పడ్డ క్రికెటర్ మరొకరు. వీళ్లంతా ఐపీఎల్ పుణ్యమా అని రాత్రికి రాత్రే కోటీశ్వరులయ్యారు. ప్రతిభకు పట్టం కడుతూ యువ ఆటగాళ్లను దక్కించుకునేందుకు ఫ్రాంచైజీలు పోటీపడటంతో ఈ కుర్రాళ్ల జీవితాలు ఒక్కసారిగా మారిపోయాయి. దీని వెనుక ఎన్నో ఏండ్ల కష్టం, కఠోర శ్రమ దాగుంది. దేశ క్రికెట్‌కు దిక్సూచిలా కనిపిస్తున్న వీరు భవిష్యత్తులోనూ మరెన్నో ఘనతలు సాధించాలని మనసారా ఆశిద్దాం.**

యశస్వి జైస్వాల్ (రాజస్థాన్)
రూ. 2.4 కోట్లు

ప్రియం గార్గ్ (హైదరాబాద్)
రూ. 1.9 కోట్లు

కార్తీక్ త్యాగి (రాజస్థాన్ )
రూ. 1.3 కోట్లు

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

యువ క్రికెటర్లు ప్రియం గార్గ్, యశస్వి జైస్వాల్, కార్తీక్ త్యాగి ప్రతిభతో పేదరికాన్ని జయించారు. కఠోర శ్రమతో అంచెలంచెలుగా ఎదుగుతూ 19ఏండ్లు నిండకుండానే కోటీశ్వరులయ్యారు. వచ్చే నెల నుంచి జరిగే అండర్-19 ప్రపంచకప్‌లో సభ్యులైన ముగ్గురూ ఐపీఎల్ వేలంతో ఆర్థికంగా నిలదొక్కుకున్నామన్న అంతులేని ఆనందాన్ని మూటగట్టుకొని శుక్రవారం దక్షిణాఫ్రికాకు బయలుదేరారు. ఆర్థిక స్థోమత సహకరించకున్నా ఎన్నో కష్టాల కోర్చి క్రికెటర్లుగా తీర్చిదిద్దిన తల్లిదండ్రుల కలలను గార్గ్, త్యాగి నిజం చేయగా.. 11ఏండ్లు నిండకుండానే ఇంట్లో నుంచి వచ్చేసి సొంత కష్టంతో అనుకున్నది సాధించిన జైస్వాల్ ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచాడు. ఈ ముగ్గురి సొంత రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్ కావడం మరో విశేషం. ఈ తరుణంలో ముగ్గురు యువ సంచలనాల నేపథ్యంపై **ప్రత్యేక కథనం..**

### పాలు అమ్మి క్రికెటర్‌ను చేశారు

ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లోని ఓ పేద కుటుంబంలో ప్రియంగార్గ్ జన్మించాడు. చిన్నప్పటి నుంచి క్రికెటే ప్రాణంగా భావించిన అతడిని తండ్రి ప్రోత్సహించారు. గార్గ్‌ను క్రికెటర్ చేసేందుకు ఎన్నో రకాల పనులు చేస్తూ చివరికి అనుకున్నది సాధించారు. ఫస్ట్‌క్లాస్ సహా దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ గార్గ్ విశేషంగా రాణించి అండర్-19 ప్రపంచకప్‌లో భారత జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు రూ.1.9కోట్లకు సొంతం చేసుకోవడంతో డబుల్ జోష్‌తో ప్రపంచకప్ ఆడేందుకు పయనమయ్యాడు.

> మా నాన్న అనేక పనులు చేశారు. నన్ను ఏదో ఒకరోజు క్రికెటర్‌ను చేసేందుకు ఇంటింటికీ తిరిగి పాలు అమ్మారు, స్కూల్ వ్యాన్‌కు డ్రైవర్‌గా పని చేశారు. ఎంత కష్టమైనా నన్ను మీరట్‌కు తీసుకెళ్లి, మంచి అకాడమీలో చేర్పించారు.
> - ప్రియం గార్గ్

ప్రస్తుతం ఆరోగ్య శాఖలో ప్రియం గార్గ్ తండ్రి డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. డబ్బు లేని సమయాల్లో ప్రియంగార్గ్ బస్సు టాప్‌పై ఎక్కి తన కలను ఛేదించేందుకు ప్రయాణించేవాడు. తన తండ్రికి సహకరించేందుకు సరిపోయే డబ్బును ఎప్పుడైనా సంపాదించగలనా అని ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు ఎన్నోసార్లు ఆలోచించానని గార్గ్ చెప్పాడు. చివరికి కోటీశ్వరుడయ్యాడు.

### కసితో సాధించాడు..

క్రికెటర్ కావాలన్న తన కల కోసం ఉత్తర్‌ప్రదేశ్‌లోని తన సొంతూరు నుంచి 11ఏండ్ల వయసులో యశస్వి జైస్వాల్ ముంబైకి వచ్చాడు. ఆ తర్వాత పానీపూరి అమ్మడం సహా వివిధ పనులు చేస్తూ జీవనం సాగిస్తూ.. క్రికెట్ ప్రాక్టీస్ చేశాడు. మూడేండ్ల పాటు రోడ్డు పక్కన టెంట్‌లో ఉండి ఎన్నో కష్టాలు పడ్డాడు. కోచ్ జ్వాలా సింగ్ దిశానిర్దేశంలో స్థానిక టోర్నీల్లో సత్తా చాటుతూ దేశవాళీల్లో అద్భుత ప్రదర్శన చేశాడు. విజయ్ హజారే ట్రోఫీలో ద్విశతకంతో తన సత్తాను ప్రపంచానికి తెలిసేలా బ్యాట్‌తో గర్జించాడు. మొత్తానికి ఐపీఎల్ వేలంలో రూ.2.40కోట్లకు రాజస్థాన్ రాయల్స్ సొంతం చేసుకోవడంతో యశస్వి కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కింది. సొంత కష్టంతో 18ఏండ్లు నిండకుండానే అతడు కోటీశ్వరుడయ్యాడు.

> ఏం చెప్పాలో అర్థం కావడం లేదు. ఐపీఎల్ వేలాన్ని ఫోన్‌లో చూశా. ఏదో ఒక జట్టు నన్ను తీసుకోవాలని కోరుకున్నా. ఎంత డబ్బు వస్తుందనే దాని గురించి అస్సలు ఆలోచించలేదు. అది పెద్ద విషయమే కాదు, నాకు ఆటే ముఖ్యం. రాజస్థాన్ రాయల్స్‌లో భాగమైనందుకు సంతోషంగా ఉంది. ఇక డబ్బు విషయం మా కోచ్‌కు వదిలేస్తా.
> - యశస్వి జైస్వాల్

వచ్చే నెల జరిగే అండర్-19 ప్రపంచకప్ కోసం దక్షిణాఫ్రికాకు బయలుదేరే ముందు తన కోచ్ జ్వాలా సింగ్‌ను జైస్వాల్ కలిశాడు.




## రైతు కుటుంబం నుంచి..

కార్తీక్ త్యాగి ఉత్తర్‌ప్రదేశ్‌లోని హాపూడ్‌లో సన్నకారు రైతు కుటుంబంలో జన్మించాడు. తన తండ్రి లక్ష్యం మేరకు చిన్నప్పటి నుంచి క్రికెట్‌లో కఠోర సాధన చేస్తూ అంచెలంచెలుగా ఎదిగాడు. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్ తరపున ఆడుతూ.. అండర్-19 ప్రపంచకప్‌కు ఎంపికయ్యాడు. తనకు గాయమైన సమయంలో తన తండ్రి అప్పు చేసి మరీ చికిత్స చేయించారని త్యాగి గుర్తు చేసుకున్నాడు. వచ్చే సీజన్ ఐపీఎల్ కోసం రాజస్థాన్ రాయల్స్ జట్టు రూ.1.3కోట్లకు దక్కించుకోవడంతో త్యాగి కోటీశ్వరుడయ్యాడు.

> మా నాన్న హాపూర్‌లో సన్నకారు రైతు. నేను క్రికెటర్ కావాలని ఆయన కలలుగన్నారు. మొదట్లో నేను బ్యాట్స్‌మన్ అవ్వాలనుకున్నా.. కానీ నెట్స్‌లో ఎక్కువగా బౌలింగ్ చేయాల్సి రావడం వల్ల బౌలింగ్‌పై ఎక్కువ దృష్టి పెట్టా. చివరికి పేసర్‌నయ్యా. బౌలర్ అయినందుకు సంతోషంగా ఉంది. ఇలా కాకపోయి ఉంటే భారత్‌కు ఆడి ఉండేవాడినో కాదో.. ఎవరికి తెలుసు. గతంలో నాకు అయిన గాయం... ఆర్థికంగా మా కుటుంబాన్ని ఇబ్బందులు పెట్టింది. అప్పులు చేసి మా నాన్న నాకు చికిత్స చేయించారు. ఐపీఎల్ వేలం టీవీలో చూసి చాలా సంతోషించా.
> - కార్తీక్ త్యాగి

# మీరాకు స్వర్ణం



**దోహా:** భారత స్టార్ వెయిట్ లిఫ్టర్ మీరా బాయి చాను అంతర్జాతీయ వేదికపై జోరు కొనసాగిస్తున్నది. ఈ ఏడాది ఇప్పటికే ఒలింపిక్ క్వాలిఫయింగ్ ఈవెంట్‌లలో ఒకటైన 'ఈగట్ కప్'లో స్వర్ణం నెగ్గిన ప్రపంచ మాజీ చాంపియన్ చాను.. శుక్రవారం ఖతార్ ఇంటర్నేషనల్ కప్‌లో పసిడి పతకం సొంతం చేసుకుంది. శుక్రవారం జరిగిన 49 కేజీల విభాగంలో 25 ఏండ్ల చాను 194 కేజీల బరువెత్తి పసిడి పతకం నెగ్గింది. ఫ్రాన్స్‌కు చెందిన అనీస్ మిషెల్ (172 కేజీలు), మానోన్ లొరెన్జ్ (165 కేజీలు) వరుసగా రజత, కాంస్యాలు దక్కించుకున్నారు. ఈ ఏడాది థాయ్‌లాండ్ వేదికగా జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 201 కేజీల బరువెత్తి బెస్ట్ మార్క్ నమోదు చేసిన మీరా బాయి ఈసారి దానికంటే 7 కేజీలు తక్కువే ఎత్తింది. పురుషుల విభాగంలో జెరెమీ లాల్‌రినుంగా (67 కేజీలు) రజతం దక్కించుకున్నాడు. 306 కేజీల (స్నాచ్‌లో 140, క్లీన్ అండ్ జెర్క్‌లో 166 కేజీలు) బరువెత్తిన ఈ యువ సంచలనం రెండో స్థానంలో నిలిచాడు. 2018 నవంబర్ నుంచి 2020 ఏప్రిల్ మధ్య జరిగే మూడు దశల పోటీల్లో కనీసం ఒక్కో దాంట్లో పాల్గొన్న లిఫ్టర్లను మాత్రమే ఒలింపిక్స్ అర్హతకు పరిశీలించనున్నారు.



# సమిత్ ద్రవిడ్ డబుల్ సెంచరీ

**న్యూఢిల్లీ:** మిస్టర్ డిపెండబుల్ రాహుల్ ద్రవిడ్ కుమారుడు సమిత్ ద్రవిడ్ జూనియర్ లెవల్ క్రికెట్‌లో మెరుపులు మెరిపిస్తున్నాడు. అండర్-14 రాష్ట్ర స్థాయి మ్యాచ్‌లో సమిత్ డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. ప్రెసిడెంట్స్ ఎలెవన్ తరపున బరిలో దిగిన సమిత్.. ధర్వాడ్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 256 బంతుల్లో 201 పరుగులు చేశాడు. ఇందులో 22 బౌండ్రీలు ఉన్నాయి. సమిత్ జోరుతో ఈ మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో ద్విశతకంతో ఆకట్టుకున్న సమిత్ రెండో ఇన్నింగ్స్‌లో అజేయంగా 94 పరుగులు చేశాడు. భారత అండర్-19 జట్టును పర్యవేక్షించడంలో రాహుల్ ద్రవిడ్ తలమునకలై ఉంటే.. సమిత్ నింపాదిగా తనపని తాను చేసుకుంటూ వెళ్తున్నాడు. బ్యాటింగ్‌లో మెరుపులే కాకుండా ఈ మ్యాచ్‌లో సమిత్ 3 వికెట్లు కూడా పడగొట్టడం విశేషం.

## రెండు రోజుల్లో సీఏసీ




**కోల్‌కతా :** టీమ్ఇండియా సెలెక్షన్ కమిటీ ఎంపిక కోసం మరో రెండు రోజుల్లో క్రికెట్ సలహాదారుల కమిటీ(సీఏసీ)ని నియమిస్తామని బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ చెప్పాడు. మూడేండ్ల పదవీ కాలం కోసం సెలెక్టర్లను ఎంపిక చేసేందుకే కొత్త సీఏసీ పరిమితమవుతుందని ఓ కార్యక్రమంలో శుక్రవారం వెల్లడించాడు. చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్‌తో పాటు సభ్యుడైన గగన్ కోడా పదవీ కాలం ఇటీవలే ముగిసిన సంగతి తెలిసిందే. మిగిలిన సభ్యులు జతిన్ పరాన్‌జపే, శరణ్‌దీప్ సింగ్, దేవాంగ్ గాంధీ గడువు మరో ఏడాది ఉన్నా వారిని కొనసాగించేందుకు బీసీసీఐ సుముఖంగా లేదని తెలుస్తున్నది.

**ఎన్‌సీఏకు వెళ్లాల్సిందే..**

భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ పరీక్ష జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ)లోనే జరగాలని బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ అన్నాడు. బుమ్రాకు పరీక్ష నిర్వహించేందుకు ఎన్‌సీఏ హెడ్ రాహుల్ ద్రవిడ్ సుముఖంగా లేడన్న వార్తల నేపథ్యంలో దాదా స్పందించాడు. తనకు ఈ విషయం గురించి తెలియదని, కానీ గాయమైన టీమ్ఇండియా ఆటగాళ్లు తప్పకుండా ఎన్‌సీఏకు వెళ్లాల్సిందేనని స్పష్టం చేశాడు.

# కొత్తవాళ్లతో ఖుష్: కోహ్లీ



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 13వ సీజన్ వేలంలో తమ ఫ్రాంచైజీ నాణ్యమైన ఆటగాళ్లను దక్కించుకుందని రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ విరాట్ కోహ్లీ పేర్కొన్నాడు. గురువారం కోల్‌కతాలో జరిగిన వేలంలో బెంగళూరు జట్టు క్రిస్ మోరిస్, ఆరోన్ ఫించ్, కేన్ రిచర్డ్‌సన్, స్టెయిన్, ఉడానాను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కోహ్లీ మాట్లాడుతూ.. 'కొత్త సీజన్ కోసం తీసుకున్న ఆటగాళ్ల పట్ల సంతోషంగా ఉన్నా. అనేక చర్చోపచర్చల అనంతరమే వాళ్లను ఎంపిక చేసుకున్నాం. నిర్భీతిగా ముందుకు సాగేందుకు అనువైన జట్టును సిద్ధం చేసుకున్నాం. ఈ సీజన్‌లో మంచి క్రికెట్ ఆడాలనుకుంటున్నాం' అని చెప్పుకొచ్చాడు. జట్టు సమతూకం కోసమే అంతర్జాతీయ అనుభవం ఉన్న విదేశీ ప్లేయర్‌లను ఎంపిక చేసుకున్నామని ఆర్సీబీ డైరెక్టర్ మైక్ హెసన్ పేర్కొన్నాడు.

# మ్యాక్స్‌వెల్ మెరుపులు




**మెల్‌బోర్న్:** మానసిక ఒత్తిడి కారణంగా క్రికెట్‌కు దూరంగా ఉన్న ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్వ చ్చిరావడంతో సునామీలా విరుచుకుపడ్డాడు. తాజా ఐపీఎల్ వేలంలో రూ. 10.75 కోట్లు దక్కించుకున్న మ్యాక్స్.. బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్)లో అదరగొట్టాడు. లీగ్‌లో మెల్‌బోర్న్ స్టార్స్ తరపున బరిలో దిగిన మ్యాక్స్ (39 బంతుల్లో 83; 7 ఫోర్లు, 5 సిక్సర్లు).. బ్రిస్బేన్ హీట్‌పై తన ధాటి ప్రదర్శించాడు. ఫలితంగా మెల్‌బోర్న్ స్టార్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 167 పరుగులు చేస్తే.. అనంతరం ప్రత్యర్థి నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 145 పరుగులకే పరిమితమైంది. ఐపీఎల్ 13వ సీజన్ వేలంలో మ్యాక్స్‌వెల్ కోసం భారీ ధర వెచ్చించిన కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టు 'మ్యాక్స్ నుంచి అదిరిపోయే ప్రదర్శన. బీబీఎల్‌లో మ్యాక్సీ ఇరగదీస్తున్నాడు' అని ట్విట్టర్‌లో పేర్కొంది. గతంలో 2014 నుంచి 2017 వరకు పంజాబ్ తరపున ఆడిన మ్యాక్స్‌వెల్ 2018 సీజన్‌లో మాత్రం ఢిల్లీ తరపున బరిలో దిగాడు. గతేడాది ఐపీఎల్‌కు దూరంగా ఉన్న మ్యాక్స్‌ను పంజాబ్ తిరిగి చేజిక్కించుకుంది.

# బాలీవుడ్ టు ఐపీఎల్




దిగ్విజయ్ చిన్ననాటి ఫొటో

**ఆరేండ్ల** క్రితం బాలీవుడ్ సినిమా 'కాయ్ పో చ'లో బాల క్రికెటర్‌గా నటించిన దిగ్విజయ్ దేశ్‌ముఖ్.. ఐపీఎల్‌లో వచ్చే ఏడాది ముంబై ఇండియన్స్ తరపున ఆడనున్నాడు. మహారాష్ట్ర తరపున ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఈ ఏడాదే అరంగేట్రం చేసిన ఈ పేసర్ ఆడిన తొలి మ్యాచ్‌లోనే ఆరు వికెట్లతో సత్తాచాటాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలోనూ 9 వికెట్లతో రాణించడంతో ముంబై ఇండియన్స్ రూ.20లక్షలకు దిగ్విజయ్‌ను దక్కించుకుంది. 2013లో విడుదలైన కాయ్ పో చె చిత్రంలో అలీ పాత్రలో దిగ్విజయ్ బ్యాట్ పట్టి కనిపించాడు. ఆ తర్వాత ఆరేండ్లలోనే నిజ జీవితంలో అంతర్జాతీయ ఆటగాళ్లతో కలిసి డ్రెస్సింగ్‌రూమ్‌ను పంచుకునే అవకాశాన్ని దక్కించుకున్నాడు.

# కేరళపై చెన్నై విజయం



**చెన్నై:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో చెన్నైయన్ ఎఫ్‌సీ రెండో విజయాన్ని నమోదు చేసుకుంది. శుక్రవారం ఇక్కడ జరిగిన లీగ్ మ్యాచ్‌లో చెన్నై 3-1తో కేరళ బ్లాస్టర్స్‌పై విజయం సాధించింది. చెన్నై తరపున అంద్రే స్కెంబ్రీ (4వ ని.లో), ఎల్.జడ్. చాంగ్టే (30వ ని.లో), నిరిజుస్ వాస్కిస్ (40వ ని.లో) ఒక్కో గోల్ చేయగా.. కేరళ తరపున బార్తోలోమ్ (15వ ని.లో) ఏకైక గోల్ నమోదు చేశాడు. మ్యాచ్ ఆరంభంలోనే స్కెంబ్రీ గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లిన చెన్నై.. ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పై పదే పదే దాడులు చేయగా.. 15వ నిమిషంలో కేరళ స్కోరు సమం చేసింది. అక్కడి నుంచి దూకుడు పెంచిన చెన్నై మరో రెండు గోల్స్‌తో మ్యాచ్‌నుదక్కిం చుకుంది.

# వారెవ్వా ఏం గోల్!

8 అడుగులు ఎగిరి హెడర్ కొట్టిన రొనాల్డో

**ట్యూరిన్:** 'ఎవడు కొడితే దిమ్మతిరిగి మైండ్ బ్లాంక్ అవుతుందో వాడే పండు గాడు' ఈ తెలుగు సినిమా పాపులర్ డైలాగ్ పోర్చుగల్ సాకర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోకు అతికినట్లు సరిపోతుంది. అవును.. తాను ఆడితే లోకమే చూడదా అన్నట్లు రొనాల్డో ఆటకు మంత్రముగ్ధులు కాని అభిమాని ఉండకపోవచ్చు. అవును .. బరిలోకి దిగాడంటే ప్రత్యర్థికి ముచ్చెమటలు పట్టించడంలో ముందుండే క్రిస్టియానో అద్భుతం చేశాడు. సీరి ఏలో భాగంగా సాంప్‌డోరియా క్లబ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ జువెంటస్ సూపర్ స్ట్రైకర్ కండ్లు చెదిరే గోల్‌తో అందరినీ అవాక్కయేలా చేశాడు. మరో నిమిషంలో అర్ధభాగం ముగుస్తుందనగా సహచర ఆటగాడు అలెక్స్ సాండ్రో అందించిన బంతిని అమాంతంగా 8 ఫీట్ల 5 ఇంచులు (2.56 మీటర్లు) ఎగిరి కనురెప్పపాటులో రొనాల్డో హెడర్ గోల్ కొట్టాడు. గోల్ చేసే క్రమంలో రొనాల్డో 1.5 సెకన్ల పాటు గాల్లోనే ఉండటం విశేషం. క్రిస్టియానో గోల్‌తో జువెంటస్ 2-1 తేడాతో సాంప్‌డోరియాపై గెలిచింది.



# విశ్వక్రీడలకు 89వేల కోట్లు

TOKYO 2020

**టోక్యో :** 2020 ఒలింపిక్స్ నిర్వహణకు 1.35 ట్రిలియన్ యెన్లు (12.6 బిలియన్ డాలర్లు, రూ. 89వేల కోట్లు) ఖర్చవుతుందని నిర్వాహకులు తెలిపారు. టోక్యో విశ్వ క్రీడలకు సంబంధించిన తుది బడ్జెట్‌ను శుక్రవారం విడుదల చేయగా, మారథాన్, రేస్‌వాక్ పోటీలను వేరే ప్రాంతానికి తరలించేందుకు అయ్యే ఖర్చును ఇందులో కలపలేదని వెల్లడించారు. దేశీయ స్పాన్సర్‌షిప్, టికెట్ల అమ్మకాల ద్వారా 30బిలియన్ యెన్ల (రూ.19వేల కోట్లు) ఆదాయం వస్తుందని అంచనా వేశారు. టోక్యోలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో అక్కడి నుంచి సప్పోరో నగరానికి మారథాన్, రేస్‌వాక్ పోటీలను తరలించేందుకు అయ్యే ఖర్చుపై అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం(ఐఓసీ) - టోక్యో నిర్వాహకుల మధ్య చర్చలు సాగుతున్నాయి.

# హైదరాబాద్‌కు రెండో ఓటమి

**పటియాలా:** దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నీ రంజీ ట్రోఫీలో బ్యాట్స్‌మెన్ పేలవ ఫామ్ కొనసాగించడంతో ఈ సీజన్‌లో హైదరాబాద్‌కు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. పంజాబ్‌తో జరిగిన మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 76 పరుగులకే ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో ఫర్వాలేదనిపించిన మనవాళ్లు.. రెండో ఇన్నింగ్స్‌లో పూర్తిగా తడబడ్డారు. సాయిరాం (37), హిమాలయ్ అగర్వాల్ (21) మినహా మిగిలిన వారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఫలితంగా 125 పరుగుల తేడాతో హైదరాబాద్ ఓటమి పాలైంది. ఓవర్‌నైట్ స్కోరు 30/5తో శుక్రవారం చివరి రోజు ఆట కొనసాగించిన హైదరాబాద్.. మరో 20.4 ఓవర్లలో మిగిలిన వికెట్లు కోల్పోయింది. పంజాబ్ బౌలర్లలో మయాంక్ మార్కండే 5 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 242 పరుగులు చేయగా.. పంజాబ్ 443/6 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన విషయం తెలిసిందే. తదుపరి మ్యాచ్‌లో ఈనెల 25 నుంచి ఢిల్లీతో హైదరాబాద్ తలపడనుంది.

**ఆంధ్ర విజయం**

ఒంగోలు వేదికగా జరిగిన ఎలైట్ గ్రూప్ మ్యాచ్‌లో ఢిల్లీపై ఆంధ్ర జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. శశికాంత్ (5/41), స్టీఫెన్ (5/91) ధాటికి ఢిల్లీ రెండో ఇన్నింగ్స్‌లో 169 పరుగులకే ఆలౌటైంది. దీంతో 20 పరుగుల లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది.

# శ్రీలంక 271 ఆలౌట్

**కరాచీ:** పాకిస్థాన్‌తో జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 271 పరుగులకు ఆలౌటైంది. దినేశ్ చండిమాల్ (74) అర్ధశతకం బాదగా.. దిల్‌రువాన్ పెరెరా (48) ఆకట్టుకున్నాడు. పాక్ బౌలర్లలో షాహీన్ షా అఫ్రీది 5, అబ్బాస్ 4 వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాక్ శుక్రవారం ఆట ముగిసే సమయానికి 57/0తో నిలిచింది. చేతిలో 10 వికెట్లు ఉన్న అజహర్ అలీ సేన.. తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 23 పరుగులు వెనుకబడి ఉంది. షాన్ మసూద్ (21), ఆబిద్ అలీ (32) క్రీజులో ఉన్నారు. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 191 పరుగులకు ఆలౌటైన విషయం తెలిసిందే.



# చైర్మన్ పదవికి ఆనంద్ గుడ్‌బై

- భవిష్యత్‌లో నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా సేవలు
- సీఈవోగా గొయెంకాకు అదనపు బాధ్యతలు
- మహీంద్రా గ్రూపు నాయకత్వంలో మార్పులు
- వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:** ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా త్వరలో మహీంద్రా గ్రూపు చైర్మన్ పదవి నుంచి వైదొలగనున్నారు. శుక్రవారం ఆ సంస్థ అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటించింది. భవిష్యత్తులో ఆనంద్ మహీంద్రా తమ సంస్థకు నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా వ్యవహరిస్తారని, ఈ నాయకత్వ మార్పు వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందని మహీంద్రా గ్రూపు వెల్లడించింది. 'మా సంస్థ భవిష్యత్ ప్రణాళికలను దృష్టిలో ఉంచుకొని గవర్నెన్స్, నామినేషన్, రెమ్యునరేషన్ కమిటీ చేసిన సిఫారసుల మేరకు ఆనంద్ మహీంద్రాను ఎగ్జిక్యూటివ్ చైర్మన్ బాధ్యతల నుంచి వైదొలుగుతారు. 2020 ఏప్రిల్ 1 నుంచి ఆయనను నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నియమించాలని నిర్ణయించాం. మార్కెట్ నియంత్రణా సంస్థ సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) మార్గదర్శకాల మేరకు తీసుకొన్న ఈ నిర్ణయాన్ని శుక్రవారం జరిగిన మా కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశం ఆమోదించింది' అని మహీంద్రా గ్రూపు స్టాక్‌ఎక్స్చేంజీలకు తెలియజేసింది. ప్రస్తుతం కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా వ్యవహరిస్తున్న పవన్‌కుమార్ గొయెంకా ఆ బాధ్యతలతోపాటు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా అదనపు బాధ్యతలు చేపడతారని, వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఏడాదిపాటు (2021 ఏప్రిల్ 1 వరకు) ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగుతారని పేర్కొన్నది. ఇదేవిధంగా ప్రస్తుతం తమ గ్రూపులో స్ట్రాటజీ విభాగ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్న అనీష్‌షా వచ్చే ఏప్రిల్ 1 నుంచి 2021 ఏప్రిల్ 1వరకు వీఎస్ పార్థసారథి స్థానంలో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో)గా బాధ్యతలు నిర్వర్తిస్తారని, అంతేకాకుండా అనీష్‌షా 2020 ఏప్రిల్ 1 నుంచి కంపెనీ అదనపు డైరెక్టర్‌గా కూడా వ్యవహరిస్తారని వివరించింది. 2021 ఏప్రిల్ 1 గొయెంకా రిటైర్ అవుతారని, దీంతో ఆ మరుసటి రోజున (2021 ఏప్రిల్ 2న) అనీష్‌షా మహీంద్రా గ్రూపు ఎండీ, సీఈవోగా బాధ్యతలు చేపడుతారని తెలిపింది. సీపీ గుర్నానీని 2020 ఏప్రిల్ 1 నుంచి తమ సంస్థ తదుపరి వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) జరిగే వరకు అదనపు డైరెక్టర్‌గా నియమిస్తామని, ఆయన నాన్-ఎగ్జిక్యూటివ్, నాన్-ఇండిపెండెండ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తారని మహీంద్రా గ్రూపు తెలిపింది.

### విలువలను సంరక్షిస్తా: ఆనంద్

నాయకత్వ మార్పిడి విషయమై మహీంద్రా గ్రూపు తాజాగా తీసుకొన్న నిర్ణయాలు తమ సంస్థలో యాజమాన్య ప్రతిభకు కొదువలేదన్న విషయంతోపాటు విలువలకు, సమర్థతకు భవిష్యత్‌లోనూ పెద్దపీట వేయనున్నట్టు సుస్పష్టం చేస్తున్నాయని ఆనంద్ తెలిపారు. ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పదవి నుంచి వైదొలిగిన తర్వాత సంస్థకు మార్గనిర్దేశకుడిగా కొత్త బాధ్యతలు నిర్వర్తిస్తానని, సంస్థ విలువలకు సంరక్షకుడిగా, వాటాదారుల ప్రయోజనాలకు కాపలాదారుగా కొనసాగుతానని ఆయన చెప్పారు.

### అంచలంచెలుగా ఎదిగిన గొయెంకా

మహీంద్రా వాహనాల్లో అత్యంత విజయవంతమైన 'స్కార్పియో' అభివృద్ధిలో పవన్‌కుమార్ గొయెంకా పాత్ర కీలకమైనది. డెట్రాయిట్ (అమెరికా)లోని జనరల్ మోటర్స్ ఆర్ అండ్‌డీ సెంటర్‌లో పనిచేసిన తర్వాత 1993లో మహీంద్రా అండ్ మహీంద్రాలో ఆర్‌అండ్‌డీ జనరల్ మేనేజర్‌గా చేరిన గొయెంకా అంచెలంచెలుగా ఎదిగి 2016 నవంబర్‌లో ఎంఅండ్ ఎం మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అంతకుముందు ఆయన మహీంద్రా ఆటోమోటివ్ విభాగంలో పలు హోదాల్లో పనిచేశారు. 2003 ఏప్రిల్‌లో ఆటోమోటివ్ సెక్టార్ సీవోవోగా, 2005లో ఆ విభాగం ప్రెసిడెంట్‌గా, 2010 ఏప్రిల్‌లో ఆటోమోటివ్, ఫార్మ్ ఎక్విప్‌మెంట్ విభాగాల (ఏఎఫ్ఎస్) ప్రెసిడెంట్‌గా, 2015 ఏప్రిల్‌లో ఏఎఫ్ఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, గ్రూప్ ప్రెసిడెంట్‌గా గొయెంకా నియమితులయ్యారు.

### ఆనంద్ మహీంద్రా ప్రస్థానమిదీ..

**వ్యవసాయ** పరికరాల తయారీ మొదలుకొని సాఫ్ట్‌వేర్, ఏరోస్పేస్ వరకు అనేకరంగాల్లో సత్తా చాటుకొంటూ దాదాపు 21 బిలియన్ డాలర్ల విలువను కలిగివున్న మహీంద్రా గ్రూపునకు చైర్మన్‌గా ఆనంద్ 2012 ఆగస్టులో బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు సుదీర్ఘంగా 45 ఏండ్లపాటు మహీంద్రా గ్రూపునకు సారథ్యంవహించిన కేషుభ్ మహీంద్రా (ఆనంద్ మహీంద్రా మేనమామ) రిటైర్మెంట్ తర్వాత చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆనంద్ ఆ గ్రూపును మరింత ముందుకు నడిపారు. ఆనంద్ హయాంలో మహీంద్రా గ్రూపు కార్యకలాపాలు దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లలో పలు రంగాలకు విస్తరించాయి. వీటిలో ఆటోమొబైల్స్, అగ్రికల్చర్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), ఏరోస్పేస్ తదితర కీలక రంగాలున్నాయి. అంతేకాకుండా ఆనంద్ హయాంలో మహీంద్రా గ్రూపు దేశ, విదేశాల్లో పలు సంస్థలను కొనుగోలు చేసింది. వీటిలో సాంగ్యాంగ్ మోటర్స్, రేవా ఎలక్ట్రిక్ కార్ కంపెనీ, సత్యం కంప్యూటర్ సర్వీసెస్, ప్యుగోట్ మోటర్‌సైకిల్స్, జిప్సలాండ్ ఏరోనాటిక్స్, ఏరోస్టాఫ్ ఆస్ట్రేలియా, హాలిడే క్లబ్ రిసార్ట్స్, పినిన్ఫారినా స్పా తదితర సంస్థలున్నాయి.

# వృద్ధిరేటుకు ఢోకాలేదు

- మందగమనం నుంచి తేరుకుని పరుగులు పెడుతుంది
- 2024కల్లా 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుతాం
- అసోచామ్ కార్యక్రమంలో దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రధాని మోదీ విశ్వాసం
- భారీగా పెట్టుబడులు పెట్టాలని కార్పొరేట్లకు పిలుపు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:** ప్రస్తుత మందగమనం నుంచి తేరుకుని దేశ ఆర్థిక వ్యవస్థ తిరిగి వృద్ధి బాట పట్టగలదన్న విశ్వాసాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వ్యక్తం చేశారు. జీడీపీ బలోపేతానికి భారీ పెట్టుబడులతో ముందుకు రావాలని కార్పొరేట్లకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఇక్కడ వ్యాపార, పారిశ్రామిక సంఘం అసోచామ్ వందేండ్ల వార్షిక సదస్సు 'నవ భారతం: 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఆశలు'లో మోదీ మాట్లాడుతూ ఆర్థిక లక్ష్యాల సాధనకు ఇప్పటివరకు తీసుకున్న, ఇకపై తీసుకోబోయే నిర్ణయాలను వివరించారు. మౌలిక రంగంలో ఏకంగా రూ.100 లక్షల కోట్ల పెట్టుబడులను సమీప భవిష్యత్తులో పెట్టనున్నామన్న ఆయన.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని మార్చేందుకూ మరో రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులను పెడుతామని చెప్పారు. 2024 నాటికి దేశ జీడీపీ 5 లక్షల కోట్ల డాలర్లకు చేరాలన్న లక్ష్యం నెరవేరడానికి ఇది దోహదపడగలదన్నారు. కార్పొరేట్ నిర్ణయాలపై ఎలాంటి పక్షపాతంతో వ్యవహరించబోమని, దేశ వృద్ధికి ఊతమిచ్చే వాటికి సంపూర్ణ మద్దతిస్తామని స్పష్టం చేశారు. 'ప్రస్తుత ఆర్థిక మందగమనంపై ఎవరేం మాట్లాడుతున్నారో నాకు అర్థమవుతున్నది. అయినా వీటిపై స్పందించదల్చుకోలేదు. జీడీపీని తిరిగి గాడిలో పెట్టడంపైనే దృష్టి నిలిపాను' అన్నారు. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో ఒకానొక త్రైమాసికంలో జీడీపీ 3.4 శాతానికి పతనమైందని, ప్రధాన రిటైల్ ద్రవ్యోల్బణం 9.4 శాతానికి ఎగిసిందని గుర్తుచేశారు. టోకు ద్రవ్యోల్బణం కూడా 5.2 శాతానికి ఎగబాకినట్లు చెప్పారు. జీడీపీలో ద్రవ్యలోటు సైతం 5.6 శాతానికి పెరిగిపోయిందన్నారు. ప్రస్తుత ఒడిదుడుకులు గతంలోనూ ఉన్నాయన్న మోదీ.. ఇప్పుడు నెలకొన్న విపత్కర పరిణామాల నుంచి బయటపడగలమన్న ఆశాభావాన్ని వెలిబుచ్చారు. ఈ క్రమంలో త్వరలోనే అధిక వృద్ధిరేటును అందుకుంటామన్న ధీమాను కనబరిచారు. కాగా, నానాటికీ జీడీపీ దిగజారినప్పుడు కొందరు ఎందుకు మౌనం వహించారన్నదానిపై తాను మాట్లాడదల్చుకోలేదని మోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించడం ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్) నుంచి దేశ వృద్ధిరేటు క్రమేణా క్షీణిస్తుండగా, జులై-సెప్టెంబర్‌లో ఏకంగా ఆరేండ్ల కనిష్ఠాన్ని తాకుతూ 4.5 శాతానికి దిగజారిన విషయం తెలిసిందే. ఇక ప్రపంచ బ్యాంక్ సులభతర వ్యాపార నిర్వహణ ర్యాంకుల్లో 142 నుంచి 63కు చేరామని, కేవలం మూడేండ్లలోనే గొప్ప ప్రగతిని సాధించామని గుర్తుచేశారు. కంపెనీల చట్టంలో మరిన్ని సవరణలు తెస్తామన్న ఆయన నిజాయితీగల కార్పొరేట్లను, వారి పెట్టుబడులను రక్షిస్తామని పేర్కొన్నారు. ఇదిలావుంటే వర్తక, పారిశ్రామిక రంగాల నుంచి వస్తున్న సలహాలు, సూచనలతో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)లో గొప్ప మార్పులు జరుగుతున్నాయన్నారు. ఎలాంటి మార్పులకూ తాము భయపడటం లేదన్న మోదీ.. గత ఐదేండ్లలో భారీ ఎత్తున విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు (ఎఫ్‌డీఐ)లను అందుకున్నామని తెలియజేశారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను భారత్ కలిగి ఉందన్నారు.

### గొప్పలు మానండి: కాంగ్రెస్

దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రధాని మోదీ గొప్పలు చెప్పుకోవడం ఆపితే బాగుంటుందని కాంగ్రెస్ విమర్శించింది. ఇలాంటి అసత్యాలు మాని చర్చకు రావాలని ఆ పార్టీ సీనియర్ అధికార ప్రతినిధి ఆనంద్ శర్మ సవాల్ విసిరారు. ఆర్థిక పరిస్థితులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని, జీడీపీ బలోపేతానికి తక్షణ చర్యలు చేపట్టకపోతే వచ్చే ఏడాది దేశం సంక్షోభంలో పడటం ఖాయమని హెచ్చరించారు. మొద్దు నిద్ర వీడకపోతే ప్రధాని 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ కల స్వప్నంగానే మిగిలిపోతుందన్నారు. ఉద్యోగ, ఉపాధి సృష్టిలో ఈ ప్రభుత్వం విఫలమైందని, ఓవైపు వృద్ధిరేటు పతనం, మరోవైపు విజృంభిస్తున్న ద్రవ్యోల్బణం, ఇంకోవైపు జీఎస్టీ వసూళ్లలో క్షీణత.. అన్నీ ప్రతికూల పరిస్థితులేనని గుర్తుచేశారు.

### అపనమ్మకం వీడాలి: నిర్మల

దేశ ఆర్థిక పరిస్థితులపై వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ఆత్మవిశ్వాసం సన్నగిల్లి, అపనమ్మకం పెరిగిపోతున్నదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రకమైన పరిణామం ఎంత మాత్రం మంచిదికాదని హితవు పలికారు. అసోచామ్ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ 'మీకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను. దయచేసి మేము చేయగలమా?.. భారత్ సాధించగలదా?.. అన్న అనుమానాల్ని వీడండి. అసలు ఎందుకీ అపనమ్మకం. దీన్నుంచి బయటకు రండి' అన్నారు. దేశ స్థూల ఆర్థిక మూలాలు చాలా బలంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందని చెప్పారు. దేశంలో విదేశీ మారకద్రవ్య నిల్వలు రికార్డు స్థాయిలో ఉన్నాయని, ప్రభుత్వ రంగ బ్యాంకులు పటిష్ఠమయ్యాయని తెలిపారు.



## మరో కొత్త స్థాయికి స్టాక్ మార్కెట్లు

41,682 వద్ద సెన్సెక్స్, 12,272 వద్ద నిఫ్టీ

**ముంబై, డిసెంబర్ 20:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం మరో సరికొత్త స్థాయికి చేరాయి. వృద్ధిరేటు భయాల మధ్య కొనుగోళ్లకు మదుపరులు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో సూచీలు స్వల్ప లాభాలకే పరిమితమైయ్యాయి. అయినప్పటికీ నూతన శిఖరాలను అధిరోహించాయి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్‌ఈ) సూచీ సెన్సెక్స్ 7.62 పాయింట్లు పెరిగి 41,681.54 వద్ద ముగియగా, నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 12.10 పాయింట్లు అందుకుని 12,271.80 వద్ద నిలిచింది. ఫలితంగా వరుసగా నాలుగోరోజు మార్కెట్లు లాభాలను అందుకున్నట్లైంది. ఒకానొక దశలో సెన్సెక్స్ 41,809.96 పాయింట్లను, నిఫ్టీ 12,293.90 పాయింట్లను తాకాయి. అయితే మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో స్వల్ప లాభాలే దక్కాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) జీడీపీ అంచనాల్ని ఫిచ్ రేటింగ్స్ తగ్గించడం ట్రేడింగ్‌ను ప్రభావితం చేసింది. కాగా, ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 671.83 పాయింట్లు, నిఫ్టీ 185.10 పాయింట్లు లాభపడ్డాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో టాటా స్టీల్ షేర్ విలువ అత్యధికంగా 3.23 శాతం పెరుగగా, వేదాంత షేర్ విలువ గరిష్ఠంగా 3.45 శాతం నష్టపోయింది. అంతర్జాతీయంగా ఆసియా మార్కెట్లలో హాంకాంగ్, దక్షిణ కొరియా సూచీలు లాభాల్లో, చైనా, జపాన్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఐరోపా సూచీలు మాత్రం లాభాల్లో కదలాడుతున్నాయి.

## లెన్స్‌కార్ట్‌కు సాఫ్ట్‌బ్యాంక్ నిధులు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:** సాఫ్ట్‌బ్యాంక్ విజన్ ఫండ్ నుంచి కంటి అద్దాల విక్రయ సంస్థ లెన్స్‌కార్ట్ భారీ ఎత్తున నిధులను సమీకరిస్తున్నది. సుమారు రూ.1,956 కోట్లు (275 మిలియన్ డాలర్లకుపైగా) సేకరిస్తున్నట్లు శుక్రవారం లెన్స్‌కార్ట్ తెలిపింది. ఈ నిధులను సంస్థ టెక్నాలజీ అవసరాలకు, పంపిణీ, రిటైల్ వ్యవస్థల బలోపేతానికి వినియోగిస్తామని లెన్స్‌కార్ట్ వ్యవస్థాపక సీఈవో పీయూష్ బన్సల్ తెలిపారు. ఈ లావాదేవీకి అవెండస్ క్యాపిటల్ ప్రధాన ఆర్థిక సలహాదారుగా వ్యవహరిస్తున్నది. 2010లో లెన్స్‌కార్ట్‌ను స్థాపించారు. దేశవ్యాప్తంగా 100కుపైగా నగరాల్లో 500లకుపైగా రిటైల్ స్టోర్లను లెన్స్‌కార్ట్ నిర్వహిస్తున్నది. లెన్స్‌కార్ట్‌లో రతన్ టాటా, ప్రేమ్‌జీఇన్వెస్ట్, ఐఎఫ్‌సీ (ప్రపంచ బ్యాంక్ అనుబంధ క్యాపిటల్ వెంచర్), టీపీజీ గ్రోత్, ఐడీజీ వెంచర్స్, యునిలేజర్ వెంచర్స్, అడ్వెక్ సంస్థలు పెట్టుబడులున్నాయి.

# అమ్మకానికి రూ.5.23 లక్షల కోట్ల స్పెక్ట్రం

మార్చి-ఏప్రిల్‌లో 8300 మెగాహెర్ట్జ వేలం.. డీసీసీ ఆమోదం..5జీ సర్వీసులకే 6050 మెగాహెర్ట్జ




**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:** టెలికం శాఖ దేశవ్యాప్తంగా 22 సర్కిళ్లలో 8300 మెగాహెర్ట్జ స్పెక్ట్రంను వేలం వేసేందుకు సిద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించి దాదాపు రూ.5.23 లక్షలకోట్లతో రూపొందించిన ప్రణాళికను టెలికం విభాగంలోని అత్యున్నత విధాన నిర్ణాయక సంస్థ అయిన డిజిటల్ కమ్యూనికేషన్స్ కమిషన్ (డీసీసీ) శుక్రవారం ఆమోదించింది. దీంతో వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్‌లో స్పెక్ట్రం వేలం జరిగే అవకాశాలున్నాయి. టెలికం నియంత్రణ సంస్థ 'ట్రాయ్' (టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) సిఫారసులను డీసీసీ శుక్రవారం ఆమోదించిందని, వచ్చే మార్చి-ఏప్రిల్‌లో స్పెక్ట్రం వేలాన్ని నిర్వహించాలని భావిస్తున్నామని, ఇందులో 6050 మెగాహెర్ట్జ స్పెక్ట్రంను 5జీ (ఐదోతరం టెలికం) సర్వీసులకు కేటాయించనున్నామని టెలికంశాఖ కార్యదర్శి అన్షుప్రకాశ్ ఢిల్లీలో విలేకర్లకు తెలిపారు. దేశవ్యాప్తంగా 22 సర్కిళ్లలో 8300 మెగాహెర్డ్జకుపైగా స్పెక్ట్రంను వేలం వేసేందుకు రూ.5,22,850 కోట్ల రిజర్వు ధరను నిర్ణయించినట్టు ఆయన చెప్పారు. ట్రాయ్ తొలుత రూ.4.9 లక్షలకోట్ల విలువైన రేడియో తరంగాల వేలానికి సిఫారసు చేసింది. అయితే ఎనిమిది సర్కిళ్లలో రిలయన్స్ కమ్యూనికేషన్స్, భారతీ ఎయిర్‌టెల్ లైసెన్సులు, మరో నాలుగేసి సర్కిళ్లలో వొడాఫోన్, ఐడియా సెల్యులర్ లైసెన్సులు ముగిసిన తర్వాత వచ్చే అదనపు స్పెక్ట్రంను కూడా టెలికం విభాగం వేలంలో చేర్చింది. ఈ వేలంలో విజయవంతమయ్యే బిడ్డర్లు తొలుత 1 గిగాహెర్ట్జలోపు ఫ్రీక్వెన్సీ బ్యాండ్లకు 25 శాతం మొత్తాన్ని, హైఫ్రీక్వెన్సీ బ్యాండ్లకు 50 శాతం మొత్తాన్ని చెల్లించి, మిగిలిన మొత్తాన్ని 16 ఏండ్ల వ్యవధిలో కిస్తీలుగా చెల్లించాల్సి ఉంటుంది. కిస్తీల చెల్లింపునకు ముందు రెండేండ్లు మారటోరియం ఉంటుంది. అంటే బిడ్‌ను దక్కించుకొన్న తర్వాత మూడో ఏడాది నుంచి 16 వార్షిక కిస్తీల్లో మిగిలిన మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

## జీడీపీ అంచనాల్ని తగ్గించిన ఫిచ్

**ఈసారి 4.6 శాతం దాటకపోవచ్చని వెల్లడి**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను దేశ జీడీపీ అంచనాను గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ తగ్గించింది. ఈసారి 4.6 శాతంగానే ఉండొచ్చని చెప్పింది. ఇంతకుముందు 5.6 శాతంగా నమోదు కావచ్చన్న ఫిచ్.. ఇప్పుడు ఏకంగా 1 శాతం కోత పెట్టింది. పడిపోయిన వినియోగదారుల కొనుగోళ్ల సామర్థ్యం, వ్యాపారంలో మందగమనం, దిగజారిన పారిశ్రామికోత్పత్తి, పెచ్చుమీరుతున్న ద్రవ్యోల్బణం, వరుస త్రైమాసికాల్లో క్షీణిస్తున్న వృద్ధిరేటుల దృష్ట్యా ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ 4.6 శాతాన్ని మించబోదని అభిప్రాయపడింది. కాగా, భారత క్రెడిట్ రేటింగ్‌ను 'బీబీబీ'గా స్థిరమైన ఔట్‌లుక్‌తో ఉంచిన ఫిచ్.. అందుకు కారణం బలమైన విదేశీ మారకద్రవ్య నిల్వలేనని పేర్కొన్నది. అయితే జీడీపీ అంచనాల విషయంలో మాత్రం ఆ స్థాయి భరోసా కనిపించకపోవడంతో కోతలు తప్పలేదు. కాగా, ఇప్పటిదాకా వచ్చిన అంచనాల్లో ఫిచ్ అంచనానే తక్కువ కావడం గమనార్హం. మరో గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ అంచనా 4.9 శాతంగా ఉండగా, ఆసియా అభివృద్ధి బ్యాంక్ అంచనా 5.1 శాతంగా ఉన్నది. ఇక రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అంచనా 5 శాతంగా ఉన్నది. ఇంతకుముందు 6.1 శాతంగా ఉండటం గమనార్హం.




శుక్రవారం తిరుపతిలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అమరరాజా పవర్ సిస్టమ్స్ అధిపతి విక్రమాదిత్య గౌరినేని (ఎడమ), ష్నీడర్ ఎలక్ట్రిక్ ఇండియా అధ్యక్షుడు అనిల్ చౌధరి.

## ష్నీడర్‌తో అమరరాజా దోస్తీ

**ప్రీఫ్యాబ్రికేటెడ్ సబ్ స్టేషన్ల తయారీ, అమ్మకాల కోసం ఒప్పందం**

**తిరుపతి, డిసెంబర్ 20:** అమరరాజా గ్రూప్‌నకు చెందిన అమరరాజా పవర్ సిస్టమ్స్.. ష్నీడర్ ఎలక్ట్రిక్ ఇండియాతో చేతులు కలిపింది. ఇరు సంస్థల భాగస్వామ్యంలో ప్రీఫ్యాబ్రికేటెడ్ సబ్‌స్టేషన్లు తయారు కానున్నాయి. ఈ మేరకు శుక్రవారం రెండు కంపెనీల మధ్య ఇక్కడ ఎంవోయూ కుదిరింది. ఈ ప్యాకేజ్ సబ్‌స్టేషన్ సొల్యూషన్‌తో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఈ సందర్భంగా అమరరాజా పవర్ సిస్టమ్స్ ఎండీ, సీఈవో విక్రమాదిత్య గౌరినేని విలేకరులతో మట్లాడుతూ తెలిపారు. ఈ టెక్నాలజీతో ఖర్చు సైతం భారీగా తగ్గిపోతుందన్నారు. ప్రత్యేక నిర్మాణాలు, కేబుల్ ఏర్పాటు అవసరం లేదని వెల్లడించారు. కాగా, తొలుత ఐదు దక్షిణాది రాష్ర్టాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ ప్యాకేజ్డ్ సబ్‌స్టేషన్ల అమ్మకాలను ప్రారంభిస్తామని చెప్పారు. ఆ తర్వాత దశలవారీగా మిగతా రాష్ర్టాలకు, ఇతర ప్రాంతాలకు విస్తరిస్తామని స్పష్టం చేశారు. 'తుపాను ప్రభావిత తీర ప్రాంత జిల్లాల్లో ఈ ప్రీఫ్యాబ్రికేటెడ్ సబ్‌స్టేషన్లు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయి. నిలిచిపోయిన విద్యుత్ సేవల పునరుద్ధరణకు దోహదపడుతాయి. భూమి లోపల ఏర్పాటు చేసిన కేబుల్స్ ద్వారా పనిచేసే ఈ సబ్‌స్టేషన్లతో వేగంగా విద్యుత్ సేవల పునరుద్ధరించబడుతాయని వివరించారు. మొదట 300ల నుంచి 400ల యూనిట్లను అమ్మాలని చూస్తున్నామని, నివాస సముదాయాలు, ఆస్పత్రులు, హోటళ్లకు సరఫరా చేయాలని భావిస్తున్నామని తెలియజేశారు. ఈ ఒప్పందంతో దక్షిణాది రాష్ర్టాలకు తమ సంస్థ విస్తరించిందని ష్నీడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఎండీ అనిల్ చౌధరి అన్నారు. ప్రపంచవ్యాప్తంగా లక్షకుపైగా ప్యాకేజ్ సబ్‌స్టేషన్లను ష్నీడర్ ఏర్పాటు చేసిందని తెలిపారు. మైక్రో గ్రిడ్, ఎనర్జీ స్టోరేజీల్లో పరస్పర సహకారానికి ఇరు సంస్థల మధ్య ఎంవోయూలు కుదిరాయి.

# జీఎస్టీని సరళీకరించాలి

- ప్రత్యక్ష పన్నుల చట్టాన్ని అమలుచేయాలి
- చిన్నమొత్తాల పొదుపు వడ్డీరేట్లను సంస్కరించాలి
- విధాన సమస్యలను త్వరగా పరిష్కరించాలి
- కేంద్రానికి ఆర్థికవేత్తల విజ్ఞప్తి



శుక్రవారం న్యూఢిల్లీలో ఆర్థికవేత్తలతో సమావేశమైన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:** వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను సరళతరం చేయాలని, చిన్నమొత్తాల పొదుపు వడ్డీరేట్లను సంస్కరించాలని, ప్రత్యక్ష పన్నుల చట్టాన్ని అమలుచేయాలని ఆర్థికవేత్తలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం వారు ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలుసుకొని సార్వత్రిక బడ్జెట్‌లో పొందుపర్చాల్సిన అంశాలపై పలు విజ్ఞప్తులు చేశారు. దేశ ఆర్థిక వృద్ధిరేటుకు ఊతమిచ్చేందుకు మరిన్ని పెట్టుబడులను ఆకర్షించాలని, విధానపరమైన అంశాలను క్రమబద్ధీకరించాలని, అన్ని రంగాల్లో విధానపరమైన సమస్యలు త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలని, విద్యుత్‌రంగంలో సంస్కరణలు తీసుకొచ్చి ఆర్థిక క్రమశిక్షణను పెంపొందించాలని సూచించారు. ముమ్ముందు స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు కోలుకుంటుందని వారు ఆశాభావాన్ని వ్యక్తంచేస్తూ.. దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణాన్ని 5 ట్రిలియన్ డాలర్లకు పెంచాలన్న లక్ష్యాన్ని సాధించేందుకున్న మార్గాలను నిర్మలా సీతారామన్‌కు వివరించారు. కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్, ఆ శాఖ కార్యదర్శి రాజీవ్‌కుమార్, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అతను చక్రవర్తి, రెవెన్యూశాఖ కార్యదర్శి అజయ్‌భూషణ్ పాండే, కేంద్ర ఆర్థికశాఖ మాజీ ప్రధాన సలహాదారు అర్విండ్ వీర్‌మణి, ఎన్ఐఎఫ్‌పీ డైరెక్టర్ రతిన్‌రాయ్, ఎన్సీఏఈఆర్ డైరెక్టర్ జనరల్ శేఖర్‌షా, ఆక్సస్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ఎండీ సూర్జిత్ ఎస్ భల్లా, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనమిక్ గ్రోత్ డైరెక్టర్ అజిత్ మిశ్రా, ఆర్ఐఎస్ డైరెక్టర్ జనరల్ సచిన్ చతుర్వేది తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

### లెవీలను తగ్గించాలి: సీవోఏఐ

తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న దేశీయ టెలికం రంగాన్ని ఆదుకోవాలని సీవోఏఐ (సెల్యులర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ప్రతినిధులు కేంద్రాన్ని కోరారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు ఏజీఆర్ (సర్దుబాటుచేసిన స్థూల ఆదాయం) విషయాన్ని ప్రస్తావిస్తూ.. ప్రస్తుతం 8 శాతంగా ఉన్న లైసెన్సు ఫీజును 3 శాతానికి, స్పెక్ట్రమ్ వినిమయ చార్జీలను 5 శాతం నుంచి 1 శాతానికి తగ్గించాలని విజ్ఞప్తిచేశారు. ట్యాక్స్ ఫ్రీ (పన్నురహిత) బాండ్ల సమీకరణకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బ్యాంక్‌ను ఏర్పాటుచేయాలని నిర్మలా సీతారామన్‌ను కోరినట్టు సీవోఏఐ డైరెక్టర్ జనరల్ రాజన్ మాథ్యూస్ తెలిపారు. ఏజీఆర్‌పై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం టెలికం కంపెనీలు కేంద్రానికి అదనంగా రూ.1.47 లక్షలకోట్ల బకాయిలు (లైసెన్సు ఫీజు బకాయిల కింద రూ.92,642 కోట్లు, స్పెక్ట్రమ్ వినిమయ చార్జీల కింద మరో రూ.55,054 కోట్ల బకాయిలు) చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో సీవోఏఐ ఈ విజ్ఞప్తులు చేయడం ప్రాధాన్యాన్ని సంతరించుకొన్నది.

### సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తిదారులకు ఊతమివ్వాలి..

**దేశంలో** సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు నిర్దిష్ట విధానాన్ని తీసుకురావాలని, పర్యావరణహితమైన విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సుముఖంగా ఉన్నవారిని సబ్సిడీ, ట్రాన్స్‌మిషన్ చార్జీల నుంచి మినహాయించాలని మౌలికవసతుల రంగానికి చెందిన ప్రతినిధులు కేంద్రాన్ని కోరారు. సార్వత్రిక బడ్జెట్‌కు ముందస్తుగా శుక్రవారం నిర్మలా సీతారామన్ జరిపిన సంప్రదింపుల్లో వారు ఈ అంశాలను ప్రస్తావించారు. రియల్ ఎస్టేట్ రంగానికి రుణాలు అందుబాటులో ఉంచడంతోపాటు చౌకధర ఇండ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించి సిమెంట్, స్టీల్ లాంటి ఉత్పత్తుల వినిమయాన్ని పెంపొందించాలని సూచించారు. మౌలికవసతుల రంగాలకు కేటాయించి ఆపేసిన నిధులను ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా విడుదలచేస్తే దేశ ఆర్థిక వ్యవస్థ ఊపందుకొంటుందని వారు అభిప్రాయపడ్డారు.

## ఎయిర్ ఇండియాకు ఊరట

ప్రభుత్వం నుంచి రూ.500 కోట్ల పూచీకత్తు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:** ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాకు ఊరట లభించింది. నిధుల సమీకరణకు బాసటగా కేంద్ర ప్రభుత్వం రూ.500 కోట్ల పూచీకత్తును ఇచ్చింది. పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన ఎయిర్ ఇండియా.. నిర్వహణపరమైన కార్యకలాపాల కోసం నానా తంటాలు పడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే నిధుల సమీకరణకు సిద్ధమైన సంస్థ.. రూ.2,400 కోట్ల పూచీకత్తును మోదీ సర్కారు నుంచి కోరింది. అయితే రూ.500 కోట్లకు అంగీకరించింది. ఎయిర్ ఇండియా రుణ భారం రూ.58 వేల కోట్లుగా ఉన్న సంగతి విదితమే. దీన్ని అమ్మేసేందుకు కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తున్నదీ తెలిసిందే. అయితే ఎవరూ కొనేందుకు ముందుకు రావడం లేదు. మరోవైపు సంస్థలోని పలు ఉద్యోగ సంఘాలు ఎయిర్ ఇండియా రుణాలను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. మరోవైపు వచ్చేనెల ఎయిర్ ఇండియా వాటా విక్రయానికి బిడ్లను ప్రభుత్వం ఆహ్వానించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీపీసీఎల్ వాటా విక్రయానికీ వీలున్నది.

## అందరూ మాట్లాడొచ్చు

- అన్నీ వింటాం
- రాహుల్ బజాజ్ వ్యాఖ్యలపై గోయల్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:** ప్రతీ ఒక్కరు మాట్లాడవచ్చని, అందరి మాటల్నీ వింటామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు అంతా భయపడుతున్నారని, ఎవరూ ధైర్యంగా మాట్లాడే పరిస్థితుల్లేవని ప్రముఖ పారిశ్రామికవేత్త రాహుల్ బజాజ్ చేసిన వ్యాఖ్యలపై గోయల్ పైవిధంగా స్పందించారు. శుక్రవారం ఇక్కడ అసోచామ్ నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆయన 'సోదరుడు రాహుల్ ఏ ఉద్దేశంతో అన్నప్పటికీ.. మాట్లాడే హక్కు అందరికీ ఉన్నది. మాట్లాడండి.. మా ప్రభుత్వం వింటుంది' అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ దారుణంగా ఉన్నప్పటికీ ప్రభుత్వ చర్యలు ప్రభావవంతంగా లేవని రాహుల్ విమర్శించినది తెలిసిందే.

# మొక్కలు భగవంతుని స్వరూపాలు

## గ్రీన్‌చాలెంజ్‌లో బహ్మశ్రీ చాగంటి



గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో మొక్క నాటుతున్న బహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు. చిత్రంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/కవాడిగూడ:** రాజ్యసభసభ్యుడు సంతోష్‌కుమార్ ప్రారంభించిన గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా బహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. భగవంతుడే చెట్టు రూపంలో ఈ భూమిపై ఉంటాడని వేదం చెప్తున్నదన్నారు. చెట్లు ఎంతకాలం బాగుంటాయో, చెట్లు ఎంతకాలం వృద్ధిలో ఉంటాయో అంతకాలం సమస్త ప్రాణకోటి ఎంతో సంతోషంగా ఉంటుందని చెప్పారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ పేరిట తోటివారితో మూడు మొక్కలు నాటించడం గొప్ప విషయమన్నారు. ఈ మొక్కలు ఎదిగి కొన్ని కోట్ల పక్షులకు ఇతర జీవరాశులకు ఆవాసాలుగా మారుతాయని చెప్పారు. మొక్కలు నాటడం జాతీయ సమైక్యతకు స్ఫూర్తి అన్నారు. ఇంత గొప్ప కార్యక్రమానికి ఆ భగవంతుడి అనుగ్రహం ఉండాలని ప్రార్థిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాష్ట్ర వన్య ప్రాణి సంరక్షణ బోర్డు సభ్యుడు రాఘవ, గ్రీన్‌చాలెంజ్ ప్రతినిధి కిశోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు



గ్రీన్‌చాలెంజ్‌లో భాగంగా క్యాంపు కార్యాలయంలో మొక్క నాటుతున్న వరంగల్ రూరల్ జేసీ మహేందర్‌రెడ్డి

# వైభవంగా అతిరుద్ర యాగం

- కన్నులపండువగా లక్ష్మీనారాయణస్వామి కల్యాణం
- హాజరైన మంత్రి సత్యవతి రాథోడ్, చీఫ్‌విప్ దాస్యం





హన్మకొండలోని హయగ్రీవాచారి మైదానంలో శుక్రవారం వైభవంగా నిర్వహిస్తున్న అతిరుద్ర యాగం. (ఇన్‌సెట్) లక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

**వరంగల్ రెడ్డికాలనీ:** వరంగల్ నగరం హన్మకొండలోని హయగ్రీవాచారి మైదానంలో అతిరుద్ర యాగం వైభవంగా జరుగుతున్నది. యాగంలో భాగంగా ఆరోరోజు శుక్రవారం వేదపండితులు లక్ష్మీనారాయణస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అతిరుద్ర పునశ్చరణ, లక్ష్మీనారాయణ హృదయ పారాయణం, సుదర్శన జపం, చతుర్వేదహోమాలు, శతచండీ యాగ పూర్ణాహుతి, సూర్యనమస్కారాలు నిర్వహించారు. తాడిపల్లి శ్రీనివాస్– రోజారాణి దంపతులతో వేదపండితులు అతిరుద్ర యాగాన్ని నిర్వహిస్తున్నారు. అనంతరం వేయిస్తంభాల దేవాలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ, ఇతర అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్– రేవతి దంపతులు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, రూరల్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు దంపతులు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, వరంగల్ సీపీ విశ్వనాథ రవీందర్ తదితరులు పాల్గొన్నారు. వేల మంది భక్తులు కుంకుమార్చనలు నిర్వహించారు.

## కర్షక సాధికార సంఘటన అవార్డుల ప్రదానం 23న

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మాజీ ప్రధాని చరణ్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని వ్యవసాయం, అనుబంధ రంగాల్లో విశేష కృషి చేసిన ఐదుగురికి ఈ నెల 23న కర్షక సాధికార సంఘటన అవార్డులను ప్రదానం చేయనుంది.రైతులు పిడికిటి చంద్రశేఖర్ ఆజాద్, మహిళా రైతు అన్నె పద్మావతి, సాక్షి పత్రిక వ్యవసాయ బ్యూరో ఇంచార్జి పంతంగి రాంబాబు, టీన్యూస్ 'చేను.. చెలక' ఎడిటర్ విద్యాసాగర్, రాజేంద్రనగర్ పరిశోధన కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్టు దామోదరరాజుకు వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అవార్డులను అందజేస్తారు.

## అవగాహన లోపంతోనే విమర్శలు

### కథనాన్ని ఖండించిన స్వాత్మానందేంద్ర

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సమాజ శ్రేయస్సు కోసం నిర్వహిస్తున్న శాస్త్రసభలను విమర్శిస్తూ ఓ పత్రికలో (నమస్తే తెలంగాణ కాదు) వచ్చిన కథనాన్ని విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వామిస్వాత్మానందేంద్ర సర్వసతి శుక్రవారం ఓ ప్రకటనలో ఖండించారు. అవగాహన లోపంతోనే సభలను విమర్శిస్తూ కథనం ప్రచురించారని పేర్కొన్నారు. దేవాదాయశాఖ నిబంధనల ప్రకారం సభలకు సహకరిచాలని అధికారులను కోరామని తెలిపారు. అన్ని ధార్మిక సంస్థల్లాగే దేవాదాయశాఖ సహకారం కోరామని తెలిపారు. అంతేగానీ ఒత్తిడి చేయలేదని స్పష్టంచేశారు.

## 25, 26న శ్రీవారి ఆలయం మూసివేత

**తిరుమల:** సూర్యగ్రహణం కారణంగా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఈ నెల 25, 26వ తేదీల్లో 13 గంటలపాటు మూసివేయనున్నారు. 26న ఉదయం 8.08 గంటల నుంచి 11.06 వరకు సూర్యగ్రహణం ఉండటంతో ఆలయ సంప్రదాయం ప్రకారం ఆరు గంటల ముందుగానే అంటే 25న రాత్రి 11గంటలకే శ్రీవారి ఆలయ తలుపులు మూసివేస్తారు. గ్రహణం ముగిసిన తర్వాత తలుపులు తెరిచి ఆలయ శుద్ధి చేపడుతారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు యథావిధిగా భక్తులకు సర్వదర్శనం ప్రారంభంకానున్నది.






నమస్తే తెలంగాణ
# జిందగీ
శనివారం 21 డిసెంబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

కరీంనగర్

# నులిపురుగుల్ని నులిపేయండి!

**చిన్న పిల్లల కడుపులో దాదాపు 40 శాతం నులి పురుగులు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ఇవి కడుపులో ఉండడం వల్ల బరువు పెరగరు. తరచూ జబ్బు పడుతుంటారు. ఈ చిట్కాలు పాటిస్తే నులిపురుగుల్ని నులిపేయొచ్చు.**



- పిల్లల కడుపులోకి పురుగులు చేరడానికి ప్రధాన కారణం నీరు, కలుషిత ఆహారమే. ఇవే కాకుండా, మల, మూత్ర విసర్జనకు వెళ్లినప్పుడు చేతులు, కాళ్లు శుభ్రంగా కడుక్కోకపోవడంతో కూడా ఈ బ్యాక్టీరియా సులువుగా వ్యాపిస్తుంది. పరిశుభ్రతతో ఉండడంతో నులిపురుగుల్ని దూరం చేయవచ్చు.
- వెల్లుల్లి మంచి బ్యాక్టీరియల్‌గా పనిచేస్తుంది. ప్రతి రోజూ చిన్న టీ స్పూన్ అయినా వెల్లుల్లి రసాన్ని పిల్లలకు తాగించాలి. ఇలా వారం రోజులు ఇస్తే నులిపురుగుల సమస్య తగ్గుతుంది.
- పిల్లలకు ఎప్పుడు నీళ్లు తాగించినా మరిగించి చల్లార్చిన నీటిని మాత్రమే తాగించాలి. ఇలా చేస్తే బ్యాక్టీరియా వారి శరీరంలోకి ప్రవేశించదు. రెండు లవంగాలను ఒక గ్లాస్ నీటిలో వేసి, ఆ నీటిని తాగించినా ఫలితం ఉంటుంది.
- బొప్పాయి జ్యూస్‌లో ఒక స్పూన్ తేనె కలిపి ఇవ్వడం వల్ల నులిపురుగుల సమస్య నుంచి బయటపడొచ్చు. కాస్తంత పసుపు వేసిన పాలను తాగించడంతోనూ నులిపురుగులు చనిపోతాయి. ఇలా ప్రతి రోజూ 2 గ్లాసుల పాలు తాగించవచ్చు.
- అన్నం తినే ముందు, తిన్న తర్వాత శుభ్రంగా చేతులు కడగాలి. పండ్లు ఇచ్చేటప్పుడు శుభ్రంగా కడిగి ఇవ్వాలి.

# ఆరోగ్య సంరక్షణ కోసం..



**నాణ్యమైన వైద్యం అందక ఆమె తండ్రి తనువు చాలించాడు. అటువంటి పరిస్థితి మరెవరికి రావద్దని అనుకున్నది. అందుకోసం సరైన పరిష్కార మార్గాలను అందించేందుకు ముందుకు వచ్చింది. అతి తక్కువ ఖర్చుతో నిరుపేదలకు నాణ్యమైన వైద్యసేవలందించేందుకు శ్రీకారం చుట్టింది.**

అసోంలోని మారుమూల గ్రామానికి చెందిన భవ్‌జోత్ కౌర్ అనే యువతి పేదలకు నాణ్యమైన వైద్యసేవలను అందించేందుకు ముందుకువచ్చింది. తక్కువ ఖర్చుతో వైద్యంతోపాటు జీవిత బీమా సౌకర్యం కల్పిస్తున్నది. గతంలో కౌర్ తండ్రికి సరైన వైద్యం అందక చనిపోయాడు. తన తండ్రిలా మరెవరూ నాణ్యమైన వైద్యం అందక చనిపోకూడదనుకున్నది. చాలామంది సకాలంలో రోగాన్ని గుర్తించలేకపోతున్నారు. రోగాన్ని గుర్తించే సమయానికే వారు ప్రాణాలు వదులుతున్నారు. అలా కాకుండా ముందుగానే పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడే విధంగా అవసరమైన పరీక్షలు నిర్వహించాలి. ఇటువంటి సమస్యతో దేశంలో ఎంతోమంది చనిపోతున్నారు. అటువంటి వారికి అతితక్కువ ధరకే వైద్య సేవలు అందించాలనుకున్నది భవ్‌జోత్. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో సూరజ్ అనే వైద్యుడు భవ్‌జోత్‌కు పరిచయమయ్యాడు. నాణ్యమైన వైద్య సేవలందించడానికి అవసరమైన సలహాలూ, సూచలను సూరజ్‌ను అడిగి తెలుసుకున్నది. సూరజ్ సహకారంతో అతితక్కువ ఖర్చుతో వైద్య సేవలందించేందుకు ఓ స్టార్టప్‌ను ప్రారంభించింది. 'క్లినిక్' పేరుతో హెల్త్ కేర్ యాప్‌ను మొదలు పెట్టింది. నెల రోజుల పాటు ప్రయోగాత్మకంగా కొంతమందికి ఆన్‌లైన్ ద్వారా వైద్య సేవలందించి చూసింది. వారు ఆన్‌లైన్ ద్వారా వైద్యుణ్ణి సంప్రదించేటప్పుడు ఎటువంటి సందేహాలు తలెత్తుతున్నాయి? వాటిని ఎలా అధిగమించాలి? అనే అంశాలపై దృష్టి సారించింది. అందుకు పరిష్కారాలను చూపించడానికి 200లకుపైగా ఆసుపత్రులతో భాగస్వామ్యం ఏర్పర్చుకున్నది. రోగికి అవసరమైన వైద్యుడిని ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకోవచ్చు. ఎంపిక చేసుకున్న డాక్టర్‌కు ఫోన్ చేసి తమ సమస్యను తెలియజేయవచ్చు. తక్కువ ధరకే వైద్య పరీక్షలు, మందులు అందించేందుకు పలు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. నెలకు కేవలం రూ.100 నుంచి రూ. 500 చెల్లిస్తే వైద్యంతోపాటు జీవితబీమా సౌకర్యాలు అందుతాయి. 'పేదవారికి ఏదైనా రోగం వచ్చి ఆసుపత్రికి వెళ్తే ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అటువంటి పరిస్థితులను గమనించి చౌకగా వైద్యం అందించాలనుకున్నానని' భవ్‌జోత్ కౌర్ చెబుతున్నది. దేశవ్యాప్తంగా 11 ప్రాంతీయ భాషల్లో కూడా 'క్లినిక్' యాప్ సేవలు అందుబాటులో ఉన్నాయి. పలు ప్యాకేజీల రూపంలో సేవలు అందిస్తున్నది.

## ఆరోగ్య చిట్కాలు

- కొవ్వు పదార్థాలను మిరియాలు సులువుగా జీర్ణమయ్యేలా చేస్తాయి. తద్వారా శరీరంలోని కొవ్వు కరిగి.. మలినాలు బయటకుపోతాయి.
- మిరియాల్లో విటమిన్ సీ పుష్కలంగా ఉంటుంది. ఈ విటమిన్ వైరస్ బ్యాక్టీరియాతో పోరాడి.. శరీర రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అంతేకాకుండా జీవక్రియ సజావుగా సాగేలా చేస్తుంది.
- మిరియాలతో చేసిన వంటకాలలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్‌లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తంలో మంచి కొవ్వు పదార్థాల స్థాయిలను పెంచి.. గుండె ఆరోగ్యాన్ని పెంచుతాయి.
- రోజువారీ ఆహారంలో నల్ల మిరియాలను చేరిస్తే చర్మం, జుట్టు మెరుగుదలకు సహాయపడుతుంది.
- మిరియాలు ఎక్కువగా తీసుకుంటే జీర్ణకోశంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది.

# డిస్పోజెబుల్‌బెడ్‌షీట్లు!



**డిస్పోజెబుల్ గ్లాసులు, ప్లేట్లు చూశాం. యూజ్ అండ్ త్రో పేరుతో వచ్చిన వాటర్ బాటిల్స్, కప్స్, స్పూన్స్‌ను కూడా వాడాం. ఇదే మాదిరిగా డిస్పోజెబుల్ బెడ్‌షీట్లు ప్రస్తుతం మార్కెట్లోకి వచ్చాయి. వాటినీ వాడేద్దామా!**

వారం రోజులు ప్రయాణించాలంటే చెద్దర్లు, పక్క బట్టలు మోసుకెళ్లక తప్పదు. ఇలాంటి సమయాల్లో డిస్పోజెబుల్ బెడ్‌షీట్లను వాడొచ్చు. ఇలా ఇంటికెవరైనా బంధువులొచ్చినా, హాస్పిటళ్లల్లో ఉండాల్సి వచ్చినా ఈ బెడ్‌షీట్లు బాగా ఉపయోగపడుతాయి. వాణిజ్య అవసరాలకైతే ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. హోటళ్లు, లాడ్జీలు, దవాఖానల్లో వీటిని విరివిగా వాడొచ్చు. అయితే ఇవి ఒక్కసారి వాడితే మళ్లీ వాడడానికి వీలుండదు. సింగిల్ కాట్ బెడ్‌కు సరిపోయేంత బెడ్‌షీట్‌కు రూ. 15కు మార్కెట్లో విక్రయిస్తున్నారు. దీన్ని వాడడం వల్ల అనారోగ్యాల బారిన పడకుండా ఉండొచ్చని తయారీదారులు చెబుతున్నారు. రోజుల తరబడి మార్చని బెడ్‌షీట్లకు బదులు ఇవి వాడితే చర్మవ్యాధులు రాకుండా ఉంటాయని చెబుతున్నారు. రైల్వే బోగీల్లోనూ వీటిని వాడేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏసీ, స్లీపర్ కోచ్‌లలో వీటిని ఉపయోగించడం వల్ల దోబీ ఖర్చు కూడా తగ్గుతుందనే ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఇవి ఒక్కోటి వంద గ్రాముల బరువులోపే ఉంటాయి. ఎలాగైనా మడుచుకోవడానికి వీలుంటుంది.



'నేను చేసే పనులను చూసి నా తల్లిదండ్రులు.. సమాజం గర్వపడాలి. ఇక్కడే ఉన్నత విద్య చదివి.. మన దేశానికి సేవ చేయకుండా మన తెలివితేటల్ని విదేశాల అభివృద్ధికి ఉపయోగిస్తున్నారు. నా దృష్టిలో ఇది కరెక్ట్ కాదు సర్. నేను చదివిన చదువు నా దేశానికే ఉపయోగపడాలి. నా లక్ష్యం దేశానికి సేవ చేయడమే. అందుకే సర్, నేను 'న్యాయ వ్యవస్థ'లోకి అడుగుపెట్టాను'. ఈ మాటలన్నది ఎవరో కాదు.. 23 యేండ్ల ఈ యువకెరటమే. పేరు పోట్ల స్వాతి భవాని. చిన్నప్పటి నుంచి సమాజాన్ని చదివారు కాబట్టే.. దేశంలోపిన్నవయస్కురాలైన మహిళా జడ్జిగా త్వరలో బాధ్యతలు స్వీకరించబోతున్నారు. దేశం, ప్రజలు, తన వృత్తిపట్ల ఆమెకున్న నిబద్ధతను 'జిందగీ'తో పంచుకున్నారు స్వాతి.

# చిన్నవయసు పెద్ద బాధ్యత



**సైనిక్‌పురిలోని** 'భవాన్స్'లో ఇంటర్(సీఈసీ) చదువుతుండగా.. ఆ స్కూల్ ఫంక్షన్‌కు చీఫ్‌గెస్ట్‌గా ఓ ప్రముఖ వ్యక్తి వచ్చారు. ఆయన ఒక్కొక్కర్ని పిలిచి.. 'భవిష్యత్‌లో నువ్ ఏం అవ్వాలనుకుంటున్నావ్? నీ లక్ష్యం ఏంటి?' అని అడుగుతున్నారు. స్వాతి వంతు రానే వచ్చింది. 'సర్ నేను సుప్రీంకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిని అవ్వాలనుకుంటున్నా' అని క్షణం ఆలోచించకుండా సమాధానం చెప్పారు స్వాతి. ఆమె అలా చెప్పడానికి కారణం లేకపోలేదు. ఒకవైపు ఇంటర్ చదువుతూనే.. మరోవైపు సమాజాన్ని చదివారు స్వాతి. ఇంటర్ మొదట్లో సివిల్స్ సాధించాలని కోరిక ఉన్నా.. న్యాయ విద్య గురించి తెలుసుకునే కొద్దీ.. న్యాయ వ్యవస్థలోనే స్థిరపడాలని నిర్ణయించుకున్నారు. అలా తన ఆలోచనా పరిధిని, కొత్త అంశాలపై అవగాహన పెంచుకుంటూ.. ప్రతీది క్షుణ్ణంగా పరిశీలించడం అలవాటు చేసుకొని.. న్యాయ విద్యార్థినిగా ఎదిగారు. ఇటీవల తెలంగాణ హైకోర్టు, న్యాయమూర్తుల నియామకానికి నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, రెండో స్థానంలో నిలిచారు స్వాతి. మన తెలంగాణ తరపున దేశంలోనే పిన్నయవస్కురాలైన మహిళా జూనియర్ సివిల్ జడ్జిగా చరిత్ర సృష్టించి.. అతి త్వరలోనే బాధ్యతలు చేపట్టబోతున్నారు.



తల్లిదండ్రులు, చెల్లెలితో స్వాతి భవాని

**లాసెట్‌లో 4వ ర్యాంకు:** ఇంటర్ తర్వాత చిక్కడపల్లిలోని 'పెండేకంటి లా కాలేజ్' ఐదేండ్ల లా కోర్సు పూర్తి చేశారు స్వాతి. 2018లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన 'లా సెట్'లో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు సాధించారు. ఈ యేడాది మార్చిలో జూనియర్ సివిల్ జడ్జిల నియామకానికి నోటిఫికేషన్ రావడంతో తన 22వ యేట మొదటిసారి ఈ పరీక్ష రాశారు. తుది ఫలితాలు వచ్చేనాటికి ఆమె వయసు 23 యేండ్లు. చివరి ఇంటర్వ్యూలో రెండో ర్యాంకు సాధించి.. తన కొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు స్వాతి. న్యాయ విద్యను అభ్యసిస్తున్న కొద్దీ.. తన సివిల్స్ ఆశకు దూరమై న్యాయ విద్యకు దగ్గరయ్యారు. ఆ విద్యలోనే పూర్తిగా కొనసాగాలని నిర్ణయించుకొని.. తన భవిష్యత్‌ను తానే తీర్చిదిద్దుకున్నారు. దేశంలోనే పిన్నవయస్కురాలైన మహిళా జూనియర్ సివిల్ జడ్జిగా చరిత్రకెక్కబోతున్నారు.

**న్యాయకోవిదులతో ఇంటర్న్‌షిప్:** లా చదువుతున్నప్పుడే 'సెమిస్టర్ బ్రేక్'లో ఢిల్లీకి పయనమయ్యేవారు స్వాతి. ఐదేండ్ల లా కోర్సులో.. పదిమంది సీనియర్ న్యాయమూర్తుల దగ్గర ఇంటర్న్‌షిప్ చేశారు. వీరిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గోపాల గౌడ, జస్టిస్ కె.ఎస్. రాధాకృష్ణన్, జస్టిస్ పీఎస్ నర్సింహా, ప్రస్తుత అటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్ వంటివారు ఉన్నారు. జడ్జీల నియామక పరీక్షలో స్వాతి ఉత్తీర్ణురాలు అవడంతో ప్రత్యేకంగా అభినందలు తెలిపారు న్యాయకోవిదులు. 'భవిష్యత్‌లో నువ్ మంచి న్యాయమూర్తిగా ఎదగాలి. కోర్టులో న్యాయవాదులు చెప్పే ప్రతి అంశాన్ని వినాలి. వారి నుంచి, ఇతరుల దగ్గర్నుంచి కూడా నేర్చుకోవాల్సింది ఉంటుంది. నీ భవిష్యత్‌లో అభ్యాసనం ఎట్టి పరిస్థితుల్లోనూ మరువొద్దు' అని దీవించారు. ఆ మాటలు తనలో మరింత స్ఫూర్తిని రగిలించాయని అంటున్నారు స్వాతి.

**ఏపీలో ఇంటర్వ్యూ దశ:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా తెలంగాణతో పాటే జూనియర్ జడ్జీల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ పరీక్షలు ఆలిండియా లెవల్‌లో జరుగుతుండడంతో ఏపీలో కూడా అప్లై చేశారు స్వాతి. 38 పోస్టుల నియామకానికి జరిగిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు స్వాతి. చివరి ఇంటర్వ్యూకు ఎంపికైన ఐదుగురిలో స్వాతి పోట్ల ఒకరు. తెలంగాణ నుంచి ఈమె ఒక్కరే ఎంపికయ్యారు. ఈనెల 26న ఇంటర్వ్యూ జరుగనున్నది. ఇక్కడ మరో విషయం ఏంటంటే.. ఏపీలో కూడా 'పిన్నవయస్కురాలైన జూనియర్ జడ్జి'గా స్వాతి నిలువబోతున్నారు. ఏపీ, తెలంగాణలో కలిపి వేల సంఖ్యలో అభ్యర్థులు ఈ పరీక్షలకు సిద్ధమయ్యారు. వారిలో ఎన్నో యేండ్ల నుంచి ఈ పరీక్షల కోసమే సిద్ధమయ్యే వారూ ఉన్నారు. కేవలం ప్రతిభ ఆధారంగా మాత్రమే ఎంపిక చేసే ఈ నియామకాల్లో.. తెలంగాణ బిడ్డ దేశ వ్యాప్తంగా రికార్డు సృష్టించడం మనకు గర్వకారణం.

### చదువు రెండుమూడు గంటలే..

ఇంతటి ప్రాముఖ్యమైన పరీక్షకు స్వాతి పోట్ల కేటాయించింది కేవలం రెండు నుంచి మూడు గంటల సమయమే. గంటల తరబడి పుస్తకాలతో కుస్తీ పట్టకుండా.. చదివిన సబ్జెక్టులను ఎక్కువగా రివిజన్ చేసుకునేవారు. తనకు ఎప్పుడు చదువాలనిపిస్తే.. అప్పుడే చదివేవారు. మిగతా సమయం కుటుంబానికి, స్నేహితులకు, సోషల్ మీడియాకు కేటాయించేవారు. స్కూల్, కాలేజ్‌లోనూ ఎప్పుడూ టాపర్‌గాను నిలువలేదు. బట్టిపట్టి చదివే విధానానికి తాను పూర్తిగా వ్యతిరేకమని అంటున్నారు స్వాతి. ఇంట్లో బోర్డుపై 'ఫస్ట్ ర్యాంక్' అని రాసుకున్నారు. దాన్ని ఎలాగైనా సాధించాలని రోజులో తానేం చదువాలో నిర్ణయించుకొని.. ఆ సిలబస్‌ను పూర్తి చేసేవారు. సోషల్‌మీడియాలో మనోధైర్యం నింపే ఆధ్యాత్మిక, పాజిటివ్‌నెస్ పోస్టులు పెడుతుంటారు. చదువుతోపాటుగా ఆటల్లోనూ ప్రావీణ్యం ఉంది. చిన్నప్పటి నుంచి బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి అయిన స్వాతి.. సౌత్ జోన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. వీటితోపాటుగా ఒంటరి ప్రయాణాలంటే చాలా ఇష్టం. దేశంలోని ప్రముఖ ప్రాంతాలన్నింటినీ చుట్టేశారు.

### చిత్తశుద్ధితో వ్యవహరిస్తా

నా వృత్తిలో ఎలాంటి రాగద్వేషాలకు తావు లేకుండా.. చిత్తశుద్ధితో నా విధులు నిర్వర్తిస్తా. నాకు ఎక్కడ పోస్టింగ్ ఇచ్చినా.. సంతోషంగా వెళ్లి నా దేశ ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నా. నాకు సహకరించిన వారందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు. ఫ్యామిలీ నా కోసం చాలా కష్టపడింది. ఇంట్లో చిన్నప్పుడే కంప్యూటర్ ఉండడం బాగా కలిసొచ్చింది. నేను ఎన్ని ప్రశ్నలు వేసినా నాన్న చాలా ఓపికతో సమాధానం చెప్పేవారు. తర్వాత నాన్నను విసిగించకుండా కంప్యూటర్‌తో కుస్తీపట్టా. ఎన్నో విషయాలు తెలుసుకున్నా, చాలా కేసుల గురించి ఆరా తీశా. అమ్మానాన్న ఇచ్చిన స్వేచ్ఛను మేం సద్వినియోగం చేసుకున్నాం. అదే నాకు గర్వంగా అనిపిస్తుంది.

**- స్వాతి భవాని పోట్ల,** జూనియర్ సివిల్ జడ్జి

### వారిచ్చిన ధైర్యమే..

స్వాతి భవానికి ప్రతి విజయంలోనూ ఆమె కుటుంబం అండగా నిలిచింది. ఆడపిల్ల కదా అని.. నిబంధనలు పెట్టకుండా పూర్తి స్వేచ్ఛను కల్పించారు. వారి తర్వాత అంతటి ప్రోత్సాహాన్ని అందించిన వారు 'సాధ్యం' ఇనిస్టిట్యూట్ టీచర్ సతీష్. జడ్జిల పరీక్షకు కోచింగ్ తీసుకునేటప్పుడు.. ఆమెలోని ప్రతిభను గుర్తించి 'ఖచ్చితంగా జడ్జిగా ఎంపికవుతావు' అని స్వాతికి చెప్పారట సతీష్. స్వాతిపై ప్రత్యేక దృష్టి పెట్టి.. ఆమెను వెన్నుతట్టి ప్రోత్సహించారు. తల్లిదండ్రులది మహబూబాబాద్ జిల్లా డోర్నకల్. వారి కుటుంబం 30 ఏండ్ల క్రితమే నేరెడ్‌మెట్ డివిజన్ ఆర్కేపురంలోని శక్తి నగర్‌లో స్థిరపడింది. అమ్మ పద్మప్రియ రైల్వే ఉద్యోగి, చెల్లి స్వాతి శివాని బీబీఏ చదువుతున్నది. నాన్న కంప్యూటర్స్ వ్యాపారం చేస్తుంటారు. 'మా కుటుంబంలో న్యాయవాద వృత్తిలో ఎవరూ లేరు. నా కూతురు న్యాయమూర్తిగా ఎంపికైనందుకు సంతోషంగా ఉంది. ఎంతోమంది ఫోన్లు చేసి అభినందలు తెలుపుతున్నారు' అని స్వాతి తండ్రి సత్యనారాయణ చెబుతున్నారు.

... డప్పు రవి నర్రె రాజేశ్

## సిరిముగ్గు

15 చుక్కలు
సందుచుక్క
8 వచ్చేవరకు





**కోనేటి రాధిక**
సాయి ఐశ్వర్య కాలనీ,
పర్వతాపూర్, మేడ్చల్ జిల్లా

**ముగ్గులు పంపాల్సిన మా చిరునామా:**
సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నం-10, హైదరాబాద్ -500034.
zindagi.nt@gmail.com

# కళల వారధులు

**ఆకాశాన్ని తాకే వందలాది విగ్రహాలు. బతికే ఉన్నారా అనిపించేలా కనిపించే సుందరమైన రూపాలు. అవన్నీ ఆమె చేతుల్లోంచి ప్రాణం పోసుకున్నాయి. వందలాది కాంస్య విగ్రహాల్ని తయారు చేసిన ఆమె ఈ లోకం నుంచి వెళ్లిపోయింది. కానీ ఆమె జ్ఞాపకాలు విగ్రహాల రూపంలో ఇప్పటికీ సజీవంగానే ఉన్నాయి.**





జాసుబెన్‌ది గుజరాత్‌లోని తారాపూర్ గ్రామం. ఆమె చిన్నప్పటి నుంచే కళల్లో రాణించేది. కళలపై మక్కువతో చిన్న చిన్న విగ్రహాలను తయారు చేసేది. ఆ ఇష్టంతోనే గుజరాత్‌లోని సీఎన్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో చేరింది. మరిన్ని మెళకువలు నేర్చుకుంది. ఆ తర్వాత ఆర్థిక ఇబ్బందులు తలెత్తిన నేపథ్యంలో ఓ పాఠశాలలో ఆర్ట్స్ టీచర్‌గా కూడా పనిచేసింది. అనంతరం పూర్తిస్థాయిలో కాంస్య విగ్రహాల తయారీలో నిమగ్నమైంది. జీవిత కాలంలో 225 కాంస్య విగ్రహాలు, 525 సిమెంట్ విగ్రహాలను తయారు చేసింది. క్లేవర్క్, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ డై వర్క్, మెటల్ కాస్టింగ్ ఇలా 15 రకాల విగ్రహాల తయారీలో ఆమె పట్టు సాధించింది. అనేక అంతర్జాతీయ అవార్డులు సైతం అందుకున్నది. 2013లో ఆమె ఆకస్మికంగా మరణించింది. అనంతరం ఆమె పిల్లలు ధ్రువ్, ధార ఆమె కళల్ని కొనసాగిస్తున్నారు. కాంస్యపు విగ్రహాల తయారీలో నిమగ్నమయ్యారు. అదే ఏడాది 'జాసు శిల్పి ఆర్ట్ ఫౌండేషన్'ను ప్రారంభించారు. భారతదేశమంతటా శిల్పులకు అండగా నిలబడేందుకు కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. గుజరాత్, బిహార్, ఢిల్లీ వంటి నగరాల్లో శిల్పులకు శిక్షణ ఇస్తున్నారు.

## వంటింటి చిట్కాలు



- తెల్లబెల్లంలో సల్ఫర్ ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఇది చాలా ప్రమాదకరం. నల్ల బెల్లం వాడడం మంచిది.
- కొంచెం తేనెలో ముంచిన దూదిని అగ్గిపుల్లతో కాలిస్తే కల్తీ లేని తేనె బాగా మండుతుంది. కల్తీ ఉంటే చిటపట శబ్దం వస్తుంది.
- కందిపప్పు పురుగు పట్టకుండా ఉండాలంటే అందులో ఒక ఎండు కొబ్బరి చిప్పను వేయాలి.
- వంటగదిలో ఈగల బెడద ఎక్కువగా ఉంటే పసుపు కలిపిన నీటితో వంటగదిని శుభ్రం చేయాలి.
- పాలు పొంగకుండా ఉండాలంటే మరిగేటప్పుడు అవి గిన్నెపై ఒక చెక్క గరిట లేదా స్పూన్ పెట్టాలి. లేదా గిన్నె అంచుకు నూనె రాయాలి.
- పనసకాయ కోసేటప్పుడు చేతులకు నూనె రాసుకుంటే జిగురు అంటదు.
- మినుపపప్పును నానబెట్టిన నీటిలో ఒక ఇనుప ముక్కను వేస్తే అది త్వరగా నానుతుంది.
- కాకరకాయ ముక్కలకు కొంచెం ఉప్పు రాసి నీళ్లు చల్లితే ఒక గంట సేపట్లో చేదుపోతుంది.

II.
నమస్తే తెలంగాణ
సంపద
[ కరీంనగర్ ]
శనివారం 21 డిసెంబర్ 2019

# హైదరాబాద్‌లోకి శోభా డెవలపర్స్?

దేశీయ నిర్మాణ దిగ్గజ సంస్థ శోభా డెవలపర్స్ హైదరాబాద్ నిర్మాణ రంగంలోకి అడుగు పెడుతున్నదని సమాచారం. ఇందుకు సంబంధించి ఈమధ్యే మాదాపూర్‌లో రియల్ ఎస్టేట్ ప్రతినిధులతో శోభా డెవలపర్స్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా సమావేశమయ్యారని తెలిసింది. హైదరాబాద్ రియల్ రంగంలో నెలకొన్న తాజా పరిస్థితుల్ని తెలుసుకోవడంతో బాటు ఇక్కడి మార్కెట్ స్థితిగతుల గురించి ఆరా తీసినట్లు సమాచారం. అయితే, శోభా డెవలపర్స్ సంస్థ హైదరాబాద్‌లో ఒకట్రెండు ప్రాంతాల్లో ల్యాండ్ బ్యాంక్ ఉన్నదని తెలిసింది. ఈ మేరకు రాజ్ భవన్ రోడ్డు చేరువలో



ఒక లగ్జరీ నివాస సముదాయం, పశ్చిమ హైదరాబాద్‌లో ఐటీ, నివాస సముదాయాల్ని భారీ స్థాయిలో నిర్మించే ఆలోచనలు ఈ సంస్థకు ఉన్నట్లు తెలిసింది. మొత్తానికి, శోభా డెవలపర్స్ వంటి దిగ్గజ సంస్థ హైదరాబాద్‌లోకి వస్తుండటంతో.. ఇక్కడి ఐటీ ఉద్యోగులు, ప్రవాసులు, వృత్తి నిపుణులకు మెరుగైన రీతిలో ఆధునిక నివాస గృహాలు లభించే అవకాశముంది. ఇప్పటికే బెంగళూరుకు చెందిన మంత్రి డెవలపర్స్, ప్రెస్టీజ్ గ్రూప్, సాలర్‌పూరియా, ప్రావిడెంట్, సుమధుర వంటి సంస్థలు హైదరాబాద్‌లో పలు ప్రాజెక్టుల్ని చేపడుతున్నాయి. వీటి జాబితాలో తాజాగా శోభా డెవలపర్స్ చేరుతుండటం ఆహ్వానించదగ్గ పరిణామమని నిర్మాణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కంపెనీలు భాగ్యనగర రియల్ మార్కెట్‌లోకి అడుగుపెట్టే అవకాశాలున్నాయని ముక్తకంఠంతో చెబుతున్నారు.






# పారదర్శకంగా క్రియేట్ అవార్డులు

**క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి**

నాణ్యమైన ఆధునిక నిర్మాణాల్ని చేపట్టే తెలంగాణ డెవలపర్లను ప్రోత్సహించడానికే క్రియేట్ అవార్డులను రెండేండ్లకోసారి అందజేస్తున్నామని క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు చెరుకు రాంచంద్రారెడ్డి తెలిపారు. క్రియేట్ అవార్డుల ప్రక్రియ గురించి వివరించేందుకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో'సంపద'తో ప్రత్యేకంగా మాట్లాడారు. మరి, ఆయన ఏమన్నారంటే..

'సినిమా రంగానికి ఆస్కార్ అవార్డును అందజేస్తున్నట్లే.. రియల్ రంగంలోనూ క్రియేట్ అవార్డులను అందజేసే పోకడకు శ్రీకారం చుట్టాం. ఈ నెల 28న జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే క్రియేట్ అవార్డుల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ హాజరయ్యే అవకాశముంది. ఈసారి మొత్తం 11 సంఘాల నుంచి 103 మంది డెవలపర్లు వివిధ విభాగాల్లో దరఖాస్తు చేసుకున్నారు. 2017 నవంబరు 1 నుంచి 2019 నవంబరు 30లోపు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను అందుకున్న డెవలపర్లే ఈ అవార్డుల కార్యక్రమానికి అర్హులు. హైదరాబాద్ మినహా ఇతర నగరాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను డెవలపర్లు సకాలంలో అందుకోలేకపోయారు. ఖమ్మం కార్పొరేషన్‌లో ఏడాది నుంచి ఓసీ మంజూరు కాలేదు. ఇలా, పలు పట్టణాల్లో ఓసీ రాకపోవడం వల్ల కొందరు డెవలపర్లు పోటీలో పాల్గొనలేకపోయారు. ఏదీఏమైనా, క్రియేట్ అవార్డుల ఎంపికలో పూర్తి స్థాయి పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. తుది విజేతల వివరాలు క్రెడాయ్ తెలంగాణ కమిటీకి కూడా తెలియదంటే.. జ్యూరీకి ఎంత స్వేచ్ఛ ఇచ్చామనే విషయం ప్రతిఒక్కరికీ ఇట్టే అర్థమవుతుంది. మొత్తం మూడు దశల్లో ప్రాజెక్టుల్నిప రిశీలించిజ్యూరీ తుది అవార్డుల్ని ప్రకటిస్తుంది'.

# హాలెండ్ నుంచి హైదరాబాద్‌కి..

- ప్రపంచానికి మాడ్యులార్ కిచెన్‌ని పరిచయం చేసిన డీకేజీ
- మొత్తం 1950 డిజైన్లు
- ప్రప్రథమంగా భాగ్యనగరంలోకి..



ప్రపంచానికి 'మాడ్యులార్ కిచెన్'ని పరిచయం చేసిన హాలెండ్‌కు చెందిన డీకేజీ గ్రూపు అనుబంధ సంస్థే కెల్లర్ కిచెన్స్. ఈ కంపెనీ ప్రప్రథమంగా తమ షోరూమును హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ప్రారంభించింది. సుమారు 87 ఏండ్ల క్రితం నెదర్లాండ్స్‌లో ప్రారంభమైన డీకేజీ ఆధునిక వంట గదులకే సరికొత్త నిర్వచనం చెబుతున్నది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు సరికొత్త మార్పులకు శ్రీకారం చుడుతున్న ఈ సంస్థ తాజాగా గ్రీన్ కిచెన్స్ కాన్సెప్టును ప్రారంభించింది. దీన్నే కెల్లర్ కిచెన్స్ అని కూడా పిలుస్తారు. ఇవి పర్యావరణానికి అనుకూలమైనవని సంస్థ చెబుతున్నది. వారానికి 2,500 కిచెన్లను కొనుగోలుదారులకు అందజేసే సామర్థ్యమున్న ఈ సంస్థ భాగ్యనగర వాసులకు ఎలాంటి వంట గదుల్ని తీసుకొచ్చిందో తెలుసా?

సాధారణంగా వంట గదుల్ని ప్లైవుడ్‌తో తయారు చేయడాన్ని మనం చూస్తుంటాం. కానీ, ఇక్కడ మాత్రం సహజసిద్ధమైన కలపతోనే తయారు చేస్తారు. వంటగది మూలల్లో లేజర్ బెండింగ్ ద్వారా తీర్చిద్దుతారు. దీంతో ఫినిషింగ్‌లో ఒక అంగుళం కూడా తేడా రాదు. అంటే, గృహ కొనుగోలుదారులు కోరుకునే సైజుల్లో ఎలాంటి తేడా రాకుండా వంట గదుల్ని కెల్లర్ కిచెన్స్ తయారు చేయడానికి వీలు అవుతుందన్నమాట.

పైగా, ఈ సంస్థ వద్ద ఒకటి కాదు రెండు కాదు దాదాపు 1950 డిజైన్లు, రంగుల్లో కిచెన్లను అందజేయగల్గుతారు. ఒక అపార్టుమెంట్‌లో వెయ్యి ఫ్లాట్లు ఉన్నట్లయితే.. ప్రతిఒక్కరికీ వివిధ రంగుల్లో, డిజైన్లలో తయారు చేసి ఇవ్వగలుగుతామని సంస్థ చెబుతున్నది. ఏ ఒక్క డిజైన్ కానీ రంగు కానీ ఒకేలా కనిపించకుండా ఉండేలా తయారు చేసిస్తామని కంపెనీ అంటున్నది.

**ధర ఎక్కువా?**

ఇన్నిన్ని ప్రత్యేకతలున్న వంట గదుల్ని అందజేయడమంటే ధర కూడా ఎక్కువ ఉంటుందనేది మీ సందేహమా? అలాంటిదేం లేదు. ప్రతిఒక్కరి బడ్జెట్‌కు అనుకూలంగా వీటిని తయారు చేసిస్తామని కెల్లర్ కిచెన్స్ అంటున్నది. కావాలంటే, రూ.లక్షన్నరకు వంట గదిని అందజేస్తామని, గరిష్ఠంగా డిజైన్‌ను బట్టి రూ.కోటిన్నర వరకూ మాడ్యులార్ కిచెన్లను తయారు చేస్తామని చెబుతున్నది. వీరి వద్ద కొంటే, ఆఫీసులో ఉండి కూడా ఇంట్లో ఉన్న కిచెన్‌ను నియంత్రించవచ్చని పేర్కొన్నది.

**ఎన్ని ఫ్లాట్లు అయినా.. 90 రోజుల్లో**

ఒక అపార్టుమెంట్‌లో ఐదు వందల ఫ్లాట్లను ఒక డెవలపర్ నిర్మించాడంటే.. అందులో వంట గదుల్ని తయారు చేయడానికి ఎంత మంది కార్పెంటర్లు పని చేయాల్సి ఉంటుంది? ఎంత ముడి సరుకును వినియోగిస్తారు? పైగా, వారు వినియోగించే వస్తువుల్లో దాదాపు 30 శాతం దాకా రోడ్డు మీద పారేస్తుంటారు. కానీ, కెల్లర్ కిచెన్స్ అలా కాదు. 0.01 శాతం వృథా కూడా కాదు. ఒకసారి ఆర్డర్ ఇచ్చారంటే చాలు.. దాదాపు మూడు నెలల్లోపు హాలెండ్‌లో తయారై హైదరాబాద్‌కు వంటగదివచ్చేస్తుంది. ఒక్క రాత్రిలోనే వంట గదిని తయారు చేసిస్తాం. ఎలాంటి సాంకేతిక సమస్య వచ్చినా, ఇక్కడి నిపుణులు పరిష్కరిస్తారు.

– జేన్ రెడ్డి, సీఈవో, కెల్లర్ కిచెన్స్




# ఆ రోజు షూటింగ్‌కు బ్రేక్!


రాజమౌళి

ప్రముఖ సంగీత దిగ్గజం కీరవాణి తనయుడు శ్రీసింహా కథానాయకుడిగా అరంగేట్రం చేస్తున్న 'మత్తు వదలరా' చిత్రం గురించి అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి భావోద్వేగంగా స్పందించారు. ఈ చిత్రం ద్వారా రితేష్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్, క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. చిరంజీవి (చెర్రీ), హేమలత నిర్మాతలు. కీరవాణి పెద్ద కుమారుడు కాలభైరవ స్వరకర్త. ఈ నెల 25న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా చిత్ర ట్రైలర్‌ను రాజమౌళి ట్విట్టర్‌లో పంచుకున్నారు. 'ఈ చిత్రాన్ని దర్శకుడు రితేష్ అద్భుతంగా ముస్తాబు చేశాడు. మా అబ్బాయిలు శ్రీసింహా, కాలభైరవ ఇద్దరూ ఈ సినిమా ద్వారా పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. ఇది భావోద్వేగభరితమైన సందర్భం. సినిమా విడుదల రోజైన 25న షూటింగ్ మానేస్తా' అంటూ ఉద్విగ్నంగా ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు రాజమౌళి. ప్రస్తుతం ఆయన ట్వీట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. శ్రీసింహా, కాలభైరవ అరంగేట్రం సందర్భంగా ప్రభాస్, రానాతో పాటు పలువురు టాలీవుడ్ ప్రముఖులు చిత్రబృందానికి తమ శుభాకాంక్షలందజేశారు. మర్డర్ మిస్టరీ కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. నరేష్ ఆగస్త్య, అతుల్య చంద్ర, సత్య, వెన్నెలకిషోర్, బ్రహ్మాజీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేష్ సారంగం, ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైనర్: ఏ.ఎస్.ప్రకాష్, క్రియేటివ్ హెడ్: థోమస్‌జై, కొరియోగ్రాఫర్: యశ్వంత్, స్టయిలింగ్, స్టంట్ కో-ఆర్డినేటర్: శంకర్ ఉయ్యాల, కో-రైటర్: తేజ.ఆర్, సాహిత్యం: రాకేందుమౌళి, సంగీతం: కాలభైరవ, లైన్ ప్రొడ్యూసర్: పి.టి.గిరిధర్ రావు, పబ్లిసిటీ డిజైనర్: ది రవెంజర్ట్, కథ, దర్శకత్వం: రితేష్ రానా.

నమస్తే తెలంగాణ
చిత్రం

# నితిన్ 'పవర్ పేట'

ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు నితిన్. తాజాగా మరో సినిమాను అంగీకరించారాయన. నితిన్ కథానాయకుడిగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ 'పవర్ పేట' పేరుతో ఓ చిత్రాన్ని నిర్మించనున్నది. కృష్ణచైతన్య ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. 2020 వేసవిలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభంకానున్నది. ఆసక్తికర కథ, కథనాలతో రూపొందనున్న ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని విశేషాల్ని త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొన్నది. ప్రస్తుతం నితిన్..వెంకీ కుడుముల దర్శకత్వంలో 'భీష్మ', చంద్రశేఖర్ యేలేటి 'చదరంగం', వెంకీ అట్లూరి 'రంగ్ దే' సినిమాల్లో నటిస్తున్నారు. అవి పూర్తయిన తర్వాత 'పవర్‌పేట' షూటింగ్‌లో నితిన్ పాల్గొననున్నారు.


నితిన్


మెహరీన్, నాగశౌర్య

# నిన్నే నిన్నే..

నాగశౌర్య కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'అశ్వథ్థామ'. ఈ చిత్రం ద్వారా రమణతేజ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. ఐరా క్రియేషన్స్ పతాకంపై శంకర్‌ప్రసాద్ మల్పూరి సమర్పణలో ఉషా మల్పూరి నిర్మిస్తున్నారు. మెహరీన్ కథానాయిక. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. జనవరి 31న విడుదల చేస్తున్నారు. ఈ చిత్రానికి నాగశౌర్య కథనందించారు. ఈ చిత్రంలోని 'నిన్నే నిన్నే..' వీడియో సాంగ్‌ను ఇటీవల విడుదల చేశారు. నాగశౌర్య, మెహరీన్‌లపై చిత్రీకరించిన ఈ గీతానికి విశ్వరఘు నృత్యరీతుల్ని సమకూర్చారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మనోజ్‌రెడ్డి, సంగీతం: శ్రీచరణ్ పాకాల, సంభాషణలు: పరశురాం శ్రీనివాస్, కథ: నాగశౌర్య, దర్శకత్వం: రమణతేజ.

# చీమ ప్రేమవిహారం


అమిత్

'వీధుల్లో విహరిస్తున్న ఓ చీమ కథేమిటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే' అంటున్నారు శ్రీకాంత్ శ్రీ అప్పలరాజు. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'చీమ-ప్రేమ మధ్యలో భామ'. అమిత్, ఇందు జంటగా నటిస్తున్నారు. ఎస్.ఎన్. లక్ష్మీనారాయణ నిర్మిస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'కాల్పానిక ఇతివృత్తంతో తెరకెక్కుతున్న ప్రేమకథా చిత్రమిది. ఓ అందాల భామతో ప్రేమలో పడిన చీమ కథేమిటన్నది ఆకట్టుకుంటుంది. చీమ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం సరికొత్త అనుభూతిని పంచుతుంది. అంతఃకరణశుద్ధితో ముందడుగు వేయగలిగితే ఏదైనా సాధించవచ్చనే సందేశంతో రూపొందిస్తున్నాం. గ్రాఫిక్స్ ఆకట్టుకుంటాయి త్వరలో సినిమాను విడుదలచేయనున్నాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: రవివర్మ, సినిమాటోగ్రఫీ: ఆరిఫ్ లలాని.

# బ్యూటీఫుల్ లవ్‌స్టోరీ


నైనా, సూరి

రామ్‌గోపాల్‌వర్మ రూపొందిస్తున్న చిత్రం 'బ్యూటిఫుల్' ('ట్రిబ్యూట్ టు రంగీలా' ఉపశీర్షిక). ఆగస్త్యమంజు దర్శకుడు. సూరి, నైనా జంటగా నటించారు. జనవరి 1న ప్రేక్షకులముందుకు రానుంది. 'వైవిధ్యభరితమైన రొమాంటిక్ కథాంశమిది. నైనా అందచందాలు, అభినయం మెప్పిస్తాయి. ఓ మెకానిక్‌తో అందాలముద్దుగుమ్మ ప్రేమాయణం ఏమిటన్నదే చిత్ర ఇతివృత్తం. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన లభించింది. యువతరాన్ని ఆకట్టుకునే అన్ని అంశాలున్న చిత్రమిది. కథ, కథనాలు వినూత్నంగా సాగుతాయి' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి పాటలు: సిరాశ్రీ, సంగీతం: రవిశంకర్, నిర్మాతలు: నరేష్ కుమార్, శ్రీధర్, రచన, సినిమాటోగ్రఫీ,దర్శ కత్వం:ఆ గస్త్యమంజు.

# రంగమార్తాండలో..

'దొరసాని' చిత్రంలో సహజ నటనతో తొలి అడుగులోనే కథానాయికగా ప్రతిభను చాటుకున్నది రాజశేఖర్ తనయ శివాత్మిక. ప్రస్తుతం ఆమె ఓ సువర్ణావకాశాన్ని సొంతం చేసుకుంది. కొంత విరామం తర్వాత సీనియర్ దర్శకుడు కృష్ణవంశీ రూపొందిస్తున్న తాజా చిత్రం 'రంగమార్తాండ'. మరాఠీ చిత్రం 'నటసామ్రాట్' ఆధారంగా తెరకెక్కుతున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం జరుగుతున్నది. ప్రకాష్‌రాజ్, రమ్యకృష్ణ కీలక పాత్రల్ని పోషిస్తున్నారు. ఈ సినిమాలో శివాత్మిక ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు. షూటింగ్ లొకేషన్‌లో తీసిన ఆమె ఫొటోను ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు కృష్ణవంశీ. 'ఇద్దరూ లెజెండ్స్ కూతురు..నైపుణ్యం, చురుకుదనం, ప్రతిభాసంపత్తులు కలిగిన శివాత్మికతో సినిమా చేయడం ఆనందంగా ఉంది' అని తెలిపారు. రంగస్థల విశ్రాంతకళాకారుడి జీవితం నేపథ్యంతో కృష్ణవంశీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అనసూయ, రాహుల్ సిప్లిగంజ్, బ్రహ్మానందం కీలక పాత్రల్ని పోషిస్తున్నారు.


శివాత్మిక

# యాక్షన్ థ్రిల్లర్ 'రాఘవరెడ్డి'


స్నేహగుప్తా, అజయ్‌ఘోష్

శివ కంఠమనేని, నందితాశ్వేత జంటగా రూపొందుతున్న చిత్రానికి 'రాఘవరెడ్డి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'క్రిమినల్స్ కెనాట్ ఎస్కేప్' ఉపశీర్షిక. సంజీవ్ మేగోటి దర్శకుడు. జి.రాంబాబుయాదవ్, ఆర్.వెంకటేశ్వరరావు, కె.ఎస్.శంకరరావు నిర్మాతలు. ప్రస్తుతం ఈ సినిమా కోసం 'చదివిందేమో టెన్త్‌రో..అయ్యిందేమో డాక్టరో' అనే ప్రత్యేక గీతాన్ని హైదరాబాద్‌లో తెరకెక్కిస్తున్నారు. భాను నృత్య దర్శకత్వంలో స్నేహగుప్తా బృందంపై ఈ గీతాన్ని చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా శివ కంఠమనేని మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ సినిమా చేస్తున్నాం. ఫ్యామిలీ అంశాలు మేళవించిన యాక్షన్ థ్రిల్లర్ ఇది' అన్నారు. 'పోలీసులకు కూడా అంతుచిక్కని నేరాలపై పరిశోధన చేసే క్రిమినాలజీ ప్రొఫెసర్ పాత్రలో శివ కంఠమనేని కనిపిస్తారు. ఆద్యంతం ఉత్కంఠభరితమైన కథ, కథనాలతో అందరిని అలరించే చిత్రమిది. రాశి కీలక పాత్రలో నటిస్తున్నది. అజయ్‌ఘోష్, రఘుబాబు, అజయ్ ప్రతి నాయకులుగా కనిపిస్తారు. ప్రేమ, సెంటిమెంట్, యాక్షన్ అంశాలు కలబోసిన థ్రిల్లర్ గా మెప్పిస్తుంది' అన్నారు. షూటింగ్ చివరి దశకు చేరుకుందని నిర్మాతలు తెలిపారు.

# మరో భారతీయుడికి అమెరికాలో అత్యున్నత పదవి

సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్‌గా సేతురామన్ పంచనాథన్ నియామకం

**వాషింగ్టన్, డిసెంబర్ 20:** మరో భారతీయుడిని అమెరికాలో అత్యున్నత పదవి వరించింది. ఆ దేశానికి చెందిన ప్రసిద్ధ జాతీయ సైన్స్ ఫౌండేషన్ (ఎన్ఎస్ఎఫ్) డైరెక్టర్‌గా డాక్టర్ సేతురామన్ పంచనాథన్‌ను అధ్యక్షుడు ట్రంప్ నియమించారు. వైట్ హౌస్‌లోని సైన్స్ అండ్ టెక్నాలజీ విధాన డైరెక్టర్ కెల్విన్ డ్రోగెమియర్ ఈ మేరకు వెల్లడించారు. పరిశోధన, ఆవిష్కరణ, విద్యా పరిపాలన రంగాల్లో అపార అనుభవం ఉన్న డాక్టర్ సేతురామన్ పంచనాథన్ ఈ పదవికి వన్నె తెస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. భారతీయ అమెరికన్ అయిన ఆయన కంప్యూటర్ శాస్త్రవేత్తగా పేరుగాంచారు. ప్రస్తుతం అరిజోనా స్టేట్ యూనివర్సిటీ పరిశోధన, ఆవిష్కరణల ముఖ్య అధికారిగాను, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌గాను ఉన్నారు. ఎన్ఎస్ఎఫ్ డైరెక్టర్‌గా ఆరేండ్లపాటు ఉన్న ఫ్రాన్స్‌కు చెందిన కోరొడోవ స్థానాన్ని 58 ఏండ్ల సేతురామన్ భర్తీ చేయనున్నారు. తమిళనాడుకు చెందిన సేతురామన్ 1981లో మద్రాస్ యూనివర్సిటీలో బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశారు. 1984లో బెంగళూరు ఐఐఎస్సీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ అభ్యసించారు. 1986లో ఐఐటీ మద్రాస్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. 1989లో కెనడాలోని అట్టావా యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ చేశారు. అనంతరం అమెరికాలో స్థిరపడిన ఆయన అరిజోనా స్టేట్ యూనివర్సిటీలోని సీయూసీకి వ్యవస్థాపక డైరెక్టర్‌గా వ్యవహరించారు. 2014లో జాతీయ సైన్స్ ఫౌండేషన్‌కు నియమితులైన ఆయన ఆ సంస్థ వ్యూహాత్మక కమిటీకి నేతృత్వం వహించారు. అమెరికా జాతీయ సలహా మండలిలో ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సభ్యుడిగా సేవలందించారు. 2018లో అరిజోనా స్టేట్ సైన్స్ అండ్ టెక్నాలజీ సీనియర్ సలహాదారుగా నియమితులయ్యారు.



# అత్యంత పురాతన శిలాజారణ్యం గుర్తింపు!

న్యూయార్క్‌లో కనిపెట్టిన శాస్త్రవేత్తలు

భూమి మీద వృక్ష సంపద ఆవిర్భావం వంటి పరిణామ కోణాల్ని తెలుసుకునే అవకాశం

**న్యూయార్క్, డిసెంబర్ 20:** ప్రపంచంలోనే అత్యంత పురాతన శిలాజారణ్యాన్ని అమెరికాలోని న్యూయార్క్ రాష్ట్రంలో పరిశోధకులు కనుగొన్నారు. ఇసుక, రాళ్లతో నిండివున్న ఓ క్వారీలో ఈ శిలాజాల్ని గుర్తించారు. న్యూయార్క్ నగరానికి సమీపంలోని కైరో పట్టణంలో ఈ ఆనవాళ్లను కనిపెట్టారు. భూమి ఏర్పడినప్పుడు వృక్ష సంపద ఎలా ఆవిర్భవించింది అన్న దాంతోపాటు పరిణామం తాలూకు ఇతర అంశాలను ఈ శిలాజారణ్యం ద్వారా తెలుసుకునే అవకాశం ఉన్నదని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకూ గుర్తించిన మూడు శిలాజారణ్యాల కంటే తాజా శిలాజారణ్యం మరింత పురాతనమైనది. 38.6 కోట్ల సంవత్సరాల క్రితం ఈ అడవి మనుగడలో ఉండేదని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. గతంలో గిల్బో పట్టణంలో గుర్తించిన శిలాజారణ్యం కంటే తాజా శిలాజాలు ఇరవై లక్షల నుంచి ముప్పై లక్షల సంవత్సరాల కంటే పురాతనమైనవి. 'ఇలాంటి శిలాజారణ్యాలు చాలా అరుదు. వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్ మోతాదును వృక్షాలు ఎలా తగ్గించాయన్న తదితర అంశాల్ని తెలుసుకోవాలంటే, పురాతన అడవుల గురించి క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది' అని కార్డిఫ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఎర్త్ అండ్ ఓషన్ సైన్సెస్ శాస్త్రవేత్త క్రిస్ బెర్రీ పేర్కొన్నారు.





జైపూర్‌లో వరుస బాంబు పేలుళ్లకు పాల్పడిన కేసులో మరణశిక్షకు గురైన నలుగురు దోషులు

## జైపూర్ పేలుళ్ల దోషులకు మరణశిక్ష

- తీర్పు వెల్లడించిన ప్రత్యేక కోర్టు
- 2008లో వరుస పేలుళ్ల ఘటన, 70 మంది దుర్మరణం

**జైపూర్:** పదకొండేండ్ల క్రితం జైపూర్‌లో వరుస బాంబు పేలుళ్లకు పాల్పడిన కేసులో నలుగురు దోషులకు రాజస్థాన్‌లోని జైపూర్ ప్రత్యేక కోర్టు శుక్రవారం మరణశిక్ష విధించింది. వీరిని దోషులుగా తేలుస్తూ బుధవారం కోర్టు తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో సైపుర్ రహ్మాన్, సర్వర్‌ఆజ్మీ, మహమ్మద్ సైఫ్, సల్మాన్‌కు మరణశిక్షను ఖరారు చేస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అజయ్ కుమార్ శర్మ తీర్పు ప్రకటించారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వీరంతా ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. పర్యాటక నగరమైన జైపూర్ 2008 మే 13వ తేదీన వరుస బాంబు పేలుళ్లతో దద్దరిల్లింది. తొమ్మిది ప్రాంతాల్లో బాంబులు పెట్టగా ఎనిమిది బాంబులు పేలాయి. ఈ వరుస ఘటనల్లో 70 మంది దుర్మరణం పాలవగా, 185 మంది తీవ్రంగా గాయపడ్డారు. కేసు నమోదు చేసుకొన్న జైపూర్ పోలీసులు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కోర్టులో ప్రవేశపెట్టగా.. పదేండ్ల సుదీర్ఘ విచారణ అనంతరం వారిని దోషులుగా కోర్టు నిర్ధారించింది.

### దేశవ్యాప్తంగా సంచలనం

2008లో జైపూర్ పాత నగరంలోని హనుమాన్ ఆలయంతోపాటు ఏడు ప్రాంతాల్లో వరుస పేలుళ్లు జరిగాయి. రెండు కిలోమీటర్ల పరిధిలో 16 నిమిషాల వ్యవధిలో పేలుళ్లు చోటుచేసుకొన్నాయి. తొలుత హవా మహల్ వద్ద పేలుడు సంభవించింది. పేలుళ్లు జరిగిన రెండు రోజుల తర్వాత ఘటనకు బాధ్యత వహిస్తూ ఇండియన్ ముజాహిదీన్ ప్రకటన చేసింది. ఈ వరుస బాంబు పేలుళ్లు అప్పట్లో దేశవ్యాప్తంగా భయాందోళనలు సృష్టించాయి. కాగా, ఇండియన్ ముజాహిదీన్ తరఫున పేలుళ్లకు బాధ్యత వహిస్తున్నట్టు పోలీసులకు ఈ మెయిల్ పంపిన లక్నో వాసి షాబాజ్ హుస్సేన్‌ను కోర్టు నిర్దోషిగా విడుదల చేసింది. 2008లో ఢిల్లీ, జైపూర్, అహ్మదాబాద్‌తో పాటు యూపీ కోర్టులో బాంబు పేలుళ్లకు సూత్రధారి అయిన ఇండియన్ ముజాహిదీన్ తీవ్రవాది ఆరిజ్‌ఖాన్ అలియాస్ జునాయిద్‌ను ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు 2018 ఫిబ్రవరిలో అరెస్ట్ చేశారు. జైపూర్ పేలుళ్లకు ముందు మందుగుండు సామగ్రిని తెచ్చుకొనేందుకు అతిఫ్ అమీన్ అనే వ్యక్తితో కలిసి జునాయిద్ ఉడిపి వెళ్లాడు. ఉడిపిలోని ఓ హోటల్‌లో ఉన్న రియాజ్ భత్కల్, యాసిన్ భత్కల్‌ను కలువగా.. వారికి పెద్ద మొత్తంలో డిటోనేటర్లను అందజేశాడు. పేలుళ్లు జరుగడానికి పది రోజుల ముందు అతిఫ్ అమీన్, మరికొందరితో కలిసి జునాయిద్.. ఢిల్లీలోని జోధ్‌పూర్ హౌస్ నుంచి వేర్వేరుగా బస్సులెక్కి జైపూర్ చేరుకొన్నారు. రెక్కీ చేపట్టిన తర్వాత జునాయిద్, అతిఫ్ అమీన్ ఢిల్లీ వెళ్లిపోయారు. బాట్లా హౌస్ ఎన్‌కౌంటర్లో బాంబు దాడులకు పాల్పడినవారిలో ఇద్దరు చనిపోగా.. మిగతా ఐదుగురు పరారయ్యారు.

# సెంగార్‌కు జీవితాంతం ఖైదు

- రూ.25 లక్షల జరిమానా.. ఉన్నావ్ లైంగిక దాడి కేసులో బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యేకు శిక్ష ఖరారు చేసిన ఢిల్లీ కోర్టు
- బాధితురాలి కుటుంబ రక్షణకు ఏర్పాట్లు చేయాలని సీబీఐకి ఆదేశం
- వారి భద్రతపై మూణ్నెళ్లకొకసారి సమీక్షించాలని నిర్దేశం
- సెంగార్‌కు ఉరిశిక్ష విధించాలన్న బాధిత కుటుంబం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉన్నావ్ లైంగికదాడి కేసులో ఢిల్లీ కోర్టు శుక్రవారం శిక్షను ఖరారుచేసింది. ఈ కేసులో దోషిగా తేలిన బీజేపీ బహిష్కృత ఎమ్మెల్యే కుల్దీప్ సెంగార్‌ను జీవితాంతం మరణించేవరకు జైల్లోనే ఉంచాలని జిల్లా జడ్జి ధర్మేశ్ కుమార్ తీర్పు చెప్పారు. అలాగే సెంగార్‌కు రూ.25 లక్షల జరిమానా కూడా విధించారు. నెలలోగా ఈ మొత్తాన్ని చెల్లించాలని నిర్దేశించారు. ఒకవేళ చెల్లించలేకపోతే సీఆర్‌పీసీ ప్రకారం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర ఖజానా నుంచి ఈ మొత్తం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. ప్రజాస్వామ్య పదవిలో ఉండి ఎమ్మెల్యే సెంగార్ చేసిన దుర్మార్గ చర్య వల్ల ప్రజల్లో అతడిపై విశ్వాసం పోయిందని కోర్టు వ్యాఖ్యానించింది. 'మైనర్ బాలికపై లైంగిక దాడి నేరం.. ఆమె గౌరవం, పవిత్రత, ప్రతిష్ఠపై మచ్చలాగా మిగిలిపోతుంది. పలుకుబడి కలిగిన వ్యక్తులు పాల్పడిన ఇలాంటి క్రూరమైన నేరాల్లో దయ చూపడం న్యాయాన్ని అవహేళన చేయడమే. కాబట్టి దయ చూపాలన్న పిటిషన్‌ను కొట్టివేస్తున్నాం. దోషి కుల్దీప్ సెంగార్‌కు జీవితఖైదు విధిస్తున్నాం. దీనర్థం.. ఐపీసీ సెక్షన్ 376 (2)ను అనుసరించి అతడు జీవితాంతం జైల్లోనే ఉండాలి' అని కోర్టు శిక్షను ప్రకటించింది. లైంగికదాడి బాధితురాలి తల్లికి అదనంగా రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. బాధితురాలికి, ఆమె కుటుంబానికి ఏమైనా ముప్పు పొంచి ఉన్నదేమోనన్న దానిపై ప్రతిమూడు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహించాలని సీబీఐకి కోర్టు నిర్దేశించింది. ఢిల్లీ మహిళా కమిషన్ ఏర్పాటు చేసిన వసతిలో బాధితురాలి కుటుంబం మరో ఏడాదిపాటు కొనసాగవచ్చని, అందుకు యూపీ ప్రభుత్వం నెలకు రూ.15,000 అద్దె చెల్లించాలని ఆదేశించింది. సురక్షితమైన నివాసం/గుర్తింపులను మార్చడం (బాధితురాలి కుటుం బం కోరుకుంటే) ద్వారా బాధితురాలు, ఆమె కుటుంబం స్వేచ్ఛగా, సురక్షితంగా జీవించేలా చూసే బాధ్యత సీబీఐదేనని పేర్కొంది. ఏదైనా అవసరం అయితే సీబీఐ లేదా బాధితురాలు, లేదా ఆమె కుటుంబం.. ఢిల్లీ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీని, లేదా డిస్ట్రిక్ట్ విట్‌నెస్ ప్రొటెక్షన్ కమిటీని సంప్రదించవచ్చని కోర్టు సూచించింది. ఉద్యోగం ఇప్పించమని కోరడానికి వచ్చిన ఉన్నావ్ మైనర్ బాలికపై 2017లో కుల్దీప్ సెంగార్ లైంగికదాడికి పాల్పడ్డాడు. ఐపీసీ, పోక్సో చట్టం కింద ఆయనను గత సోమవారం కోర్టు దోషిగా తేల్చింది. పోక్సో చట్టంలో మరణశిక్ష నిబంధన చేరుస్తూ గత ఆగస్టులో చట్టాన్ని సవరించిన విషయం తెలిసిందే. అయితే చట్ట సవరణ కంటే ముందే ఈ ఘటన జరుగడంతో ఆ నిబంధన ఈ కేసుకు వర్తించదు. కాగా, ఈ కేసులో సహ నిందితురాలిగా ఉన్న శశిసింగ్‌ను కోర్టో నిర్దోషిగా ప్రకటించింది. ఆమె పాత్రను నిరూపించడంలో సీబీఐ విఫలమైందని పేర్కొంది. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు బాధితురాలు లేఖ రాసిన తర్వాత, ఆమె కుటుంబంపై పలు క్రిమినల్ కేసులు నమోదుకావడంలో సెంగార్ పాత్ర ఉన్నట్లు స్పష్టంగా కనబడుతున్నదని కోర్టు వ్యాఖ్యానించింది. చార్జిషీటు దాఖలులో జాప్యం చేయడం, దర్యాప్తు సమయంలో మహిళా అధికారి లేకపోవడంపై కోర్టు విస్మయం వ్యక్తంచేసింది. పోక్సో చట్టంలో లోపం లేదని, చట్టాన్ని సమర్థంగా అమలు చేయకపోవడంలోనే లోపమున్నదని కోర్టు ఆక్షేపించింది. కాగా, ఈ ఏడాది జూలై 28న బాధితురాలు తన బంధువులతో కలిసి కారులో ప్రయాణిస్తుండగా, ఒక లారీ వారి కారును బలంగా ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఆమె బంధువులైన ఇద్దరు మహిళలు మృతిచెందగా, బాధితురాలు, ఆమె న్యాయవాది తీవ్రంగా గాయపడ్డారు.

### మరో నాలుగు కేసులు పెండింగ్‌లో..

2017 జూన్ 11న మరో ముగ్గురు వ్యక్తులు తనపై లైంగికదాడికి పాల్పడినట్లు ఉన్నావ్ బాధితురాలు దాఖలు చేసిన మరో కేసుపై ఇంకా విచారణ జరుగాల్సి ఉన్నది. అలాగే బాధితురాలి తండ్రిపై నమోదైన అక్రమ ఆయుధాల కేసు, జ్యుడిషియల్ కస్టడీలో ఆయన మరణించిన కేసు, బాధితురాలి కారు యాక్సిడెంట్ కేసు కూడా పెండింగ్‌లో ఉన్నాయి.

### మరణశిక్ష విధించాలి: బాధితురాలి కుటుంబం

ఉన్నావ్ లైంగికదాడి కేసులో దోషి కుల్దీప్ సెంగార్‌కు మరణశిక్ష పడుతుందని తాము భావించామని బాధితురాలి కుటుంబ సభ్యులు శుక్రవారం పేర్కొన్నారు.' కుల్దీప్ సెంగార్‌కు మరణశిక్ష విధిస్తేనే మాకు సంపూర్ణ న్యాయం దక్కేది. అప్పుడే మాకు సంతృప్తి కలిగేది. అప్పుడే మాకు భద్రత చేకూరేది' అని బాధితురాలి సోదరి వ్యాఖ్యానించారు. 'సెంగార్ జైల్లో ఉన్నప్పటికీ మాకు భయంగానే ఉంది. అతడు బయటకు వస్తే మమ్మల్ని బతకనివ్వడు' అని ఆమె భయాందోళన వ్యక్తంచేసింది.

## 'రాంచీ నిర్భయ' కేసులో నెల రోజుల్లోనే తీర్పు!

రాహుల్ రాజ్‌ను దోషిగా నిర్ధారించిన న్యాయస్థానం

నేడు శిక్ష విధించే అవకాశం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:** మూడేండ్ల క్రితం జార్ఖండ్ రాజధాని రాంచీలో ఇంజినీరింగ్ విద్యార్థినిపై లైంగికదాడి, హత్య కేసుకు సంబంధించి రాహుల్ రాజ్ అనే వ్యక్తిని దోషిగా తేలుస్తూ రాంచీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. నెలరోజుల వ్యవధిలో విచారణను పూర్తి చేసిన న్యాయస్థానం దోషికి శనివారం శిక్షను ఖరారు చేసే అవకాశమున్నట్టు సీబీఐ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. రాంచీలోని బూటీ బస్తీలో బాధిత విద్యార్థిని నివాసం ఉంటుంది. 2016, డిసెంబర్ 16వ తేదీన బాధితురాలి సోదరి ఆమెతో ఫోన్‌లో మాట్లాడాలని ప్రయత్నించింది. ఎంతగా ప్రయత్నించినప్పటికీ, బాధితురాలి నుంచి ఎలాంటి సమాధానం లేకపోవడంతో పొరుగున ఉన్న వాళ్లను ఇంటికి వెళ్లి చూడమని బాధితురాలి సోదరి పురమాయించింది. ఇంట్లోకి వెళ్లి చూసిన పొరుగింటి మహిళ.. వివస్త్రగా ఉన్న బాధిత విద్యార్థిని మంటల్లో కాలిపోయి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించింది. పోస్ట్‌మార్టం నివేదికలో బాధితురాలిపై లైంగిక దాడి జరిగినట్టు, నిందితులు ఆమెను గొంతు నులిమి హత్య చేసినట్టు తేలింది. స్థానికంగా ఈ కేసు సంచలనాన్ని సృష్టించింది. నిర్భయ ఘటన(2012, డిసెంబర్ 16) జరిగిన నాలుగు సంవత్సరాల తర్వాత జరిగిన ఈ ఘటనను 'రాంచీ నిర్భయ'గా పిలిచారు. దోషులను వెంటనే శిక్షించాలని విద్యార్థులు పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం జనవరి 3, 2017న సీబీఐ విచారణకు ఆదేశించింది. బాధితురాలి మృతదేహంపై లభించిన డీఎన్ఏ, రాహుల్ రాజ్ డీఎన్ఏతో సరిపోలటంతో.. ఈ ఏడాది జూన్ 23న రాజ్‌ను సీబీఐ తన కస్టడీలోకి తీసుకొని రాంచీకి తరలించింది. ఫోరెన్సిక్ సాక్ష్యాలు సేకరించిన తర్వాత రాహుల్ రాజ్‌పై సీబీఐ అధికారులు చార్జ్‌షీట్ దాఖలు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. నవంబర్ 8 నుంచి సీబీఐ ప్రత్యేక కోర్టులో రోజువారీ విచారణ జరిగింది. నిందితుడు రాహుల్ రాజ్‌ను దోషిగా తేలుస్తూ కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది.



అమర పోలీస్ బూటును ముద్దాడిన వైఎస్సార్సీపీ ఎంపీ గోరంట్ల మాధవ్

## పోలీస్ బూటును ముద్దాడిన ఎంపీ

మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డికి గోరంట్ల మాధవ్ కౌంటర్

**అనంతపురం:** పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డిపై హిందూపురం వైఎస్సార్సీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ మండిపడ్డారు. శుక్రవారం తన నివాసంలో మాట్లాడిన ఆయన జేసీ వ్యాఖ్యలను ఖండించారు. 'అధికారంలోకి వస్తే తమ బూట్లు నాకే పోలీసులను తెచ్చుకుంటాం' అన్న జేసీ మాటలకు కౌంటర్‌గా అమర పోలీస్ బూటును మాధవ్ స్వయంగా శుభ్రం చేసి ముద్దాడారు. దేశ రక్షణకు పోలీసులు ప్రాణాలు అర్పిస్తున్నారని, అలాంటి వారిపై జేసీ జుగుప్సాకరంగా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను గుర్తుంచుకోవాలని హితవుపలికారు. గతంలో పోలీసులపై అనుచిత వ్యాఖ్యలుచేస్తే ప్రజలు జేసీని బజారుకీడ్చారని, రాజకీయంగా సమాధి కట్టారని చెప్పారు. జేసీ అలా మాట్లాడుతుంటే దుర్యోధనుడిలా టీడీపీ అధినేత చంద్రబాబు నవ్వారని విమర్శించారు.

# గ్రామాల వికాసానికే పల్లెప్రగతి

- మెరుగైన పనితీరుతో మంచిపేరు తెచ్చుకోవాలి
- ప్రజలు, ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేయండి
- ఎంపీవోల శిక్షణ ముగింపులో మంత్రి ఎర్రబెల్లి



ఎంపీవోల శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి. చిత్రంలో పంచాయతీరాజ్ కమిషనర్ ఎం రఘునందన్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రామాల సమగ్ర వికాసం కోసమే ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమం చేపట్టిందని, త్వరలో రెండోదశకు సిద్ధమవుతున్నట్టు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చెప్పారు. గ్రూప్-2లో మండల పంచాయతీ అధికారులు (ఎంపీవో)లుగా నియమితులైన వారికి పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి మంత్రి ఎర్రబెల్లి శుక్రవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో సేవచేసే అవకాశం కొందరికే లభిస్తుందని, ఎంపీవోలుగా ఎంపికైనవాళ్లు చాలా అదృష్టవంతులని చెప్పారు. మెరుగైన పనితీరుతో తల్లిదండ్రులు, ఊరికి పేరు తేవాలని కోరారు. అధికారులకు సామాజిక సేవా స్పృహ ఉంటే ఎక్కువ అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. వృత్తిలో భాగంగా చేసే మంచి పనులతోనే గౌరవం పెరుగుతుందని, విధి నిర్వహణలో చెడు కనిపిస్తే ఊరుకోవద్దని సూచించారు. గ్రామాల అభివృద్ధి బాధ్యత ఎంపీవోలపై ఉందని, వైకుంఠధామాలు, నర్సరీ, డంపింగ్‌యార్డులను నిర్మించాలని కోరారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం పట్టుదలతో పనిచేస్తున్నారని, అసాధ్యమనుకున్న 24 గంటల కరంటు, కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్‌భగీరథను సాకారం చేసి చూపారని గుర్తుచేశారు. ఇప్పుడు గ్రామాల సమగ్ర వికాసం కోసం పల్లె ప్రగతి ప్రణాళిక చేస్తున్నారని తెలిపారు. ప్రజలు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని గ్రామాలను అభివృద్ధిచేయాలని ఎంపీవోలకు మంత్రి ఎర్రబెల్లి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ కమిషనర్ ఎం రఘునందన్ రావు, డిప్యూటీ కమిషనర్లు, 63 మంది నూతన ఎంపీవోలు పాల్గొన్నారు.



'విజయ తెలంగాణ' పేరుతో కేంద్రప్రభుత్వ ట్రేడ్‌మార్కు అథారిటీ జారీచేసిన ధ్రువపత్రాన్ని చూపిస్తున్న పాడి పరిశ్రమాభివృద్ధి సహకారసంస్థ చైర్మన్ లోకా భూమారెడ్డి

## విజయ తెలంగాణగా విజయ పాలు

బ్రాండ్ పేరు మార్పునకు కేంద్రం అనుమతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విజయ డెయిరీ పాలు ఇకమీదట 'విజయ తెలంగాణ' పేరుతో మార్కెట్‌లోకి రానున్నాయి. విజయ పేరును విజయ తెలంగాణగా మార్చుకునేందుకు కేంద్రప్రభుత్వం అనుమతిచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ డెయిరీ అయిన విజయ పాలు రాష్ట్ర విభజన తర్వాత కూడా అదే బ్రాండ్ పేరుతో రెండు రాష్ట్రాల్లో విక్రయాలు కొనసాగిస్తున్నది. దీంతో ఒక్కోసారి సమస్యలు తలెత్తుతున్నాయి. దీనిని అధిగమించేందుకు తెలంగాణ పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ.. విజయ తెలంగాణ లోగోతో కేంద్ర ప్రభుత్వ సంస్థ ట్రేడ్‌మార్కు అథారిటీకి అనుమతి కోసం సంప్రదించింది. అన్ని అంశాలను పరిశీలించాక ట్రేడ్‌యాక్టు 1999 ప్రకారం రిజిస్ట్రార్ ఆఫ్ ట్రేడ్‌మార్క్ విజయ తెలంగాణ బ్రాండ్‌ను రిజిస్ట్రేషన్ చేసి, ధ్రువపత్రాన్ని జారీచేశారు. దీంతో ఇప్పటినుంచి తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ పాలు, పాల ఉత్పత్తులు 'విజయ తెలంగాణ' బ్రాండ్‌తో మార్కెట్‌లో విక్రయించనున్నట్టు పాడి పరిశ్రమాభివృద్ధి సహకారసంస్థ చైర్మన్ లోకా భూమారెడ్డి తెలిపారు.

## 2020లో కార్మిక సెలవులు

ప్రకటించిన తెలంగాణ కార్మికశాఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పరిశ్రమలు, దుకాణాలు, సూపర్‌మార్కెట్లు, ఇతరత్రా వ్యాపారసంస్థల్లో పనిచేసే ఉద్యోగులు/కార్మికులకు 2020 ఏడాదికి సంబంధించిన సెలవులను తెలంగాణ కార్మికశాఖ వెల్లడించింది. తెలంగాణ ఫ్యాక్టరీస్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, 1974, తెలంగాణ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, 1988 ప్రకారం సెలవుల జాబితాను కార్మికశాఖ ప్రకటించింది. ఈ చట్టాల ప్రకారం ఆయా సెలవు రోజులను యాజమాన్యాలు తప్పనిసరిగా అమలుచేయాలని కార్మికశాఖ అధికారులు పేర్కొన్నారు. సంక్రాంతి (జనవరి 15), రిపబ్లిక్ డే (జనవరి 26), మహాశివరాత్రి మరుసటిరోజు (జనవరి 22), మే డే (మే1), రంజాన్ (మే 25), తెలంగాణ ఆవిర్భావదినం (జూన్ 2), స్వాతంత్ర్యదినం (ఆగస్టు 15), గాంధీ జయంతి (అక్టోబర్ 2), దసరా (అక్టోబర్ 25), క్రిస్మస్ (డిసెంబర్ 25) ఉన్నాయి. ఈ పండుగలు, ప్రత్యేక సెలవుల్లో వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని కార్మికశాఖ స్పష్టంచేసింది.



శిక్షణ పూర్తి చేసుకున్న సీఐఎస్ఎఫ్ కానిస్టేబుళ్ల పాసింగ్ ఔట్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ డైరెక్టర్ అంజనా సిన్హా

## దేశ భద్రతే ధ్యేయంగా శ్రమించాలి

శిక్షణ పూర్తి చేసుకున్న సీఐఎస్ఎఫ్ కానిస్టేబుళ్ల పాసింగ్‌ఔట్ పరేడ్‌లో డైరెక్టర్ అంజనాసిన్హా పిలుపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శిక్షణ పూర్తిచేసుకున్న కానిస్టేబుళ్లు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే దేశ భద్రత కోసం శ్రమించాలని నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ డైరెక్టర్ అంజనాసిన్హా పిలుపునిచ్చారు. శుక్రవారం హకీంపేటలోని ఫైర్ సర్వీస్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న సీఐఎస్ఎఫ్ కానిస్టేబుళ్లకు పాసింగ్‌ఔట్ పరేడ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె కానిస్టేబుళ్ల గౌరవవందనం స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ.. శిక్షణ కాలంలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో తూచా తప్పకుండా పాటించాలని చెప్పారు. తాము పనిచేస్తున్న ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సకాలంలో చేరుకుని ఆస్తులను, ప్రాణాలను కాపాడాలన్నారు. శిక్షణ కాలంలో ప్రతిభ చూపిన కానిస్టేబుళ్లకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కానిస్టేబుళ్ల ప్రదర్శన ఆహూతులను అలరించింది. దేశభక్తి గీతాలు, యోగా, కరాటే, కర్రసాము, కత్తి యుద్ధం తదితర విభాగాల్లో విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నేపాల్, మాల్‌దీవ్స్, భూటాన్, బంగ్లాదేశ్, ఫిలిప్పీన్స్ దేశాలకు చెందిన ఉన్నతాధికారులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## ఏడాది పొడవునా 'ఆపరేషన్ స్మైల్'

- పిల్లల రవాణా ముఠాలపై కఠిన వైఖరి
- ఆపరేషన్ స్మైల్-6 ప్రారంభంలో డీజీపీ మహేందర్‌రెడ్డి ప్రకటన



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పిల్లల అక్రమ రవాణాకు పాల్పడే ముఠాలపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని పోలీస్ సిబ్బందికి డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి సూచించారు. తప్పిపోయిన పిల్లలను గుర్తించడంతోపాటు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు జనవరి ఒకటి నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్-6 రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని కేవలం నెలకు పరిమితం చేయకుండా ఏడాదిపాటు నిర్వహించేలా చర్యలు చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఆపరేషన్ స్మైల్-6పై శుక్రవారం డీజీపీ కార్యాలయంలో పోలీస్ అధికారులు విద్యా, మహిళా, శిశుసంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఆపరేషన్ స్మైల్-5లో ఉత్తమ ప్రతిభకనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని డీజీపీ మహేందర్‌రెడ్డి అభినందించారు. ఆపరేషన్ స్మైల్‌పై రూపొందించిన పోస్టర్లు, మార్గదర్శకాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ తప్పిపోయిన, అపహరణకు గురైన పిల్లలను, బాలకార్మికులుగా ఉన్నవారిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించడం గొప్ప కార్యమని చెప్పారు. ఉద్యోగం చేస్తున్నామన్న భావనతోకాకుండా మానవతాదృక్పథం, విశ్వసనీయతతో విధులు నిర్వర్తిస్తేనే సత్ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. బాలలను రక్షించడంతోపాటు వారి దీర్ఘకాలిక బాగోగులు చూసేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు.

### ఆపరేషన్ స్మైల్‌లో గుర్తించిన పిల్లలకు వసతి

మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జగదీశ్వర్ మాట్లాడుతూ.. పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసమే ఆపరేషన్ స్మైల్-6 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 38 చిల్డ్రన్ హోంలు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే 450 చైల్డ్ కేర్ సెంటర్లు ఉన్నాయని, వీటిలో ఆపరేషన్ స్మైల్‌లో గుర్తించిన పిల్లలకు వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. ఉమెన్ సేఫ్టీవింగ్ ఇంచార్జి, ఐజీ స్వాతిలక్రా మాట్లాడుతూ.. తప్పిపోయిన, అనాథఆశ్రమాల్లో ఉన్న పిల్లల ముఖాలతో కూడిన సమాచారం తమ వద్ద ఉన్నదని, 'దర్పన్' అనే సాంకేతికతతో ఇప్పటివరకు 27 మంది చిన్నారులను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించినట్టు తెలిపారు. ఇప్పటివరకు ఐదు విడతల ఆపరేషన్ స్మైల్‌లో 32వేల మంది చిన్నారులను చేరదీసి, 16,823 మందిని కుటుంబసభ్యులకు అప్పగించినట్టు సీఐడీ ఎస్పీ సుమతి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర లీగల్‌సెల్ అథారిటీ కార్యదర్శి జీవీ సుబ్రమణ్యం, విద్యాశాఖ డైరెక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.


'DIL' RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
A 'DIL' RAJU PRODUCTION
DECEMBER 25TH RELEASE
U r my heart beat
ఇద్దరి లోకం ఒకటే
SHIRISH MICKEY J MEYER G R KRISHNA
HARSHITH REDDY - BEKKEM VENUGOPAL (GOPI) SAMEER REDDY ABBURI RAVI
TAMMI RAJU BANDI RATNA KUMAR RAMANA VANKA STUNT SIVA
G ANUHYA REDDY BHANU VIJAY
ADITYA MUSIC
U/A


MYTHRI MOVIE MAKERS
CLAP ENTERTAINMENT
DECEMBER 25TH WORLDWIDE RELEASE
DO NOT CROSS
POLICE
NOT CROSS
WRITTEN & DIRECTED BY RITESH RANA
PRODUCED BY CHIRANJEEVI (CHERRY), HEMALATHA
MUSIC KAALA BHAIRAVA DOP SURESH SARANGAM
ART A.S. PRAKASH EDITOR KARTHIKA SRINIVAS
RAGHUNATH.K P.T.GIRIDHAR RAO SHANKAR THOMAS JAY TEJA R


పడి పడి నవ్వుతుండగా, ప్రతి థియేటర్ లో పండగే...
UV creations
ALLU ARAVIND PRESENTS
GA2 PICTURES
ప్రతిరోజూ పండగే
MARUTHI BUNNY VAS THAMAN S
A THAMAN MUSICAL


LEGENDARY
MASS HIT
సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ (ప్రై.) లిమిటెడ్ సమర్పించు
హ్యాపీ మూవీస్
BALAKRISHNA
రూలర్
POLICE
సి. కళ్యాణ్ కె. యస్. రవికుమార్
సి. వెంకటేశ్వరరావు - పత్స నాగరాజా చిరంతన్ భట్
సి. రాంప్రసాద్ పరుచూరి మురళి చిన్నా జాన్ అబ్రహం రామ్-లక్ష్మణ్ అన్‌బరివు వంశీ శేఖర్
ADITYA MUSIC